
ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 28.10.2025 | సంపుటి :12 సంచిక : 97 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## ఆంధ్రాకు దూసుకొస్తున్న 'మొంథా' ముప్పు

- విజయవాడకు భారీ వర్ష సూచన..
- అప్రమత్తమైన యంత్రాంగం
- తుపాను ప్రభావంతో 100కి పైగా రైళ్లు రద్దు
- మంత్రులతో సమీక్షించిన సీఎం చంద్రబాబు
- లోకేశ్‌కు సమన్వయ బాధ్యతలు
- ముఖ్యమంత్రికి ప్రధాని మోదీ ఫోన్
- అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ

**అమరావతి(జనంసాక్షి):** మొంథా తుఫాన్ రాష్ట్రం వైపు దూసుకొస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో పలు అంశాలపై సీఎంతో ప్రధాని చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలను మోదీకి చంద్రబాబు వివరించారు. అనంతరం ఆర్టీజీఎస్‌లో మంత్రులు లోకేశ్, అనిత, సీఎస్ విజయానంద్, ఇతర ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి లోకేశ్‌కు సీఎం సూచించారు. ప్రతి గంటకూ తుపాను కదలికలను గమనిస్తూ అప్రమత్తంగా మిగతా 2లో..

## తెలంగాణకూ భారీ వర్ష సూచన

- రాగల నాలుగు రోజులు భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో రాగల నాలుగు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు మిగతా 2లో..



# పంటనష్టం జరగకుండా కొనుగోళ్లు చేయండి



### తెలంగాణలో వర్ష సూచనల దృష్ట్యా వరిధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రానికి వర్ష సూచన దృష్ట్యా రైతులకు నష్టం కలగకుండా పంటలు కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం ఆదేశాలతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటల కొనుగోళ్లకు తీసుకో వాల్సిన జాగ్రత్తలను దృశ్య మాధ్యమం ద్వారా వారికి వివ రించనున్నారు.రాష్ట్రంలో వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఎక్కడ ఏ సమయంలో వర్షం పడుతుందో తెలియక మిగతా 2లో..

### పత్తిలో నాణ్యత, తేమ శాతాన్ని దృష్టిలో ఉంచుకోవాలి

- 12 శాతం మించకుండా చూసుకోవాలి
- పత్తి రైతులకు మద్దతు ధర దక్కేలా ప్రయత్నాలు
- ఈ విషయమై కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశాం: మంత్రి తుమ్మల

2లో..

### తక్కువ ఖర్చుతో ప్రాణహిత - చేవెళ్ల

# పునరుద్ధరణ

**ఈ దిశగా ప్రపభుత్వం ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోంది**

- కొత్త డీపీఆర్ కోసం మళ్లీ భౌగోళిక, సాంకేతిక, పర్యావరణ సర్వేలు
- బ్యారేజ్ ఎత్తుపై మహారాష్ట్రతో చర్చలు జరుపుతాం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుని తక్కువ వ్యయంతో పునరుద్ధరించేలా తమ ప్రభుత్వం ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశర చేశారు. సుందిల్లా లింక్ ద్వారా కొత్త అలైన్‌మెంట్‌తో 10 నుంచి 12 శాతం వ్యయం తగ్గే అవకాశం ఉందని వివరించారు. భూసేకరణ సగం మేరకు తగ్గే మిగతా 2లో..

# డిజిటల్ అరెస్ట్‌లు అత్యంత భయానకం



- ఈ విషయంపై ప్రజలకు అవగాహన కలిగించాలి
- ఐపీఎస్ ప్రొబెషనర్లతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రజలను చైతన్యం చేయడంతోనే డిజిటల్ అరెస్ట్ ముప్పును ఛేదించవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఇందుకు పోలీస్ శాఖ చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురిచేస్తూ..భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి..తాము పోలీసులమని బెదిరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు మిగతా 2లో..

### డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీం ఆందోళన

ప్రణాళిక రూపొందించాలని సిబిఐకి ఆదేశం 2లో..

# 12 రాష్ట్రాలు/యూటీల్లో రెండో విడత ఎస్ఐఆర్

**ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కీలక ప్రకటన**

త్వరలో ఎన్నికలు జరుగనున్న అండమాన్ నికోబార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్లో నిర్వహణ




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం కీలక ప్రకటన చేసింది. రెండో దశలో 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను చేపట నున్నట్లు వెల్లడిం చింది తొలిదశలో బిహార్‌లో ఎస్ఐఆర్‌ను విజయవం తంగా పూర్తిచేసినట్లు తెలిపింది. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ.. "ఎస్ఐఆర్ రెండో దశ గురించి మాట్లాడేందుకు మనం ఇక్కడ సమావే శమయ్యాం. ఎస్ఐఆర్‌లో పాల్గొన్న 7.5 కోట్లమంది బిహార్ ప్రజలకు నా ధన్యవాదాలు. మొదటిదశ అనంతరం 36 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులతో ఈసీ సమావేశాలు నిర్వహించి, సమగ్రంగా చర్చించింది" అని వెల్లడించారు. అలాగే రెండోదశ జరగనున్న 12 రాష్ట్రాలు/ యూటీల పేర్లను వెల్లడించారు. అండమా న్ నికోబార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్లో జరగనున్న రెండో దశలో 51 కోట్లమంది ఓటర్లు భాగం కానున్నారు. నవంబర్ 4 నుంచి ఈ మిగతా 2లో..

### బీహార్ ఎస్ఐఆర్‌పై ప్రశ్నలు మిగిలే ఉన్నాయ్

ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ 2లో..

# జూబ్లీహిల్స్ బరిలో 58 మంది..

**ఇప్పటికే అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన ఎన్నికల అధికారులు**

**పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటి వరకూ 102 విజ్ఞాపనలు**

**హైదరాబాద్(జనంసాక్షి):**జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నారు. నోటా తో కలుపుకొని మొత్తం 59 మంది ఉన్నారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి 3 అభ్యర్థులు పోటీ లో ఉండగా , రిజిస్టర్డ్ పొలిటికల్ పార్టీల నుంచి 26 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మిగతా 29 మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఇప్పటికే అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 ఓటర్లు ఉండగా, ఈ ఉప ఎన్నిక కోసం 139 లొకేషన్ లలో మొత్తం 407 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటి వరకూ 102 రిక్వెస్ట్ లు వచ్చాయి. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఒక్కో పోలింగ్ కేంద్రానికి 4 బ్యాలెట్ యూనిట్ లను సీరీస్ శ్రేణిలో ఏర్పాటు మిగతా 2లో..

**అధికారిక గృహాల మరమ్మత్తులు..**

### సీలింగ్ రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంపు

తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ 2లో..



### ఆందోళనలో ఆటోడ్రైవర్లు

రాష్ట్రంలో వారి పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది

- తెలంగాణ భవన్‌కు ఆటోలో వచ్చిన కేటీఆర్
- మైనారిటీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- గురుకులాల్లో కనిపించని పురోగతి
- ఇప్పటి వరకు వందమంది విద్యార్థుల మృతి
- అయినా సర్కార్ స్పందించలేదని ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలోని ఆరు లక్షలకుపైగా ఆటో డ్రైవర్ల పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చెప్పారు. తెలంగాణ భవన్‌కు సోమవారం ఆయన ఆటోలో వచ్చారు. తాను వచ్చిన మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోలోనే అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ప్రయాణించినట్లు కేటీఆర్ చెప్పారు. మిగతా 2లో..

### యూకేలో దారుణం

భారత యువతిపై లైంగిక దాడి..
జాతి వివక్షతోనే ఘటన జరిగినట్లు పోలీసుల వెల్లడి

### అయిదేళ్ల తర్వాత..

భారత్-చైనా మధ్య నేరుగా విమానాల రాకపోకలు ప్రారంభం

### డంకీ రూట్‌లో అమెరికాకు

54 మంది భారతీయులు వెనక్కి

### అవశేషాల అప్పగింత పూర్తి

కర్నూలు బస్సు ఘటనలో మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించిన అధికారులు

వివరాలు 2వ పేజీలో..



### తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

కేంద్రానికి సిఫార్సు చేసిన ప్రస్తుత సీజేఐ 2లో..

### రష్యా చమురు విషయంలో అమెరికాది ద్వంద్వ వైఖరి

- ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కోదేశానికి ఒక్కోవిధానం అనుసరిస్తోంది
- ట్రంప్ చర్యలపై మండిపడ్డ కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్

**కౌలాలంపూర్(జనంసాక్షి):** రష్యా చమురు విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తప్పుబట్టారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కో దేశం పట్ల ఒక్కో విధంగా వ్యవహరిస్తుండడాన్ని తప్పుబట్టారు. 'సెలక్టివ్'గా నిబంధనలు వర్తింపజేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. నీతులు చెప్పేవారు మిగతా 2లో..





- ఈషాన్య రాష్ట్రాలు వాళ్లవేనట!
- బంగ్లా మ్యాప్‌లో మన ప్రాంతాలను పొందుపరిచి పాకిస్థాన్ జనరల్ షంషాద్ మీర్జాకు బహూకరణ

### బంగ్లాదేశ్ తాత్కాలిక సారధి యూనస్ దుస్సాహసం

**ఢాకా(జనంసాక్షి):**బంగ్లాదేశ్ తాత్కాలిక సారథిగా మహమ్మద్ యూనస్ అధికారం చేపట్టిన దగ్గరినుంచి భారత్‌తో దౌత్య సంబంధాలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఆయన తాజాగా మరోసారి భారత్‌పై విషం కక్కారు. భారత్ భూభాగాన్ని బంగ్లాదేశ్‌కు చెందినదిగా చూపిస్తూ ఉన్న వివాదాస్పద మ్యాప్‌ను పాకిస్థాన్ జనరల్ షంషాద్ మీర్జాకు బహూకరించారు. ఆ మ్యాప్‌లో భారత ఈశాన్య ప్రాంతాన్ని బంగ్లాదేశ్‌లో భాగంగా చిత్రీకరించారు. యూనస్ అధికారం చేపట్టిన దగ్గరినుంచి పాక్-బంగ్లా దగ్గరవుతున్నాయి. దీనిలో భాగంగా పాకిస్థాన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్‌పర్సన్ జనరల్ షంషాద్ మీర్జా ఇటీవల మిగతా 9లో..

జనంసాక్షి www.janamsakshi.org
మంగళవారం 28.10.2025

## డిజిటల్ అరెస్ట్‌లు అత్యంత భయానకం

ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

## డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీం ఆందోళన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**డిజిటల్ అరెస్టులపై సిబిఐ దర్యాప్తుల జరగాల్సి ఉందన్న అభిప్రాయాన్ని సుప్రీం పేర్కొంది. వరుసగా జరుగుతోన్న సైబర్ నేరాల కారణంగా పలువురు ఆర్థికంగా దోపిడీకి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ కేసుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఇటీవల వచ్చిన ఓ కేసును సుమోటాగా తీసుకొని విచారణ జరుపుతోంది ఈ నేరాలపై సీబీఐ దర్యాప్తును పర్యవేక్షిస్తానని పేర్కొంది. డిజిటల్ అరెస్టు కారణంగా తాను రూ.కోటి కోల్పోయానని హరియాణాకు చెందిన ఓ వృద్ధ మహిళ వేసిన కేసు నేపథ్యంలో ఈ విచారణ జరుగుతోంది. ఈ సందర్భంగా సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. మయన్మార్, థాయ్‌లాండ్ వంటి ఆఫ్‌షోర్ లొకేషన్ల నుంచి ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయని, ఈ కేసుల దర్యాప్తునకు ఒక ప్రణాళికను రూపొందించాలని సీబీఐను ఆదేశించింది. కేంద్ర ఏజెన్సీ దర్యాప్తులో పురోగతిని పరిశీలిస్తామని, దానిని బట్టి అవసరమైన ఆదేశాలను జారీ చేస్తామని పేర్కొంది. అలాగే డిజిటల్ అరెస్టు కేసులకు సంబంధించి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్ వివరాలను సమర్పించాలని ఆయా ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది.

## 12 రాష్ట్రాలు/యూటీల్లో రెండో విడత ఎస్ఐఆర్

ప్రక్రియ ప్రారంభం కానుంది. ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబర్ 9న ప్రకటిస్తామని, తుది జాబితాను ఫిబ్రవరి 7న విడుదల చేస్తామని చెప్పారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితత్వాన్ని నిర్ధారించడమే ఈ ఎస్ఐఆర్ లక్ష్యం. 1951 నుంచి ఈ సవరణను ఎనిమిదిసార్లు నిర్వహించామని, 2002-2004లో చివరిసారి ఈ ప్రక్రియ జరిగింది. వలసలు, నకిలీలు, 2002 నుంచి నమోదిత ఓటర్లు ఎవరైనా మరణించి ఉండటం వంటి కారణాలతో ఎస్ఐఆర్ నిర్వహించడం తప్పనిసరిగా మారింది. ప్రస్తుతం నిర్వహిస్తున్నది తొమ్మిదో సవరణ. ఫేజ్-2 ఎస్ఐఆర్ కోసం పోలింగ్ అధికారులకు మంగళవారం నుంచి శిక్షణ ప్రారంభంకానుందని జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. పౌరసత్వానికి ఆధార్ ఒక ధ్రువీకరణ పత్రం కాదని, అయితే ఎస్ఐఆర్‌లో దానిని ఒక ఐడెంటిటీ ప్రూఫ్‌గా సమర్పించవచ్చని ఆయన చెప్పారు. అస్సాంలో ఓటర్ల జాబితా సవరణను విడిగా నిర్వహిస్తామని తెలిపారు.

# పంటనష్టం జరుగకుండా కొనుగోళ్లు చేయండి

గందరగోళానికి గురవుతున్నారు. కొద్దిసేపు ఎండ కొద్దిసేపు వాన కురవడంతో రైతులకు ఏం చేయాలో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నోటికాడికి వచ్చిన పంట మొత్తం నీటి పాలవుతుండడంతో ముఖ్యంగా పత్తి, వరి సాగుచేస్తున్న రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

పండిన పత్తి మొలకెత్తే స్థితిలో : హనుమకొండ జిల్లా పరకాల రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా వాణిజ్య పంటగా పిలువబడే పత్తిని అత్యధిక విస్తీర్ణంలో సాగుచేశారు. జూన్ నెలలో పత్తి విత్తనాలు పెట్టిన రైతులకు సరైన వర్షాలు రాకపోవడంతో రెండు మూడు సార్లు విత్తనాలను వేశారు. రాత్రి, పగలు కష్టపడి కలుపు తీసి, ఎరువులు వేసి, పూర్తి పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలు పత్తి రైతులను కొలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. వరుస వానలకు పత్తి మొక్కలపైనే పత్తి తడిసి ముద్దవుతుంది. రంగు మారి, చేనుపైనే మొలకలెత్తే పరిస్థితి ఏర్పడింది.

నాణ్యత పేరుతో కొర్రీలు పెడుతున్నారు : కష్టపడి పండించిన పంట తీరా చేతికి వచ్చే సమయానికి వర్షాలు రైతులకు తీవ్ర నష్టంతో పాటు కన్నీళ్లను మిగులుస్తున్నాయి. పండిన కొద్దిపాటి పంటను తీసుకుందామంటే వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు చెబుతున్నారు. ఎలాగో అలా పత్తిని తీసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే తేమ, నాణ్యత పేరుతో కొర్రీలు పెట్టి క్వింటాలుకు సుమారు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు తమ బాధను వెలిబుచ్చుతున్నారు. ఒక్కో ఎకరానికి సుమారు రూ. 50 వేల చొప్పున పెట్టుబడి పెట్టామని కనీసం ప్రస్తుతం అదీ కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం త్వరలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి కొనుగోలు సెంటర్లను ప్రారంభించబోతుందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం తేమ ఉండే విధంగా రైతులు పత్తిని ఆరబెట్టి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 8,110 పొందాలని, దళారులను నమ్మి ఎట్టి పరిస్థితుల్లో మోసపోవద్దని పరకాల వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ రాజిరెడ్డి రైతులకు సూచించారు.

### పత్తిలో నాణ్యత, తేమ శాతాన్ని దృష్టిలో ఉంచుకోవాలి

- 12 శాతం మించకుండా చూసుకోవాలి
- పత్తి రైతులకు మద్దతు ధర దక్కేలా ప్రయత్నాలు
- ఈ విషయమై కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్(జనంసాక్షి):**పత్తి అమ్మకాల విషయంలో రైతులు నాణ్యత, తేమ శాతాన్ని దృష్టిలో ఉంచుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పత్తిలో తేమ 12 శాతానికి మించకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. 12 శాతానికంటే ఎక్కువగా తేమ ఉంటే కనీస మద్దతు ధర పొందే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశామని పత్తి రైతులకు గరిష్ఠ మద్దతు ధర అందించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు.

## అధికారిక గృహాల మరమ్మతులు

హైదరాబాద్,అక్టోబర్27(జనంసాక్షి:తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ అధికారిక గృహాల మరమ్మతుల ఖర్చుల పరిమితులు పెంచుతూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారుల గృహాల రిపేర్ ఖర్చులకు కొత్త సీలింగ్ లిమిట్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రుల అధికారిక నివాసాల మరమ్మతుల కోసం రూ.20 లక్షల వరకు ఖర్చుకు అనుమతినిచ్చింది. ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల గృహాలకు రూ.12 లక్షల వరకు సీలింగ్ పరిమితిని పెంచింది. ఇతర ప్రభుత్వ అధికారుల అధికారిక నివాసాల మరమ్మతులకు రూ.7 లక్షల వరకు ఖర్చు చేసేందుకు పర్మిషన్ ఇచ్చింది. పదిహేనేళ్ల క్రితం నిర్ణయించిన రేట్లను తాజాగా సోమవారం సడలించింది. పెరిగిన కూలీ, మెటీరియల్ ఖర్చుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం పెంపు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్/బీ చీఫ్ ఇంజనీర్ సిఫార్సులపై ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్త లిమిట్ల అమలు వెంటనే చేయాలని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు.

## జూబ్లీహిల్స్ బరిలో 58 మంది

చేసి కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ మెషిన్ ను అనుసంధానిస్తారు. మొత్తం కంట్రోల్ యూనిట్ లు 569 , బ్యాలెట్ యూనిట్ లు 2,442 , వీవీప్యాట్ లు 610 ఉపయోగించనున్నారు. ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## యూకేలో దారుణం

**లండన్(జనంసాక్షి):** యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో దారుణ ఘటన చోటుచేసుకుంది. 20 ఏళ్ల భారతీయ యువతిపై లైంగిక దాడి జరిగింది. అయితే, ఈ ఘటన జాతి వివక్షతోనే జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న సీనియర్ పోలీసు అధికారి రోనన్ టైరర్ మాట్లాడుతూ..'వెస్ట్ మిడ్‌ల్యాండ్స్‌లో 20 ఏళ్ల భారత సంతతికి చెందిన ఒక యువతిపై లైంగిక దాడి జరిగింది. శనివారం వాల్సాల్‌లోని పార్క్ హాల్ ప్రాంతానికి వెళ్లినప్పుడు ఆమెపై జాతి వివక్ష కారణంగానే ఇలా దాడి జరిగింది. ఇందుకు కారణమైన వ్యక్తిని అరెస్టు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేపట్టాం. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక సీసీటీవీ ఫుటేజ్ నుండి వెస్ట్ మిడ్‌లాండ్స్ పోలీసులు నేరస్థుడి ఫొటోను విడుదల చేశారు. సాధ్యమైనంత త్వరగా అతన్ని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తామని అన్నారు

## బీహార్ ఎస్ఐఆర్‌పై ప్రశ్నలు మిగిలే ఉన్నాయ్..

న్యూఢిల్లీ : దేశంలో 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం తలపెట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పై కాంగ్రెస్ పార్టీ పలు ప్రశ్నలు లేవనెత్తింది. బిహార్‌లో ఇప్పటికే చేపట్టిన సవరణ విషయంలో అటు విపక్షాలు గానీ, ఇటు ఓటర్లు గానీ సంతృప్తి చెందకుండానే.. మరో దఫా సవరణకు సిద్ధమవ్వడం పట్ల ఈసీ ఉద్దేశాలు, విశ్వసనీయతపై అనుమానాలు రేకెత్తుతున్నాయని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ సీనియర్ నేత పవన్ ఖేడా ఎక్స్ వేదికగా ఓ వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు."బిహార్‌లో తలపెట్టిన ఎస్ఐఆర్‌కు సంబంధించిన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు రాలేదు. సుప్రీంకోర్టు పలుమార్లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఆ రాష్ట్రంలో చేపట్టిన సవరణ వల్లే ఎన్నికల సంఘం, భాజపా ఉద్దేశాలేంటో బాహ్య ప్రపంచానికి తెలిసింది. సమగ్ర సవరణ చేపట్టినప్పుడు ఎన్నికల సంఘం ఉద్యోగులు ప్రతి ఇంటికీ వెళ్లి కొత్త ఓటర్లను చేర్చాలి. తొలగించాల్సినవి తొలగించాలి. కానీ, బిహార్‌లో మాత్రం ఒక్క ఓటునూ చేర్చకపోగా 65 లక్షలు ఓట్లను తొలగించారు. దీనిపై అనే ప్రశ్నలు ఉన్నాయి" అంటూ పవన్ ఖేడా పేర్కొన్నారు.

## తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక పక్రియను కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

# ఫ్రెండ్స్‌ప్యానెల్ గెలుపులో టీయూడబ్ల్యూజే విశేష కృషి



**కీలక పాత్ర పోషించిన విరహత్ అలీ**

**అందరినీ సమన్వయం చేసి ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో గెలుపు బావుట**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశంలో అత్యంత ప్రాధాన్యత గల ప్రెస్‌క్లబ్బులో ఒకట్కైన హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానల్ ఘన విజయం నమోదు చేసింది. అత్యధిక ఓట్లు సాధించి జర్నలిస్టులంతా ఫ్రెండ్స్ ప్యానల్‌వైపే మొగ్గుచూపారని స్పష్టమైంది. ముందునుంచీ ఈ ఎన్నికల్లో గెలుపు కోసం టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ కీలకంగా వ్యవహరించారు. ప్యానల్ సభ్యులందరినీ సమన్వయం చేసి, అందరినీ ఏకాభిప్రాయానికి తీసుకొచ్చి బరిలో నిలిపారు. కలం కార్మికులందరూ ఒక్కటేననే నినాదంతో ఫ్రెండ్స్ ప్యానల్ గెలుపు అవశ్యకతను వివరించారు. తాము బలపరిచిన ఫ్రెండ్స్ ప్యానల్‌లోని దాదాపు అన్నిస్థానాలను కైవసం చేసుకునేందుకు విశేష కృషి చేశారు. ఈ ఫలితాలు టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడి సమర్థతకు అద్దం పట్టాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగిన ఈ ఎన్నికలో ప్రత్యర్థి సంఘాలు మతోన్మాద శక్తులతో చేతులు కలిపాయి. జర్నలిస్టుల మధ్య చిచ్చుపెట్టేలా, ఐక్యతను విచ్చిన్నం చేసేలా ప్రెస్‌క్లబ్ బయట బ్యానర్లు పెట్టడం ప్రత్యర్థి సంఘాల దిగజారుడుతానికి నిదర్శనంగా నిలిచింది. వీటన్నింటినీ ఎదుర్కొంటూ, విరహత్ అలీ జర్నలిస్టులంతా ఒక్కటేనని, కలం కార్మికులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో విరహత్ అలీ ముఖ్యభూమిక పోషించడం గమనార్హం. ఈ గెలుపు స్ఫూర్తితో తెలంగాణలోని అన్ని ప్రెస్‌క్లబ్‌లలో విజయం సాధిస్తామని, జర్నలిస్టుల సంక్షేమానికి మరొకసారి పునరంకితమవుతామని విరహత్ అలీ పేర్కొన్నారు.

## ఆందోళనలో ఆటోడ్రైవర్లు

ఆటో డ్రైవర్లకు అన్నీ చేస్తామని రాహుల్ గాంధీ నాడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మస్రత్ అలీ తనకున్న రెండు ఆటోలు అమ్మి.. ఆయన ప్రస్తుతం కిరాయి ఆటో నడుపుతున్నట్లు చెప్పారని కేటీఆర్ వివరించారు. ఆత్మహత్య చేసుకున్న 161మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారురాష్ట్రంలో మైనార్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మైనార్టీల కోసం రూ.4 వేల కోట్ల బడ్జెట్ పెడతామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. తాము కూడా కొన్ని కొన్ని పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు కానీ.. ఇండియాలో మైనార్టీలకు కేసీఆర్ చేసినన్ని పనులు ఇంకెవరూ చేయలేదని కొనియాడారు.

## అవశేషాల అప్పగింత పూర్తి

**కర్నూలు(జనంసాక్షి):**కర్నూలులో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాల అప్పగింత పూర్తి అయ్యింది. సోమవారం ఉదయం తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ (29) మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అధికారులు అప్పగించారు. కర్నూలు ఎమ్మార్వో ఆంజనేయులు, పోలీసుల సమక్షంలో కర్నూలు స్మశాన వాటికలో ప్రశాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈనెల 24న జిల్లాలో జరిగిన బస్సు దగ్ధం ఘటనలో 19 మంది సజీవదహనం అయిన విషయం తెలిసిందే. మృతదేహాలను డీఎన్ఏ నివేదిక ఆధారంగా కుటుంబసభ్యులకు అధికారులు అప్పగించారు. ఆదివారం వరకు 18 మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించారు. శుక్రవారం ప్రమాదం జరుగగా అదే రోజు అర్ధరాత్రి రెండు గంటల వరకు డాక్టర్లు 16 బృందాలుగా ఏర్పడి డెడ్‌బాడీస్‌కు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు.

# తక్కువ ఖర్చుతో ప్రాణహిత చేవెళ్ల పునరుద్ధరణ

అవకాశం ఉందని తెలిపారు. సుమారు రూ.1,500 నుంచి 1,600 కోట్లు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. కొత్త అలైన్‌మెంట్ సాంకేతికంగా, బలంగా ఉండేలా రూపకల్పన చేస్తున్నామని పేర్కొన్నారు. నీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణతో సమతౌల్యంగా ప్రాజెక్టు రూపకల్పనపై దృష్టి పెట్టామని వెల్లడించారు. తక్కువ పొడవు ఉన్న కాలువలు, టన్నెల్‌లతో నిర్మాణ వ్యయం తగ్గనుందని వివరించారు. పంప్ హౌస్‌ల సంఖ్య 15 నుంచి 10కి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్క పంప్ హౌస్ 30మెగావాట్ల సామర్థ్యం ఉంటుందని స్పష్టం చేశారు.విద్యుత్ వినియోగం తగ్గి,నిర్వహణ సులభతరం కానుందని చెప్పుకొచ్చారు. సుందిల్లా లింక్ ద్వారా ప్రాజెక్టు పర్యావరణపరంగా సానుకూల మార్గంలో ముందుకెళ్లనుందని తెలిపారు. కొత్త డీపీఆర్ కోసం భౌగోళిక, సాంకేతిక, పర్యావరణ సర్వేలు మళ్లీ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ డీపీఆర్ పూర్తయ్యాక రాష్ట్ర క్యాబినెట్ ముందుకు తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. తుమ్మిడి హట్టి బ్యారేజ్ ఎత్తుపై మహారాష్ట్రతో చర్చలు జరుపుతామని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా 12 లక్షల ఎకరాలకు నీరు, హైదరాబాదుకు తాగునీరు సరఫరా అందించడమ తమ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్ఘాటించారు.

## డంకీ రూట్‌లో అమెరికాకు

**వాషింగ్టన్(జనంసాక్షి):**వలసలపై డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కఠినచర్యలు తీసుకుంటున్న సమయంలో కూడా అమెరికాకు అక్రమ మార్గంలో వెళ్లేవారి సంఖ్య ఆగడం లేదు. అలా డంకీ మార్గంలో తమ దేశంలోకి ప్రవేశించారనే ఆరోపణలతో 54 మంది భారతీయులను అగ్రదేశం వెనక్కిపంపింది దాంతో వారంతా దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారని, వారిని వారి కుటుంబీకులకు అప్పగించామని పోలీసులు వెల్లడించారు. ఈ 54 మంది భారతీయుల్లో అత్యధికులు హరియాణాకు చెందినవారే ఉన్నారు. కర్నాల్, ఖైతాల్, అంబాలా, యమునానగర్, కురుక్షేత్ర, జింద్, సోనీపత్ నుంచి డంకీ రూట్‌లో అమెరికా వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే ప్రస్తుతానికి వారిని పంపించిన ఏజెంట్లపై మాత్రం ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అక్రమ మార్గంలో విదేశాలకు వెళ్లవద్దని, దానివల్ల కొత్త సమస్యలు కొనితెచ్చుకోవద్దని పోలీసులు సూచించారు. విదేశాలకు అక్రమంగా వెళ్లేందుకు అనుసరించే మార్గాన్నే 'డంకీ' రూట్‌గా వ్యవహరిస్తుంటారు ఇది పంజాబీ వాడుక భాష నుంచి వచ్చింది. అంటే ఎటువంటి ప్రణాళిక లేకుండా ఒకచోట నుంచి మరోచోటుకు వెళ్లడం. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, షిప్ కంటైనర్లు, వాహనాల్లో రహస్య కంపార్టుమెంట్లలో దేశ సరిహద్దులు దాటిస్తారు. ఇందుకోసం భారీ మొత్తంలో ఏజెంట్లు డబ్బులు వసూలు చేస్తారు. ప్రమాదకర పరిస్థితుల్లో అంతర్జాతీయ సరిహద్దులు దాటించుకుంటూ చట్టవిరుద్ధంగా ఓ దేశంలోకి పంపించేందుకు ప్రయత్నాలు చేస్తారు.

## రష్యా చమురు విషయంలో అమెరికాది ద్వంద్వ వైఖరి

ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారంటూ ఆసియాన్ సదస్సులో ఆయన వ్యాఖ్యలు చేశారు. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ సర్కారు 25 శాతం సుంకం విధిస్తున్న సంగతి తెలిసిందే. చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో భేటీ అనంతరం జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## అయిదేళ్ల తర్వాత..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అయిదేళ్ల అనంతరం భారత్, చైనాల మధ్య నేరుగా విమాన సర్వీసులు అధికారికంగా మొదలయ్యాయి. ఈ విషయాన్ని భారత్‌లో చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి యు జింగ్ ఆదివారం ఎక్స్ వేదికగా ధ్రువీకరించారు.మొదటి విమానం కోల్‌కతా నుంచి గ్వాంగ్‌ఝౌకు టేకాఫ్ తీసుకుందన్నారు. నవంబర్ 11వ తేదీ నుంచి తాము కోల్‌కతా-గ్వాంగ్‌ఝౌ ఎయిర్ బస్ సర్వీసును ప్రతిరోజూ నడుపుతామని ఇండిగో ప్రకటించింది.అదేవిధంగా, నవంబర్ 9వ తేదీ నుంచి షాంఘై-న్యూఢిల్లీ మార్గంలో సర్వీసులు రాకపోకలు సాగించనున్నాయి.

# బాలికల వాష్‌రూంలో రహస్య కెమెరాలు



- ప్రభుత్వ పాఠశాలలో అటెండర్ వికృత చేష్టలు
- విద్యార్థినులు, తల్లిదండ్రుల ఆందోళన
- పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకున్న పోలీసులు





**గంగాధర్, అక్టోబర్ 27 (జనసాక్షి):** ఉపాధ్యాయుల తర్వాత అంతటి బాధ్యతతో మెలగాల్సిన అటెండర్ వికృత బుద్ధి పిల్లల తల్లిదండ్రులను ఆందోళనలో పడేసింది. బాలికల వాష్ రూమ్ లో సీక్రెట్ కెమెరాలు అమర్చిన ఘటన కరీంనగర్ జిల్లాలో కలకలం రేపింది. గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో బాలికల వాష్ రూమ్ లో సీక్రెట్ కెమెరాలు బయటపడటం షాక్‌కు గురిచేసింది. ఈ ఘటన బయటపడటంతో నిందితుడు పరారీలో ఉండగా.. గంగాధర ఎస్ఐ వంశీ కృష్ణ నేతృత్వంలో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. కెమెరా పరికరాలను స్వాధీనం చేసుకుని, మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు.కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటెండర్ యాకూబ్ పాషా.. బాలికల మూత్రశాలలో రహస్య కెమెరాలు అమర్చాడు. ఏదో మెరుస్తుందని అనుమానాస్పద కదలికలు గమనించిన విద్యార్థినులు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పారు. వారంతా ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభమైంది. నిందితుడు వెంటనే పరారయ్యాడు. ఉన్నతాధికారులు, పోలీసులు పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. జిల్లా యంత్రాంగం, స్నేహిత, సఖీ టీమ్ ద్వారా ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న అమ్మాయిలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ దారుణ సంఘటన పాఠశాలలో భద్రతా వ్యవస్థలపై ప్రశ్నలు లేవనెత్తింది. ఇటువంటి సంఘటనలు మళ్లీ జరగకుండా రక్షణా చర్యలు తీసు కోవాలని, సీసీటీవీలు (టాయిలెట్లు మినహా) తప్పనిసరి చేయా లని డిమాండ్ వస్తోంది. పరారైన నిందితుడు యాకుబ్ పాషాను పోలీసులు గాలించి పట్టుకుని వివరాలు సేకరిస్తున్నారు.

**ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

స్కూల్ అటెండర్ విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఆరాతీసి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో గతేడాది నుండి విద్యార్థినిలపై వేధింపులు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలంతో ఫోన్లో మాట్లాడి అకృత్యానికి పాల్పడిన అటెండర్ యాకూబ్ పాషాను వెంటనే విధుల నుండి తొలగించాలని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనతో ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత విద్యార్థులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## ఆంధ్రాకు దూసుకొస్తున్న మొంథా తుఫాన్ ముప్పు

ఉండాలన్నారు. వర్షాలు, వరదలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలి. కాల్వ గట్లు పటిష్ఠం చేసి పంటలకు నష్టం జరగకుండా చూడాలి. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలి. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం అన్ని విధాలుగా చర్యలు చేపట్టింది. ఇక మొంథా తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్లో మాట్లాడారు. కేంద్ర సాయం పూర్తి స్థాయిలో ఉంటుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఇక మొంథా తుఫాను ప్రభావంపై సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. తుఫానుపై ఆర్టీజీఎస్‌లో మంత్రులు, అధికారులతో చర్చించారు. ప్రతీ గంటకు తుఫాన్ కదలికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాలు, వరదలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. కాలువ గట్లు పటిష్టం చేసి పంట నష్టం జరగకుండా చూడాలని అధికారులకు చెప్పారు. ఈ సమీక్షలో మంత్రులు లోకేష్, అనిత, సీఎస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రోవైపు ప్రస్తుతం కాకినాడకు 680 కి.మీ దూరంలో ఉన్న మొంథా తుఫాన్.. 16 కి.మీ వేగంతో తీరాన్ని సమీపిస్తోంది. దీని ప్రభావంతో కృష్ణా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాలకు భారీ వర్షాలు పడనున్నాయి. మంగళవారం రాత్రికి తుఫాన్ తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.' మొంథా' తుపాను నేపథ్యంలో మంగళవారం విజయవాడలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. 16 సెం.మీలకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) అధికారులు అప్రమత్తమయ్యారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. తీవ్రత ఎక్కువగా ఉంటే దుకాణాలు, వాణిజ్య సంస్థలు తీవ్రత ఎక్కువగా ఉంటే దుకాణాలు, వాణిజ్య సంస్థలు మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ షాపులు, కూరగాయలు, పాల విక్రయ దుకాణాలు తెరచుకోవచ్చని తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్, వీఎంసీ ప్రధాన కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో 9154970454, వీఎంసీ కార్యాలయంలో 08662424172, 08662 422515, 08662427485 నెంబర్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి సమస్య ఎదురైనా ఈ నెంబర్లకు ఫోన్ చేసి సాయం పొందొచ్చని చెప్పారు. నదీపరీవాహక ప్రాంతంతోపాటు ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

## తెలంగాణకూ భారీ వర్ష సూచన

జారీ చేసింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.మంగళవారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# పత్తి రైతుకు ప్రభుత్వం అండ

- రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఏనుమాముల మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 27(జనం సాక్షి):** ఈ సీజన్లో తెల్ల బంగారంగా పిలవబడే పత్తి పండించిన రైతులకు భరోస ఇచ్చి అండగా ఉండి, ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకుంటుందని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సోమవారం వరంగల్ లోని ఏనుమాముల మార్కెట్ యార్డ్ లో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యం లో ఏర్పాటుచేసిన సి సి ఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్దదైన వరంగల్ వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే దేశం సంతోషంగా ఉంటుందని దృఢంగా నమ్మి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, గిట్టుబాటు ధర, సబ్సిడీ మీద విత్తనాల పంపిణీ,ఇండస్ట్రియల్ పాలసీని తీసుకురావడం వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు.రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్ కు తీసుకొచ్చి గరిష్ఠ ధరను పొందాలని మంత్రి కొండా సురేఖ చెప్పారు. ఎనుమాముల మార్కెట్ కు వచ్చిన పత్తి బస్తాను కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. తేమను దృష్టిలో ఉంచుకొని ధర నిర్ణయించడం జరుగుతున్నందున, తేమ వల్ల రైతులు నష్టపోకుండా పరిశీలించేందుకు కమిటీని వేయడం జరిగిందన్నారు.ప్రత్తి విక్రయించిన మూడు నుండి ఐదు రోజుల్లోనే సంబంధిత రైతు బ్యాంక్ అకౌంట్కు నేరుగా డబ్బులు.జమ అవుతాయన్నారు. రైతుల సంక్షేమం కొరకు రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని, వడ్లు కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులకు డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.సీసీఐ ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు ఏ ఇబ్బందీ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారని, వరి, మొక్కజొన్న కేంద్రాలు ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు.తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. వ్యవసాయ అధికారుల వద్ద తేమ యంత్రాలు ఉన్నాయని, రైతుల పొలాల వద్దనే తేమ శాతం పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి రైతులకు నష్టం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సంవత్సరం 32298 క్వింటాళ్ల పత్తి మార్కెట్ యార్డ్ కు వచ్చిందని, జిల్లాలో మొత్తం 23 జిన్నింగ్ మిల్లులో సామర్థ్యం రోజుకు 4980 బెల్లు అని అన్నారు.మద్దతు ధర 8110 రూపాయలు కల్పించడం జరిగిందని, తేమశాతం 8 శాతానికి మించ కూడదని, ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టుకుని నాణ్యతగా పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం ఆన్లైన్లోనే రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏఈఓ ల ద్వారా చేపట్టి రైతులకు జిన్నింగ్ మిల్లుల వద్ద వేచి ఉండే ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రత్తిని అమ్ముకునేవా రైతులు నేరుగా మార్కెట్ కు మిల్లులకు రాకుండా కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని ఆయా మిల్లులకు కేటాయించిన తేదీల్లో అమ్ముకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800 5995779, వాట్సప్ నెంబర్ 889728 1111 కు సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.ఈ సందర్భంగా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్లో అగ్రిటెక్ను సందర్శించి వ్యవసాయంలో ఆధునీకరణపై ప్రదర్శించిన వ్యవసాయానికి సంబంధించిన వివిధ రకాలైన యంత్రాలు, పనిముట్లు పరికరాలను పరిశీలించిన మంత్రి వ్యవసాయంలో వినూత్న పద్ధతులను పాటించి సాంకేతికతను వినియోగించుకొనిఅగ్రిటెక్లో ఉన్న యంత్రాలను రైతులు సబ్సిడీ ధరలపై కొనుగోలు చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, సిసిఐ జనరల్ మేనేజర్ మోహిత్ శర్మ, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డిసిఓ నీరజ, కాటన్ కొనుగోలు అధికారి కృష్ణారెడ్డి, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 28న రిజిష్టర్ల తనిఖీ

- ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్



**హైదరాబాద్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న 58 మంది అభ్యర్థులు తమ రోజువారీ ఖర్చులను నమోదు చేసే 3 రిజిష్ట ర్లను మూడు సార్లు ఎన్నికల వ్యయ పరిశీలకుల ఎదుట తనిఖీ చేయించుకోవాలని జూబ్లీహిల్స్ ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్, సహాయ వ్యయ పరిశీలకులు జి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఈనెల 28న మొదటిసారి, నవంబర్ 3 వ తేదీన రెండోసారి, 9న మూడోసారి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థి నామినే షన్ వేసినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు రూ.10 వేలకు మించి వ్యక్తికి గానీ, సంస్థకు గానీ నగదు లావాదేవీలు జరపవద్దని, చెక్కుల రూపంలోనే ఉండాలని సూచించారు.

# డీజీపీని కలిసిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యవర్గం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నన్స్ కార్యవర్గం తెలంగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బీ. శివధర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, పరిపాలన సంబంధిత అంశాలపై చర్చించారు. ప్రధానంగా పౌరుడికి పోలీస్ మధ్య సత్సంబంధాలు ఏర్పడేవిధంగా, పోలీసులు పౌరుల ఫిర్యాదులను సత్వరంగా, నిష్పాక్షికంగా పరిష్కరించే విధంగా కింది స్థాయి అధికారులకు, సిబ్బందికి సూచనలు ఇవ్వాలని కోరారు. కొన్ని సందర్భాలలో సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని కొందరు క్షేత్ర స్థాయి అధికారులు నిరాకరిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రతిస్పందిస్తూ ప్రజలకు పోలీసుల ప్రవర్తన వల్ల ఎదురవుతున్న సమస్యలను ఈ మధ్యనే ఏర్పరచిన పోలీస్ కంప్లైంట్స్ అథారిటీకి పౌరులు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. అదే విధంగా సుపరిపాలన దిశగా పోలీస్ వ్యవస్థలో, పౌరుల ఫిర్యాదుల పట్ల స్పందించాల్సిన పద్ధతులను కూడా సూచనల ద్వారా, వీలైతే శిక్షణ ద్వారా చేపడతామని తెలిపారు. ఈ సంస్థ 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో వెలువరించిన సావనీర్ను అందజేసారు. ఎం.పద్మనాభ రెడ్డి, సయ్యద్ రఫీ, టీ. వివేక్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎంఐఎంతో కాంగ్రెస్ దోస్తీ

- బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ పాలన
- బీజేపీ ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్



**హైదరాబాద్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** తెలంగాణలో జరుగుతున్న రాజకీయ ఆటల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఎంఐఎంతో చేతిరాయాలు పట్టుకుని ముందుకు సాగుతోందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తీవ్రంగా మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్తో చేసినట్లే ఇప్పుడు ఎంఐఎంను పెంచి పోషిస్తూ సంతుష్టీ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ప్రధానంగా బీజేపీతో మతోన్మాద ఎంఐఎం మధ్య పోరుగా అభివర్ణిస్తూ, ప్రజలు మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసే ఎంఐఎం అలవాటును గుర్తించాలని ప్రజలను కోరారు. దారుస్సలాం ఆదేశాలు కొనసాగుతాయా? కాంగ్రెస్ పై సెటైర్లు గతంలో ఎంఐఎం పార్టీ, ముఖ్యమంత్రిగా ఎవరైనా దారుస్సలాం నుంచే ఆదేశాలు జారీ అవుతాయని పలికి రాజ్యాంగాన్నే ఆటగించుకుందని గుర్తు చేసిన లక్ష్మణ్, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఆ ఆటలు కొనసాగుతాయని దుయ్యబట్టారు. 'కాంగ్రెస్ ముసుగులో ఎంఐఎం అభ్యర్థిని బరిలోకి దింపడం ద్వారా తమ నిజస్వరూపాన్ని తెలుపుకున్నారు. ఇది తెలంగాణ ప్రజల అభివృద్ధిని ఆటగించే ప్రయత్నం' అని విమర్శించారు. ఈ ఉపఎన్నికను సంతుష్టీకరణ రాజకీయాలు (అప్పీజ్మెంట్ పాలిటిక్స్)తో అభివృద్ధి రాజకీయాల మధ్య పోటీగా అభివర్ణించారు. కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంటరీ కౌన్స్టిట్యూన్సీని ఎలా అభివృద్ధి చేస్తున్నారో చూస్తే, జూబ్లీహిల్స్లో కూడా అదే తరహా ప్రతి సాధ్యమే అని లక్ష్మణ్ తెలిపారు. 'కిషన్ రెడ్డి సికింద్రాబాద్ను అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తున్నారు. దీపక్ రెడ్డి గెలిచి అధికారంలోకి వస్తే, జూబ్లీహిల్స్ కూడా అలాంటి మార్పు చూస్తుంది. ప్రజలు ఈ అవకాశాన్ని చేతకొనాలి" అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో గన్ కల్చర్, డ్రగ్ కల్చర్ మహమ్మారులా వ్యాపిస్తున్నాయని, యువత మత్తు పదార్థాల అలవాటుకు బానిసలవుతూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మద్యం, డ్రగ్స్ హైదరాబాద్ను పట్టిపీడుతున్నాయి. వీటి నుంచి విముక్తి, మార్పు రావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలి. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో దీపక్ రెడ్డిని గెలిపించడమే పరిష్కార మార్గం" అని పిలుపునిచ్చారు.

# కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పు

- పదేళ్లు దండుపాళ్యం బ్యాచ్ లాగా దోచారు
- మరోమారు హరీష్ రావుపై మండిపడ్డ మంత్రి అడ్లూరి



**హైదరాబాద్, అక్టోబర్27 (జనంసాక్షి) :** కవిత చేసిన ఆరోపణలకు ముందు హరీష్ రావు సమాధానం చెప్పాలని మాజీ మంత్రి హరీశ్రావుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మండిపడ్డారు. జూబ్లీహిల్స్ మినిస్టర్స్ క్వార్టర్స్లో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. 'మీ కుటుంబంలో గొడవలు పెట్టుకుని.. మంత్రివర్గాన్ని విమర్శించడమేంటని మండిపడ్డారు. మేమే రాజులం.. మేమే మంత్రులం అన్నట్లుగా పరిపాలన చేశారు. పదేళు పాలించిన హరీశ్రావు.. రాష్ట్ర కేబినెట్లో పంపకాల గురించి మాట్లాడుకున్నారంటూ మాట్లాడతారా? నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తారా? అబద్దాలు పదిసార్లు చెప్పి నిజం అని నమ్మించే పనిలో హరీశ్రావు ఉన్నారని అంటూ మంత్రి ధ్వజమెత్తారు. కేబినెట్ మంత్రులపై చేసిన వ్యాఖ్యలకు హరీశ్రావు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. 'దండుపాళ్యం అని మమ్మల్ని అంటున్నావు.. పదేళ్లు మీరు స్టువర్టుపురం దొంగల్లా పంచుకున్నారా..?, పదేళ్లు మీ కేబినెట్లో అసలు మాట్లాడే అవకాశమే లేదు కదా..? ఐతే మీరు.. మీ బామ్మర్ది? మీ మామే కదా..? మాట్లాడింది. కనీసం హోంమంత్రిని కూడా ప్రజా భవన్కు రానియని చరిత్ర మీది. సామాన్య కార్యకర్తలే ప్రస్తుతం మంత్రులుగా ఉన్నారు. దళితులు.. బలహీన వర్గాల బిడ్డలం కేబినెట్లో ఉన్నాం. బడుగు.. బలహీన వర్గాలు అంటే నీకు ఎందుకు అంత చిన్నచూపు. కేబినెట్ మీద విషం కక్కినావు. హరీశ్రావు నామినేషన్ వేసే సిద్దిపేట వేంకటేశ్వర స్వామి ఆలయంకి రమ్మంటే తోక ముడిచాడు. హరీశ్రావు? అంబేద్కర్ విగ్రహం దగ్గరికి వస్తా అని.. ఇప్పటి మేము కాదు.. మా కొప్పుల ఈశ్వర్ వస్తాడు అంటున్నారు. తోక ముడిచావు హరీశ్రావు. ముఖ్యమంత్రిని ఏకవచనంతో మాట్లాడటం మానుకో అంటూ మంత్రి లక్ష్మణ్ హితవు పలికారు.

### పదేళ్ల పాటు బందిపోట్ల లాగా తెలంగాణ దోపిడీ : అద్దంకి

బావ, బామ్మర్దుల నస భరించాల్సిన దుస్థితి తెలంగాణ ప్రజలకు పట్టిందంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్న పదేళ్లు బందిపోట్ల లాగా దోచుకున్నారని ఆయన విమర్శించారు. 'బీఆర్ఎస్ నాయకులు ఇంత దిగజారి మాట్లాడతారా? బీఆర్ఎస్ మంత్రులకు సెల్ఫ్ రెస్పెక్ట్ లేకుండే. బీఆర్ఎస్ మంత్రుల్లో వెన్నెముక ఎవరికీ లేకుండే. ముఖ్యమంత్రిపై ఎక్కువ మాట్లాడే దరిద్రులను హెచ్చరిస్తున్నా. ఆటో కార్మికులు చనిపోయిన రోజు బీఆర్ఎస్ నేతలు ఎక్కడ ఉన్నారు? మంత్రి వర్గాన్ని కించపరిచిన వారిపై కార్యాచరణ ప్రకటిస్తాం.' అంటూ అద్దంకి తిట్లదండకం అందుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో పారిపోయిన హరీశ్.. ఇప్పుడు అడ్లూరిని చూసి పారిపోయారని అద్దంకి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు అమ్మపాలు తాగి రొమ్ము గుద్దే రకం అంటూ ఆరోపించారు. సొంత మనిషి కవిత.. తనకి అన్యాయం జరిగిందని చెప్పినా పట్టించుకోవడం లేదని అద్దంకి అన్నారు. అప్పుడు బీఆర్ఎస్ ను ప్రజలు గెలిపించడం.. తెలంగాణను దోచుకోవడానికి బీఆర్ఎస్ పార్టీకి లైసెన్స్ ఇచ్చినట్టు అయింది అని అద్దంకి తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఇక, క్రియాశీల రాజకీయాలకు వస్తాడో లేదో తెలియదంటూ కూడా అద్దంకి కామెంట్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాగరాజు, మందుల సామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, ఎమ్మెల్సీలు బల్మూరు వెంకట్, అద్దంకి దయాకర్, ఎంపీ అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

# డాక్టర్ వేణుగోపాలకృష్ణకు విశిష్ట కళారత్న పురస్కారం



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్27 (జనంసాక్షి) :** ప్రముఖ వైద్యులు, నటుడు, దర్శకుడు, కవి, రచయిత డాక్టర్ వేణుగోపాలకృష్ణకు విశిష్ట కళారత్న, ఉత్తమ సామాజిక వేత్త పురస్కారం లభించింది. ఈ గౌరవాన్ని నిర్మల్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ , పాటే మా ప్రాణం సంస్థలు సంయుక్తంగా ప్రకటించాయి. ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారి, నిర్మల్ ఆర్ఎమ్ఓ, ఖానాపూర్, ఉట్నూర్ ఆసుపత్రి సూపరింటెండెంట్గా విశిష్ట సేవలు అందించిన ఆయన ఇప్పటివరకు 57 సార్లు రక్తదానం చేసి 'ప్రాణదాత' బిరుదు పొందారు. వైద్యరత్న, వైద్యశ్రీ, వైద్యశిరోమణి పురస్కారాలు అందుకున్న ఆయన, 'ప్రేమతో నాన్న' చిత్రానికి నంది అవార్డు పొందారు. కుటుంబ సభ్యులు డాక్టర్ నీలిమ, డాక్టర్ సుహాసినితో కలిసి ఈ గౌరవాన్ని స్వీకరించారు. డాక్టర్ వేణుగోపాల కృష్ణను పలువురు అభినందించారు.

# బీసీ రాజ్యాధికార ఉద్యమంపై విషం చిమ్ముతారా?

- పత్రికలను దగ్ధం చేసిన టీఆర్పీ శ్రేణులు
- రాధాకృష్ణ బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలి
- టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా డిమాండ్



**కరీంనగర్ (జనంసాక్షి) :** తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఒకే తాటిపైకి వచ్చి బీసీల రాజ్యాధికారంకోసం కృషి చేస్తున్న వేళ, ఆ ఉద్యమంపై విషం చిమ్ముతున్న ఆంధ్రజ్యోతి పత్రిక అధినేత వేమూరి రాధాకృష్ణను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా తీవ్రంగా ఖండించారు. టీఆర్పీ పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న ఆదేశాలతో సోమవారం కరీంనగర్ గీతాభవన్ సర్కిల్ వద్ద టీఆర్పీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేసి ఆందోళన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, బీసీల ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించడానికి, బహుజన ప్రజలను విడగొట్టడానికి, అన్నదమ్ముల్లా, అక్కచెల్లమ్మల్లా కలిసి చేస్తున్న ఈ మహా ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి రాధాకృష్ణ తప్పుడు కథనాలతో కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడి లేదా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడి మెప్పుకోసం కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల తొత్తుగా మారి బీసీలపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఆంధ్రజ్యోతి తప్పుడు వార్తలకు బీసీ సమాజానికి రాధకృష్ణ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బీసీల ఉద్యమం ఆపలేరని బహుజన శక్తి ముందుకు సాగుతుందని, ఆంధ్రజ్యోతి కుట్రలు మట్టుపెడతాయిని వారు దృఢంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ పార్టీ నాయకులు ఓర్సు రాజు, మంతెన శ్రీకాంత్, రమేష్, అర్షద్ బిన్ అలీ, చాంద్ పాషా, జడగల శ్రీనివాస్, వాజిద్, మహబూబ్, పెద్దపెల్లి శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాగొచ్చి వేధించే భర్త

- మెడకు తాడు బిగించి కడతేర్చిన భార్య
- దర్యాప్తులో వెల్లడైన మీర్పేట మర్డర్ కేసు

**హైదరాబాద్, అక్టోబర్27 (జనంసాక్షి) :** మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న అనుమానాస్పద మరణం కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. భర్తను తానే గొంతు బిగించి చంపినట్లు భార్య ఒప్పుకుంది. భర్త ప్రతీ రోజూ తాగి వచ్చి హింసిస్తుండటంతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలిపింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అక్టోబర్ 20వ తేదీన ప్రగతి నగర్ కాలనీ, జిల్లెలగూడకు చెందిన అలంపల్లి సత్యమ్మ అనే మహిళ తన పెద్ద కుమారుడు అలంపల్లి విజయ్ కుమార్ (42) అనుమానాస్పద స్థితిలో చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హత్య కోణంలో కూడా విచారణ చేశారు. పోస్టుమార్టం రిపోర్టులో మెడపై లిగేచర్ గుర్తులు కనిపించడంతో హత్య అనుమానం నిజమైంది. ఈ నేపథ్యంలోనే మృతుడి తమ్ముడు అలంపల్లి విజయ్ భాస్కర్ తన అన్న మరణానికి అన్న భార్య అలంపల్లి సంధ్య కారణమని పోలీసులకు తెలిపాడు. మర్డర్ గురించి ఆమే తనకు స్వయంగా చెప్పిందని అన్నాడు. దీంతో పోలీసులు సోమవారం సంధ్యను అరెస్ట్ చేశారు. విచారణలో సంధ్య తెలిపిన వివరాల ప్రకారం.. భర్త మద్యం మత్తులో తరచూ ఆమెను కొట్టేవాడు. ఇతరులతో సంబంధం అంటకట్టి వేధించేవాడు. అక్టోబర్ 19వ తేదీ రాత్రి విజయ్ కుమార్ మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. సంధ్యతో గొడవపెట్టుకున్నాడు. తీవ్ర ఆగ్రహానికి గురైన సంధ్య చున్నీతో భర్త గొంతు బిగించి చంపింది. మర్డర్ కేసు నుంచి తప్పించుకోవడానికి భర్త అపస్మారక స్థితిలో ఉన్నట్లు నటించి ఆసుపత్రికి తీసుకెళ్లింది. వైద్యులు విజయ్ కుమార్ చనిపోయినట్లు ధ్రువీకరించారు. అతడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. భర్తను హత్య చేయడానికి సంధ్య ఉపయోగించిన చున్నీ, తాడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆమెను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

# రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొంటది

- సిసిఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** రైతులు నష్టపోకుండా వారు పండించిన పంటకు మద్ద తు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వమే కొనుగో లు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటలను కొనుగోలు చేస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. చిల్పూర్ మండ లం రాజవరం గ్రామంలోని సిరి కాటన్ ఇండస్ట్రీస్ లో ఏర్పాటు చేసిన సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు.ఈసందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తి కొనుగోలులో రైతుల కు అనుకూలంగా ఉండే పద్ధతులనే పాటించాలని సిసిఐ అధికారులకు సూచించారు. అధికారులు రైతు లకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉండాల ని తెలిపారు. రైతులు ముందుగా కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకొని పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలని అన్నారు. 8శాతం తేమ ఉండే విధం గా పత్తిని అరబెట్టుకొని తీసుకురావాలని అప్పుడే కనీస మద్దతుధర 8,110రూపాయలు అందుతుందని తెలిపారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే వ్యాపారుల వద్ద రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందనే ఉద్దే శ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పా టుచేసి పంటలను కొనుగోలుచేస్తుందని వెల్లడించారు. రైతులు పండించిన వరి ధాన్యం, మక్కలు పత్తి పంట లను స్వయంగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతుల కు మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే పంటను విక్రయించాలని సూచించారు. రైతులకు అండగా నిలుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి కి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఆర్డిఓ వెంకన్న, సిసిఐ అధికారులు, అధికారులు, నాయకు లు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రత: ప్రపంచ, దేశీయ సవాళ్లు

గాలి, నీరు తర్వాత మానవ మనుగడకు అత్యంత అవశ్యకమైన మూడవ వనరు ఆహారం. ప్రతి పౌరుడికి వైవిధ్యమైన పోషకాలు అందుబాటులో ఉంచడం, సరైన పోషణ, ఆర్థిక స్థోమత, ఆహార భద్రత కల్పించవలసిన బాధ్యత ప్రతి దేశంపై ఉంది. ప్రపంచవ్యాప్తంగా జనాభాకు సరిపడా ఆహారం ఉత్పత్తి అవుతున్నప్పటికీ, ఆకలి కేకలు మాత్రం ఆగడం లేదు. ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేక, తక్కువ ఖరీదైన, అనారోగ్యకరమైన ఆహారాలపై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితికి అనేక అంశాలు దోహదపడుతున్నప్పటికీ, వాతావరణ అననుకూలత, సంఘర్షణలు, ఆర్థిక మాంద్యం, అసమానతలు, ఆహార వ్యర్థం వంటివి ప్రధానంగా పరిగణించవచ్చు.

ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన 'ప్రపంచ ఆహార పోషకాహార స్థితి – సోఫీ 2025' నివేదిక ప్రకారం, 2024లో ప్రపంచ జనాభాలో 8.2% అంటే దాదాపు 67.3 కోట్ల మంది దీర్ఘకాలిక ఆకలితో సతమతమవుతున్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 51.2 కోట్లకు తగ్గవచ్చని అంచనా. ఇందులో 60 శాతం మంది ఆఫ్రికాలో కేంద్రీకృతం కావచ్చు అని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 280 కోట్లకు పైగా ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేని స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితి పోషకాహార లోపానికి ప్రధాన కారణంగా పరిణమించింది. ప్రతి ఒక్కరూ సరిపడా ఆహారం తీసుకునే హక్కును మానవ హక్కుగా గుర్తించారు. ఈ సందర్భంగా, వ్యవసాయ ఆహార ఉత్పత్తిని వృద్ధి చేయడం, అందరికీ ఆహార భద్రత కల్పించడం, పోషకాహార లోపాన్ని తగ్గించడం, దాని వల్ల సంభవించే మరణాలను నివారించడం, ఆహార వ్యర్థాన్ని కనిష్టం చేయడం వంటి లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి దేశం కృషి చేయాలి. ఈ దిశగా ప్రభుత్వేతర ప్రయత్నాలకు కూడా ప్రోత్సాహం అందించాలి.




### మన దేశ పరిస్థితి

సోఫీ నివేదిక తెలిపిన దాని ప్రకారం మన దేశంలో 17.20 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. 2006లో 24.3 కోట్ల మందితో పోలిస్తే ఇది మెరుగుదల అయినప్పటికీ, మనదేశం ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా 48వ స్థానంలో, ఆసియాలో 7వ స్థానంలో ఉంది. సుమారు 42.9% మంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారు. ఆహార ధరలు, కొనుగోలు శక్తి మధ్య ఉండే అంతరం పెరగడమే దీనికి కారణం, ఇది దీర్ఘకాలిక ఆహార అభద్రతను సూచిస్తోంది.

పోషకాహార లోప ఇతర లక్షణాలను పరిశీలిస్తే, 18.7% మంది అంటే సుమారు 2.1 కోట్ల మంది పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారు. అలాగే సుమారు 3.74 కోట్ల మంది పిల్లలు వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోవడం దీర్ఘకాలిక పోషకాహార లోపానికి నిదర్శనం. 15-49 ఏళ్ల మహిళల్లో 53.7% అంటే సుమారు 20.3 కోట్ల మందికి రక్తహీనత పీడిస్తోంది. ఈ విషయంలో మనదేశం ప్రపంచంలోనే నాల్గవ స్థానంలో ఉంది. ఒకవైపు పోషకాహార లోపం తీవ్రంగా ఉండగా, మరోవైపు అధిక పోషకాహారం సమస్య కూడా పెరుగుతోంది. అధిక బరువు ఉన్న పిల్లలు 42 లక్షల మంది ఉన్నారు. గత దశాబ్దంలో స్థూలకాయం ఉన్న పెద్దల సంఖ్య రెట్టింపు అయి, ఇప్పుడు 7.14 కోట్లకు చేరుకుంది. వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోవడం వలన మానసిక అభివృద్ధి కుంటుపడి, విద్యా విషయక పనితీరు తగ్గుతుంది. మరోవైపు, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం రోగనిరోధక శక్తిని బలహీనపరిచి, వ్యాధుల తీవ్రతను పెంచుతుంది. ఇక అధిక బరువు వలన హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువవుతుంది.

### మన దేశంలో సవాళ్లు:

సరసమైన, ఆరోగ్యకరమైన ఆహారాల అందుబాటు లోపం దేశం అంతటా విస్తరించి ఉంది. దేశ జనాభాలో 60% పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ ఉత్పాదకత తగ్గడం, జనాభా పెరుగుదల వలన వ్యవసాయ భూములు తగ్గిపోవడం వంటి సవాళ్లను ఈ రంగం ఎదుర్కొంటోంది. ఆర్థిక సమస్యల కారణంగా దేశంలోని అనేక కుటుంబాలలో, ముఖ్యంగా పిల్లలకు, పోషకాహారం అందుబాటులో ఉండటం లేదు. పోషకాహార లోపం, ఆహార అభద్రత ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్నాయి.

### పోషకాహార వైరుధ్యానికి మూల కారణాలు:

దేశం ఆహార ఉత్పత్తిలో ముందంజలో ఉన్నప్పటికీ, మెజారిటీ ప్రజలు పోషక విలువలున్న పండ్లు, కూరగాయలు, పప్పులు, పాల ఉత్పత్తుల వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోవడమే మన దేశంలో పోషకాహార వైరుధ్యాన్ని సూచిస్తోంది. పేదరికం కారణంగా కోట్లమంది ప్రజలు కేవలం అధిక క్యాలరీలున్న బియ్యం, గోధుమల వంటి ప్రధాన ఆహార ధాన్యాలపై మాత్రమే ఆధారపడక తప్పడం లేదు. దీనివల్ల వారికి తగినన్ని విటమిన్లు, ఖనిజాలు అందక 'దాగి ఉన్న ఆకలి' అనే సమస్య ప్రబలుతోంది. ముఖ్యంగా లింగ అసమానత వలన, కుటుంబంలో మహిళలు, బాలికలకు ఆహార పంపిణీలో వివక్ష ఏర్పడి వారి ఆరోగ్యం దెబ్బతింటోంది. మరోవైపు, అపరిశుభ్రత, సరియైన పారిశుద్ధ్య లోపం వల్ల ప్రజలు తరచూ వ్యాధుల బారిన పడుతూ, తీసుకునే ఆహారంలోని పోషకాలను శరీరం సరిగా గ్రహించలేకపోతోంది.

### ప్రభుత్వం చేస్తున్న కృషి:

ఆహారం, పోషక భద్రతకు సంబంధించిన పథకాలు మన దేశంలో అత్యంత కీలకమైనవి. వాటిలో ప్రధానమైనవి పరిశీలిస్తే జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రధానమైంది. దీని కింద పేదవారికి చౌక దుకాణాల ద్వారా చాలా తక్కువ ధరకే ఆహార ధాన్యాలను అందిస్తున్నారు. పీఎం పోషణ్ పథకం బడికెళ్ళే పిల్లలందరికీ ఉచితంగా వేడి భోజనం అందిస్తోంది. పోషణ్ అభియాన్ అనేది పిల్లలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపాన్ని తగ్గించడానికి దృష్టి సారించిన జాతీయ మిషన్.

మనదేశం ఎదుర్కొంటున్న పోషకాహార వైరుధ్యాన్ని పరిష్కరించడానికి సమగ్రమైన, బహుళ అంచెల వ్యూహాలు అవసరం. కేవలం కడుపు నింపే ఆహారంపై కాకుండా, సమతుల్యమైన, విభిన్నమైన ఆహార ప్రాధాన్యతకు దృష్టి సారించాలి. ఇందులో పండ్లు, కూరగాయలు, చిక్కుళ్ళు, పాల ఉత్పత్తులు చేర్చబడాలి. ముఖ్యమైన విటమిన్లు, మినరల్స్‌తో ఆహార పదార్థాలను సుసంపన్నం చేయడం ద్వారా లోపాలను నిర్మూలించవచ్చు. పోషకమైన ఆహారం అందరికీ అందుబాటులోకి రావాలంటే వ్యవసాయ ఉత్పాదకతను పెంచాలి, పేదరికం, అసమానతలను లక్షిత జోక్యాలతో తగ్గించాలి. పోషకాహారానికి సంబంధించిన అవగాహన, విద్యను విస్తరించడం చాలా కీలకం. అలాగే సరైన ఆహార నిల్వలను నిర్ధారించడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం వంటివి ఈ సంక్లిష్ట సమస్యను పరిష్కరించడానికి అత్యవసరం. ప్రొటీన్లు అధికంగా ఉండే సోయాబీన్స్, కాయధాన్యాలు, మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తులు మొదలైన ఆహార ఉత్పత్తులను అందరికీ అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా పోషకాహార లోపాన్ని సమర్ధవంతంగా నియంత్రించవచ్చు.



జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# సామాజిక శాస్త్రాల పరిశోధనలో సవాళ్లు



ఆర్థిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, విద్యా శాస్త్రం, గ్రంథాలయ శాస్త్రం మొదలైనవి సామాజిక శాస్త్రాల పరిధిలోకి వచ్చేవే. ఈ రంగాల్లో పరిశోధన లు విడివిడిగానూ, అంతర్విభాగీయ విధానంలోనూ వేగంగా సాగుతున్నాయి. ఆధునిక సమాజంలో అకాల వర్షాలు, పర్యావరణ మార్పులు, సామాజిక అసమానతలు, ఆర్థిక సంక్షోభాలు వంటి అంశాలు సామాజిక శాస్త్రాల పరి శోధనలను మరింత కీలకమవుతున్నాయి. అయితే, ఈ రంగాల్లో ఎదురయ్యే సమస్యలు ఇతర శాస్త్రాలకూ వర్తించేవే. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల్లో అనేక సవాళ్లు పరిశోధకులను ఇబ్బంది పెడుతున్నాయి. సామాజిక శాస్త్రాల పరిశోధనలు సమాజానికి ప్రతిబింబంలా ఉండాలి, కానీ ఆచరణలో అనేక లోపాలు అడ్డుపడుతున్నాయి. భారతదేశంలో సామాజిక శాస్త్రాల పరిశోధనలు అకాల వర్షాలు, అసమానతలు, పర్యావరణ సమస్యలు వంటి అంశాలపై దృష్టి సారించాలి, కానీ అనేక అడ్డంకులు అడ్డుపడుతున్నాయి.

### హడావిడి అంశ ఎంపిక

కొత్త దృక్పథం లేదా సమస్య కనిపించగానే పరిశోధకులు భావావేశంతో ఆ అంశాన్ని ఎంచుకుంటున్నారు. విశ్వవిద్యాలయాల్లో ఇది సర్వసాధారణం. పీజీ పూర్తి చేసిన వెంటనే హాస్టల్ భోజనం, వసతి, ఆర్థిక అవసరాల కోసం పిహెచ్‌డిలో చేరుతున్నారు. ఇది 3-4 ఏళ్లు ఆర్థిక ఊరటనిస్తుంది. యూజీసీ, ఐసీఎస్ఎస్ఆర్ వంటి సంస్థల నుంచి స్కాలర్‌షిప్ లభిస్తుంది. ప్రొఫెసర్లు, కాలేజీ అధ్యాపకులు, పారిశ్రామిక నిపుణులు, డిఫెన్స్ రంగాల నిపుణులను సూపర్‌వైజర్లుగా ఎంచుకునే అవకాశం ఉంది. కానీ, పరిశోధనా అంశంపై లోతైన అధ్యయనం చేయకుండా ఎంచుకుంటున్నారు. సమగ్ర సమాచారం, సాహిత్యం, విమర్శలు, రిపోర్టులు, గ్రంథసూచీలు పట్టించుకోకుండా పిహెచ్‌డిలో చేరుతున్నారు. పరిశోధన మొదలుపెట్టాక సమాచారం లభించక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చాలామంది సూపర్‌వైజర్ సూచించిన అంశాన్ని గుడ్డిగా స్వీకరిస్తున్నారు. స్వతహా ఆసక్తి లేకపోతే పరిశోధన మొక్కుబడిగా సాగుతుంది. ఫలితాలు పేలవంగా వస్తాయి. పిహెచ్‌డి అవార్డ్ అయ్యాక థీసిస్ ముఖం కూడా చూడరు. పిహెచ్‌డిను ఉన్నత డిగ్రీగా భావిస్తున్నారు. 'డాక్టర్' పదం చూసి సంతృప్తి పడుతున్నారు. అది ప్రాథమిక సోపానమే. చాలామంది పోస్ట్ డాక్టోరల్ చేయరు. విద్యాదాహం, పరిశోధనా దృష్టి నిరంతరం కావాలి. ప్రపంచ పోకడలు గమనించాలి. పరిశోధనా జర్నల్స్ చదవాలి. నూతన రచనలు చేయాలి. విద్య నిరంతర ప్రక్రియ. డిగ్రీ, ఉద్యోగంతో జ్ఞానాన్వేషణ ముగియదు. పరిశోధకుడు స్వయంగా అప్‌డేట్ అవాలి. సమకాలీన అంశాలపై సులభ భాషలో రాయాలి. ఇతరుల రచనలు చదివి అవగాహన పెంచుకోవాలి. సామాజిక శాస్త్రాల్లో అకాల వర్షాలు, సామాజిక అసమానతలు, ఆర్థిక సంక్షోభాలు వంటి అంశాలు మరింత లోతైన అధ్యయనం కావాలి. అకాల వర్షాల వల్ల రైతుల సమస్యలు, అసమానతలు పెరిగాయి. కానీ, హడావిడి ఎంపికలు నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. భారతదేశంలో సామాజిక శాస్త్రాల పరిశోధనలు అకాల వర్షాలు, అసమానతలు, పర్యావరణ సమస్యలు వంటి అంశాలపై దృష్టి సారించాలి, కానీ అనేక సవాళ్లు అడ్డుపడుతున్నాయి.

### సూపర్‌వైజర్ల బయాస్

కవులు, రచయితలకు ప్రపంచిక దృక్పథం ఉంటుంది. విమర్శకులకు స్వీయ దృక్పథం ఉంటుంది. సూపర్‌వైజర్లు తమ ఆసక్తి అంశాలపైనే స్కాలర్లకు టాపిక్‌లు కేటాయిస్తారు. కొన్నిసార్లు బలవంతం చేస్తారు. ఆ విభాగంలో అవగాహన ఉండటమే కారణం. స్కాలర్ ఆసక్తిని గమనించాలి. కొన్నిసార్లు ఇష్టం లేకపోవడం వల్ల టాపిక్ ఇవ్వరు. సూపర్‌వైజర్లు తమ మాటే వేదమనుకుంటారు. స్కాలర్ భావజాలం, అభిరుచి నచ్చవు. రాజీపడాలి లేదా మధ్యలో వదిలేస్తారు. స్కాలర్లపట్ల చిన్నచూపు ఉంటుంది. వెట్టిచాకిరీ చేయించుకుంటారు. మహిళా స్కాలర్లపట్ల లైంగిక వేధింపులు, అనుచిత ప్రవర్తన జరిగిన ఉదాహరణలు ఉన్నాయి. చాలా కేసులు బయటకు రావు. కుల, మత, ప్రాంతీయ బలహీనతలు ఉంటాయి. తమ వర్గానికి పక్షపాతం చూపు తారు. పరిశోధనలు పరిశీలిస్తే ఇరువురూ ఒకే కులం, వర్గం వాళ్లే ఉంటారు. మినహాయింపులు ఉంటాయి. నాణ్యత కొరవడటానికి అనేక కారణాలు ఉన్నాయి. గతంతో పోలిస్తే పరమాణాలు తగ్గాయి. స్వీపింగ్ కామెంట్ కాదు, సాధారణ వ్యాఖ్య మాత్రమే. తొలితరం పరిశోధకుల్లో ఇలాంటివి ఎక్కువ. కేస్ స్టడీగా పరిశీలిస్తే నిజాలు బయటపడతాయి. సూపర్‌వైజర్లు స్కాలర్ల స్వేచ్ఛను గౌరవించాలి. భిన్న దృక్పథాలను ప్రోత్సహించాలి. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. వేధింపులకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలి. సామాజిక శాస్త్రాల్లో కుల, వర్గ బయాస్ అంతర్విభాగీయ సహకారాన్ని అడ్డుకుంటున్నది. అంతర్జాతీయ సమస్యలు, గ్లోబల్ వార్మింగ్ వంటివి అంతర్విభాగీయ పరిశోధనలు కావాలి. కానీ, బయాస్ అడ్డుపడుతున్నది.

### ఫండింగ్ లోపాలు

విశ్వవిద్యాలయాల్లో తొలితరం పరిశోధకులు తక్కువ. అంశాలు విరివి. కులం అడ్డంకి. సూపర్‌వైజర్ సూచించిన అంశమే ఎంచుకోవాలి. నేడు మార్పు వచ్చింది. విశ్వవిద్యాలయాల సంఖ్య పెరిగింది. చదువు హక్కుగా మారింది. అవగాహన పెరిగింది. అప్పుడప్పుడు అపశృతులు ఉన్నా, అట్టడుగు వర్గాల నుంచి పరిశోధకులు పెరిగారు. బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి. యూజీసీ ప్రాధాన్యత తగ్గింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి తగ్గింది. కేంద్రం నిర్లక్ష్యం. 15 ఏళ్లుగా ప్రొఫెసర్ల నియామకాలు నిలిచిపోయాయి. పార్ట్‌టైమ్, గెస్ట్ లెక్చరర్లతో బోధన. ఇతర సిబ్బంది నియామకాలు లేవు. వసతి, మెస్ నాణ్యత లోపించింది. అవస్థాపనలో నిర్లక్ష్యం. ప్రైవేట్, కార్పోరేట్ విద్యకు ద్వారాలు తెరిచారు. విదేశీ విద్యాలయాలకు స్వాగతం. నిధులు లేకపోతే నాణ్యమైన విద్య, పరిశోధన హాస్యాస్పదం. సామాజిక శాస్త్రాల్లో ఫీల్డ్ వర్క్, సర్వేలు, డేటా సేకరణకు నిధులు కీలకం. లేకపోతే పరిశోధనలు పేలవమవుతాయి. యూజీసీ, ఐసీఎస్ఎస్ఆర్ వంటి సంస్థలు మరిన్ని గ్రాంట్లు ఇవ్వాలి. ప్రైవేట్ స్పాన్సర్‌షిప్ పెంచాలి. ఇంటర్ డిసిప్లినరీ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి. అకాల వర్షాలు, పర్యావరణ సమస్యలు వంటివి అంతర్విభాగీయ అధ్యయనాలు కావాలి. కానీ, ఫండింగ్ లోపాలు అడ్డుపడుతున్నాయి. భారతదేశంలో సామాజిక శాస్త్రాల పరిశోధనలకు ఫండింగ్ లోపాలు, అవస్థాపన లోపాలు ముఖ్య సవాళ్లుగా నిలుస్తున్నాయి, ఇవి పరిశోధన నాణ్యతను దెబ్బతీస్తున్నాయి.

### ప్రభుత్వ నిర్లక్ష్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను దేశ భవిష్యత్తుగా చూడాలి. నిరర్థక ఖర్చుగా కాదు. యువత భవిష్యత్తు, దేశ ప్రతిష్టకు ప్రతి పైసా పెట్టుబడి. నాణ్యమైన విద్య, పరిశోధన లేకుండా ప్రగతి సాధ్యం కాదు. సామాజిక శాస్త్రాలు సమాజ సమస్యలకు పరిష్కారాలు సూచించాలి. ప్రభుత్వాలు బడ్జెట్ పెంచాలి. నియామకాలు చేపట్టాలి. అవస్థాపన మెరుగుపరచాలి. అకాల వర్షాలు, సామాజిక అసమానతలు వంటి అంశాలపై పరిశోధనలు ప్రోత్సహించాలి. ప్రైవేటీకరణకు బదులు పబ్లిక్ విద్యను బలోపేతం చేయాలి. విదేశీ విశ్వవిద్యాలయాలు వచ్చినా స్థానిక సంస్థలను కాపాడాలి. సామాజిక శాస్త్రాల్లో అంతర్విభాగీయ పరిశోధనలు పెంచాలి. అకాల వర్షాల వల్ల రైతుల సమస్యలు, అసమానతలు పెరిగాయి. కానీ, ప్రభుత్వ నిర్లక్ష్యం అడ్డుపడుతున్నది. యూజీసీ ప్రమాణాలు క్షీణించాయి. విద్యా సంస్థల్లో పార్ట్‌టైమ్ సిబ్బంది పెరిగారు. ఇది నాణ్యతను దెబ్బతీస్తున్నది. ప్రభుత్వాలు విద్యా బడ్జెట్‌ను పిహెచ్‌డిలో 6%కు పెంచాలి. అంతర్జాతీయ స్థాయికి తీసుకురావాలి. సవాళ్లను అధిగమించి సామాజిక శాస్త్రాల పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా చేయాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# కవి నిర్ధారణ.. అనేక ఆధారాలు అవశ్యం

(నిన్నటి తరువాయి భాగం)

ప్రాంత పరమైన రూఢిత్వం : ఒక కవి ఏ ప్రాంతానికి చెందినవాడో నిర్ధారించాలంటే, అనేక ఆధారాలు అవసరం. కవి రాసిన రచనల లో ప్రస్తావించిన భౌగోళిక స్థలాలు, మాండలిక భాషా ప్రయోగాలు, ఆ కవి స్వయంగా చెప్పుకున్న జీవిత విశేషాలు, మరియు సమకాలీన కవులు లేదా విమర్శకులు చేసిన వ్యాఖ్యానాలు అన్నీ కలిపి ఆ కవి ప్రాంతం రూఢి చేయడానికి దోహదపడతాయి. ఉదాహరణకు, కొందరు కవుల కృతుల్లో కనిపించే పల్లెపదాలు, తెలంగాణా శైలీ వాడుకలు, లేదా స్థానిక పండుగల ప్రస్తావనలు ఆ కవి తెలంగాణకు చెందినవాడని సూచిస్తాయి.కానీ ఈ నిర్ధారణ ఎల్లప్పుడూ సులభం కాదు.కొంతమంది కవులు తమ రచనల్లో ఆ ప్రాంతపు విశేషాలను ప్రస్తావించినా, వారు వాస్తవానికి ఆ ప్రాంతంలో నివసించక పోవచ్చు. ఉదాహరణకు, "చింతపల్లి కేశవశర్మ" అనే కవి పేరు మీద రెండు వేర్వేరు ప్రాంతాల పట్ల హక్కు వాదనలు ఉన్నాయి. ఒకరు నల్గొండ జిల్లా కవి అని,మరొకరు వరంగల్ పరిసరాలవారని పేర్కొన్నారు. ఈ విధంగా ప్రాంత పరమైన రూఢిత్వం కూడా సందిగ్ధతకు లోనవుతుంది.

### కాల నిర్ధారణలో సమస్య

కొన్ని కవుల కాలాన్ని నిర్ధారించడంలో కూడా గందరగోళం ఉంది. ముఖ్యంగా 18వ మరియు 19వ శతాబ్దాల మధ్య కాలంలో రచించిన తెలంగాణ కవుల రచనలు ఎక్కువగా మాన్యుస్క్రిప్ట్ రూపంలో మాత్రమే లభించాయి. ఈ కవుల కాల నిర్ధారణకు భాషా శైలీ, సామాజిక నేపథ్యం, మానవ సంబంధాల ప్రస్తావనలు ఆధారమవుతాయి.ఉదాహరణకు, "కందుకూరి లక్ష్మన్న" అనే కవి రాసిన వీర్యవిజయము కావ్యం 1860 నాటిదని కొందరు పేర్కొనగా, మరి కొందరు 1880ల తరువాతదని పేర్కొన్నారు ఈ భిన్నాభిప్రాయాలు "రూఢి కాని" స్థితిని మరింత బలపరుస్తాయి.

### రచనాధికార వివాదాలు

కొన్ని రచనల విషయంలో అసలు రచయిత ఎవరో అనే విషయంలోనూ విభేదాలున్నాయి. ఉదాహరణకు తొక్కుడు బండ అనే కవితా సంకలనం సి. కృష్ణమూర్తి యాదవ్ గారిదని తరువాత స్థిరపడింది. అయితే ఆ పుస్తకం వెలువడిన ప్రారంభ దశలో కేవలం "యాదవ్" అనే పేరుతో ప్రచారం కావడం వల్ల, ఇది వేరే రచయితదని అపోహలు వ్యాప్తి చెందాయి.తరువాత ఆయన "తొక్కుడు బండ కృష్ణమూర్తి" అని ఇంటిపేరుగా తీసుకోవడం ద్వారా ఆ గందరగోళం తొలిగింది (గ్రంథం: తొక్కుడు బండ కృష్ణమూర్తి కవిత్వం - సమీక్షా పరిశీలన, రచయిత: గడ్డం సుధాకర్, 2021). ఇలాంటి వివాదాలు తెలంగాణ సాహిత్య పరిశోధనలో తరచుగా ఎదురవుతాయి. అందుకే ఈ కవులను "రూఢి కాని కవులు"గా గుర్తించడం తాత్కాలికంగా సరైనదే అయినప్పటికీ, పరిశోధన కొనసాగిన కొద్దీ వీరిపై స్పష్టత వస్తుందని భావించవచ్చు.మొత్తానికీ తెలంగాణ సాహిత్యం యొక్క మూలాలు, ప్రాచీన ఆధారాలు ఇంకా పరిశోధనకే ఆహ్వానిస్తున్నాయి. సాహిత్య చరిత్రలో ఇంకా రూఢి కాని కవులపై నిరంతర పరిశోధన అవసరం. వారి రచనల ఆధారంగా భాషా శైలీ, ప్రాంతీయత, కాల నిర్ధారణ, రచనాధికార అంశాలపై దృష్టి సారిస్తే మాత్రమే ఈ కవులు చరిత్రలో తమ స్థానాన్ని పొందగలరు.ఈ వ్యాసం లక్ష్యం సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారి ముంగిలి వంటి గ్రంథాలను ఆధారంగా తీసుకొని, రూఢి కాని తెలంగాణ కవుల గుర్తింపునకు దోహదం చేయడం లేదా ప్రస్తావన చేయడం మాత్రమే.

### రూఢి కాని తెలంగాణ కవులు - సాహిత్య ఆధారాలు



భల్లట కవి యొక్క ప్రాంత నిర్ధారణ- భల్లటుడు చందస్సు మరియు వ్యాకరణ గ్రంథాలను రాసిన ప్రాచీన కవి. ఇతడు కాశ్మీరం దేశస్థుడని చాలాకాలం సాహిత్య చరిత్రకారులు నమ్ముతూ వచ్చారు. భల్లట శతకం వంటి పద్యాలలో కనిపించే భాషా శైలీ, లాలిత్యం, ప్రతీకాత్మకత ఆ అభిప్రాయానికి కొంత బలం చేకూర్చినప్పటికీ, దీనిని మొదటిగా సవాలు చేసినవారు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆయన ఆంధ్ర కవుల చరిత్ర గ్రంథంలో "భల్లటుడు కాశ్మీర దేశస్థుడు కాడుబీ కరీంనగర్ ప్రాంతానికి చెందినవాడు" అని స్పష్టంగా పేర్కొన్నారు (గ్రంథం: ఆంధ్ర కవుల చరిత్ర, రచయిత: కందుకూరి వీరేశలింగం పంతులు, 1898).ఆ తర్వాతి కాలంలో పింగళి సూర్యనారాయణ (వ్యాసం: "భల్లటుడు – ఒక తెలుగు కవి", భారతీ పత్రిక, 1954) కూడా వీరేశలింగం అభిప్రాయాన్నే సమర్థించారు.ఈ ఆధారాల ప్రకారం భల్లటుడు తెలంగాణకు చెందినవాడన్న అభిప్రాయం మరింత బలపడింది. భల్లట శతకంలోని పద్యాల భాషలో కనిపించే "పల్లెపదాలు", "తెనుగుతనం", "నదీప్రాంత వర్ణనలు" కాశ్మీర కవిత్వ భాషా సంప్రదాయాలకు విరుద్ధంగా ఉండటం ఈ అభిప్రాయానికి బలమైన భాషాత్మక సాక్ష్యం.ముద్దుం బాలంభట్టు – యక్షగాన సంప్రదాయ కవి. ఇతనికి తెలంగాణలో యక్షగాన సాహిత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆ సంప్రదాయాన్ని ప్రతినిధి చేసిన కవుల్లో ముద్దుం బాలంభట్టు పేరు ప్రాధాన్యంగా వినిపిస్తుంది. ఇతడు రాసిన యక్షగానాలు గోలకోండ కవుల సంచిక మరియు ఆంధ్ర యక్షగానం (సంపాదకుడు: అద్దంకి వెంకటేశ్వరరావు, 1951) వంటి సంకలన గ్రంథాలలో లభ్యమవుతాయి.ఈ రెండు సంకలనాల్లోనూ బాలంభట్టు "అదిలాబాద్ వాసి"గా పేర్కొనబడ్డాడు.అయితే అతని అసంపూర్ణ రచనలలో, ముఖ్యంగా రుక్మిణీ పరిణయం యక్షగానం అనే మాన్యుస్క్రిప్ట్‌లో తాను "కరీంనగర్ ప్రాంతీయుడను" అని స్వయంగా పేర్కొన్నాడు.ఈ రెండు విభిన్న సాక్ష్యాల వలన ముద్దుం బాలంభట్టు యొక్క ప్రాంత నిర్ధారణ ఇంకా రూఢి కాని దశలోనే ఉందని చెప్పవచ్చు.బాలంభట్టు పద్యాల్లోని భాష గోలకోండ మాండలికం, రసవత్తర శైలీ, నాట్యప్రసంగాల సమన్వయం యక్షగాన సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తున్నాయి.ఉదాహరణకు, ఆయన రాసిన "సుందర రూపమున సుందరచంద్రిక నిండిన వ్రజవనమున మురళీ మ్రోగె" అనే పద్యంలో శృంగారరస, రూపకాలంకార, ధ్వని సౌందర్యం సమపాళ్లలో కనిపిస్తాయి.కవి సూరన-ప్రాంతం, కాలం పై వివాదం చూస్తే ధనాభిరామం, ప్రేమాభిరామం వంటి కవితా రచనల ద్వారా ప్రసిద్ధుడైన "సూరన"ను సాంప్రదాయ చరిత్రకారులు ద్రాక్షారామ ప్రాంతానికి చెందినవాడిగా పేర్కొన్నారు. వీరేశలింగం పంతులు (గ్రంథం: ఆంధ్ర కవుల చరిత్ర, 1898) మరియు చాగంటి శేషయ్య (గ్రంథం: ఆంధ్ర సాహిత్య చరిత్ర, 1912) ఇద్దరూ "సూరన ద్రాక్షారామ వాసి" అని పేర్కొన్నారు.కానీ ఆధునిక పరిశోధకులు, ముఖ్యంగా ఆరుద్ర గారు సమగ్రాంధ్ర సాహిత్యం – 13వ సంపుటం (గ్రంథం: ఆరుద్ర, విశాలాంధ్ర పబ్లికేషన్స్, 1985) లో సూరనను "నల్లగొండ జిల్లా ప్రాంతం వాడని" పేర్కొన్నారు. ఆరుద్ర విశ్లేషణ ప్రకారం సూరన కవిత్వంలో కనిపించే స్థానిక భాషా శైలీ, మట్టి సువాసన, పల్లెటూరి రసవత్తర వర్ణనలు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయని ఆయన నిర్ధారించారు. ఉదాహరణకు, సూరన ప్రేమాభిరామం లో "మట్టి వాసన కల గాలిమా – మమత మాడిన చెలీ మనసా!" అనే పద్యం తెలంగాణ మాండలికానికి దగ్గరగా ఉందని ఆరుద్ర విశ్లేషించారు. ఈ భాషా ఆధారాల వల్ల సూరన తెలంగాణ కవి కావచ్చన్న వాదనకు బలమైన పునాదులు ఏర్పడ్డాయి.

### ప్రాంత నిర్ధారణలో సవాళ్లు

ఒక కవి ఏ ప్రాంతానికి చెందినవాడో నిర్ధారించాలంటే, అతని రచనలలోని భాష, మాండలికం,అతడు తనకు తానే తెలిపిన విషయాలు, తోటి కవుల వ్యాఖ్యానాలు ఇవన్నీ కీలకమైన ప్రమాణాలుగా పరిగణించాలి.అయితే ఒకే పేరుతో వివిధ ప్రాంతాలలో గ్రామాలు ఉండటం కూడా అనేక అపోహలకు దారితీసింది. ఉదాహరణకు రెంటచింతల అనే గ్రామం ప్రకాశం జిల్లాలోనూ, నల్లగొండ జిల్లాలోనూ ఉంది. ఈ కారణంగా కందుకూరి రుద్రకవి జన్మస్థానంపై వివాదం నెలకొంది. ఆరుద్ర, వేటూరి ప్రభాకర శాస్త్రిలు రుద్రకవి ప్రకాశం జిల్లా రెంటచింతల వాడని చెప్పగా, ప్రముఖ పరిశోధకుడు బి.ఎన్. శాస్త్రి గారు మాత్రం రుద్రకవి నల్లగొండ జిల్లా దేవరకొండ వాస్తవ్యుడని నిర్ధారించారు.ప్రాంత నిర్ధారణలో మార్పులున్నాయి. ఇదే విధంగా సిరిప్రేగడ ధర్మన కవికి సంబంధించి కూడా ఇలాంటి వివాదం ఉంది. ఇతడి జన్మస్థలం "ఇందుర్తి"గా పేర్కొనబడింది. కానీ ఈ పేరుతో కృష్ణా జిల్లాలోనూ, కరీంనగర్ జిల్లాలోనూ గ్రామాలు ఉన్నాయి.అందువల్ల ఆరుద్ర, కందుకూరి వంటి వారు ధర్మనను కృష్ణా జిల్లాకు చెందినవాడని పేర్కొనగా, పరిశోధకుడు పర్వతనేని సుబ్బారావు మాత్రం ఇతడు కరీంనగర్ జిల్లాలోని ఇందుర్తి వాడని నిర్ధారించారు.టేకుమళ్ల రంగశాయి, శతక కవిగా ప్రసిద్ధి పొందిన ఇతడిని చాగంటి శేషయ్య గారు కరీంనగర్ వాడిగా పేర్కొన్నా, ఇతర పరిశోధకులు ఆ అభిప్రాయాన్ని సమర్థించలేదు.తరిగోప్పుల మల్లన, వైజయంతీ విలాసం రచయితగా ప్రసిద్ధి పొందాడు. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ఇతడు తెలంగాణ ప్రాంతానికి చెందినవాడని భావించగా,ఆరుద్ర మాత్రం ఇతడిని కర్నూలు ప్రాంతానికి చెందినవాడిగా సూచించారు.సింహాద్రి వేంకటాచార్యులు విషయానికి వస్తే, కందుకూరి వీరేశలింగం తన ఆంధ్ర కవుల చరిత్రలో ఇతడు గోదావరి మండలానికి చెందినవాడని పేర్కొన్నారు. అయితే సుంకిరెడ్డి నారాయణ రెడ్డి తన విస్తృత పరిశోధన ఆధారంగా ఇతడు ఖమ్మం ప్రాంతానికి చెందినవాడని నిర్ధారించారు.అలాగే ముడుంబై వేంకటాచార్యులు గూర్చి కూడా ఇలాంటి వివాదం ఉంది.



డా. ఐ. చిదానందం
తెలుగు అధ్యాపకులు
చరవాణి - 8801444335

# రాజకీయాల్లో విలువల సారథి

## సేవా మూర్తి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్

రాజకీయాల్లో విలువలు ఉన్న వ్యక్తిత్వం అధికారమంటే సేవ చేయడమే, కానీ ఆధిపత్యం ప్రదర్శించడం కాదు. భారత తొలి రాష్ట్రపతి, రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు అయిన డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారి జన్మదినం సందర్భంగా ఆయన జీవితం, సేవలు గుర్తుచేసుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత. ఆయన పేరు స్వచ్ఛత, సేవాభావం, వినయానికి ప్రతీకగా నిలుస్తుంది. 1884 డిసెంబర్ 3న బీహార్ రాష్ట్రంలోని సివాన్ జిల్లాలోని జిరాదేయ్ గ్రామంలో జన్మించిన రాజేంద్ర ప్రసాద్, విద్యావంతుడు, న్యాయవాది, ఆలోచనాపరుడు. కలకత్తా విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో ఉన్నత విద్యను పూర్తి చేసి న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. కానీ దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీజీ నుండి పిలుపు అందుకున్న క్షణం నుండి ఆయన జీవిత దిశ మారిపోయింది. చంపారన్ సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల్లో పాల్గొని విశిష్ట సేవలు అందించారు. భారత రాజ్యాంగం రూపొందించుకున్న తర్వాత 1950 సంవత్సరంలో దేశపు తొలి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. పదవిలో ఉన్నప్పటికీ గాంధేయ విలువలను ఆచరణలో కొనసాగించారు. సరళ జీవనం, పారదర్శక వైఖరి, దేశ సేవ పట్ల అంకితభావం ఆయన వ్యక్తిత్వానికి మూల సూత్రాలు. రెండు పర్యాయాలు రాష్ట్రపతిగా సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన అరుదైన నాయకుడు. 1962లో ఆయనకు భారతదేశ అత్యున్నత గౌరవం భారతరత్న ప్రదానం చేయబడింది. ఆయన చూపిన నిజాయితీ, నిస్వార్థ సేవ మార్గం నేటి ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకంగా నిలుస్తుంది. రాజేంద్ర ప్రసాద్ గారి జీవితం మనకు నేర్పే విషయం ఒకటి: అధికారమంటే సేవ చేయడమే, ఆధిపత్యం ప్రదర్శించడం కాదు. ఈ దేశం ఆయన చేసిన సేవలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది. ఘనంగా నివాళులు అర్పిస్తుంది.

డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 1884 డిసెంబర్ 3న బీహార్‌లోని సివాన్ జిల్లా జిరాదేయ్ గ్రామంలో మహాదేవ్ సహాయ్, కమలేశ్వరి దేవి దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి సంస్కృతం, పార్శీ భాషలలో పండితుడు. బాల్యంలోనే రాజేంద్ర ప్రసాద్ ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకున్నారు. చప్రా జిల్లా పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసి, పాట్నా కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో ఎంట్రన్స్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి బంగారు పతకం పొందారు. 1907లో ఆర్ట్స్‌లో ఎమ్‌ఏ, 1915లో న్యాయశాస్త్రంలో ఎమ్ఎల్ పూర్తి చేశారు. ఆయన విద్యాభ్యాసం ఆయనకు బలమైన పునాది వేసింది. పాట్నాలో న్యాయవాదిగా వృత్తి ప్రారంభించినప్పటికీ, దేశ సేవ పట్ల ఆయన మనసు మళ్లింది. ఆయన జీవితంలో విద్య ఒక సాధనంగా మారి, స్వాతంత్ర్య పోరాటంలో ఉపయోగపడింది. ఆయన లాంటి విద్యావంతులు దేశానికి అవసరమని నేటి యువతకు సందేశం. మహాత్మా గాంధీజీ పిలుపుతో రాజేంద్ర ప్రసాద్ స్వాతంత్ర్యోద్యమంలోకి అడుగుపెట్టారు. 1917లో చంపారన్ సత్యాగ్రహంలో గాంధీజీతో కలిసి రైతుల సమస్యలపై పోరాడారు. ఇది ఆయన జీవితంలో మలుపు. ఆ తర్వాత సహాయ నిరాకరణ ఉద్యమం (1920-22), ఉప్పు సత్యాగ్రహం (1930), క్విట్ ఇండియా ఉద్యమం (1942)లో కీలక పాత్ర పోషించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 1934, 1939, 1947లో మూడుసార్లు ఎన్నికయ్యారు. ఆయన రచనలు 'సత్యాగ్రహ ఎట్ చంపారన్', 'ఇండియా డివైడెడ్', 'ఆత్మకథ' వంటివి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచాయి. జైలు శిక్షలు అనుభవించినా, ఆయన సంకల్పం తగ్గలేదు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం, నిస్వార్థ సేవ దేశానికి ప్రేరణ. నేటి రాజకీయ నాయకులు ఆయన మార్గాన్ని అనుసరించాలి.

రాష్ట్రపతిగా అమూల్య సేవలు: రాజ్యాంగ నిర్మాణం నుండి పాలన వరకు స్వాతంత్ర్యానంతరం రాజేంద్ర ప్రసాద్ రాజ్యాంగ సభ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1946 నుండి 1949 వరకు ఆయన నాయకత్వంలో రాజ్యాంగం రూపొందించబడింది. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత, ఆయన దేశ తొలి రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించారు. 1952లో మళ్లీ ఎన్నికై, 1962 మే 13 వరకు 12 సంవత్సరాలు పదవిలో ఉన్నారు. పదవిలో ఉన్నప్పటికీ సరళ జీవనం గడిపారు. రాష్ట్రపతి భవన్‌లో సాధారణ జీతం మాత్రమే తీసుకుని, మిగిలినది దేశ సేవకు వినియోగించారు. ఆయన కాలంలో భారతదేశం రిపబ్లిక్‌గా మారింది. రాజకీయ స్థిరత్వం, ఐక్యతకు ఆయన కృషి అపారం. అధికారాన్ని సేవా సాధనంగా మార్చిన ఆయన, నిర్ణయాలలో పారదర్శకత పాటించారు. ఆయన సేవలు భారత రాజకీయ వ్యవస్థకు బలమైన పునాది వేశాయి.

1962లో రాజేంద్ర ప్రసాద్‌కు భారతరత్న పురస్కారం లభించింది. రిటైర్ అయిన తర్వాత పాట్నాలోని సదాఖత్ ఆశ్రమంలో నివసించి, 1963 ఫిబ్రవరి 28న మరణించారు. ఆయన వారసత్వం నిస్వార్థ సేవ, వినయం, గాంధేయ సిద్ధాంతాలు. నేటి రాజకీయాల్లో విలువలు క్షీణిస్తున్న సమయంలో, ఆయన జీవితం మార్గదర్శకం. యువతకు ఆయన సందేశం: అధికారం సేవకు సాధనం మాత్రమే. ఆయన చేసిన సేవలకు దేశం ఎప్పుడూ రుణపడి ఉంటుంది. ఆయన జన్మదినం సందర్భంగా ఘన నివాళి అర్పిస్తూ, ఆయన మార్గంలో నడవాలని ప్రతి ఒక్కరూ సంకల్పించాలి. రాజేంద్ర ప్రసాద్ లాంటి నాయకులు దేశానికి అమూల్య సంపద. ఆయన జీవితం నుండి నేర్చుకోవాల్సిన పాఠాలు అనేకం - స్వచ్ఛత, అంకిత భావం, సరళత. భవిష్యత్ తరాలకు ఆయన ప్రేరణామూర్తి.

ఉమాశేషారావు వైద్య
లెక్చరర్ ఇన్ సివిక్స్, కామారెడ్డి
9440408080

# వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది

- నిరుపేదలకు నిస్వార్థంగా సేవలందించాలి
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆ వృత్తిలో పేద ప్రజలకు బాధ్యతగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నారాయణపేట జిల్లా మండలంలోని అప్పక్ పల్లి వద్ద గల ప్రభుత్వం మెడికల్ కళాశాల హాస్పిటల్‌లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో మెడికల్ విద్యార్థుల 2025-2026 బ్యాచ్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన "ఓరియెంటేషన్ డే ,వైట్ కోట్ సెర్మనీ" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మీరు పవిత్రమైన వృత్తిలో కొనసాగుతున్నారు దానిని పవిత్రంగా భావిస్తూ ఉద్యోగ ఉద్యోగ బాధ్యత నిర్వహించా లని తెలిపారు. ఎంబిబిఎస్ పూర్తయిన తర్వాత గ్రామాలలో వైద్య సేవలు అందించి బీద ప్రజలకు అండగా ఉండి, వారికి భరోసా కల్పించాలని ఆమె సూచించారు. నేడు మీరంతా వైద్య వృత్తి చేపట్టడానికి, ఇంత ఉన్నత స్థాయిలో రావడానికి ముఖ్యమైన వ్యక్తులు తల్లిదండ్రులు అని, వారి గౌరవం ఏ మాత్రం తగ్గకుండా ఆ గౌరవం ఉన్నత స్థాయిలో ఉండే విధంగా చూసుకుంటూ ఎంబిబిఎస్ పూర్తి చేయాలని చెప్పారు. మీరు ధరించే వైట్ కోట్ శాంతికి, స్వచ్ఛతకు చిహ్నాలు అని అంతే స్వచ్ఛమైన మనసులతో




ఉంటూ వైద్య సహాయం కోసం వచ్చిన రోగులకు పూర్తిస్థాయిలో చేయూతను అందించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెల్లని కోటు కేవలం ఒక దుస్తువు కాదని, అది సేవ, బాధ్యత, కర్తవ్య నిబద్ధతకు ప్రతీక అని పేర్కొన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదిగా, సమాజానికి మార్గదర్శకమైనదిగా ఉండాలని విద్యార్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. విజ్ఞానం తో పాటు మానవత్వం కలగలిపిన వైద్యులుగా ఎదగాలని, క్రమశిక్షణ, నిజాయితీ, దయ అనే విలువలను ఎల్లప్పుడూ కాపాడుకోవాలని ప్రజలకు మంచి సేవలు అందించాలని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలని సూచించారు ముఖ్యంగా డ్రగ్స్ ర్యాగింగ్ వంటి అలవాట్లకు అలవాటు పడితే మీరు వాటికి పూర్తిగా బానిసలు అవుతారని, మీ జీవితం ఆగమ్య గోచరంగా మారుతుందని చెప్పారు. డ్రగ్స్ గాని లేదా ర్యాగింగ్ వంటి కార్యక్రమాలు చేసిన విద్యార్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ విషయాలను గమనించి చెడు సావాసమునకు చెడు స్నేహానికి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. మెడికల్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా విద్య పైనే ఏకాగ్రత పెట్టి ఉన్నత స్థాయిలో ఉత్తీర్ణులు అయ్యేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఎవరైనా చెడు అలవాటులకు బానిసలు అయినట్టు తెలిసినా, ఏ విద్యార్థినైనా ఇతర విద్యార్థులు ర్యాగింగ్ పాల్పడినా సంబంధిత డిపార్ట్మెంట్ విభాగ అధిపతులకు తెలియపరిస్తే వారిపైన శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా మీ పిల్లలు ఎలా చదువుతున్నారు? లేదా? ఇతరత్ర కార్యక్రమంలో పైన ఏమైనా శ్రద్ధ పెడుతున్నారా..? వయసు ప్రభావం వంటి విషయాల పైన ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ వారికి తగు సూచనలు సలహాలు అందించడం ద్వారా వారు ఉన్నత స్థాయిలో చేరుకోవడానికి మీరు కూడా దోహద పడిన వారవుతారని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మెడికల్ కళాశాల,జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి సహకరించిన, సహకరిస్తున్న జిల్లా కలెక్టర్ కు ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్ర మోహన్, వైస్ ప్రిన్సిపాల్ డా. కిరణ్ ప్రకాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ఆదిత్య, ఆర్ ఎంవో డా.రాఘవేందర్, అన్ని శాఖల హెచ్ఓడిలు, వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ లో మాదకద్రవ్యాల నిషేధం(యాంటీ నార్కోటిక్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం డ్రగ్స్ విషయంలో సీరియస్ గా ఉందని, నార్కోటిక్స్ డ్రగ్స్ సరఫరాను నియంత్రించడానికి, డ్రగ్స్ మూలాన్ని తగ్గించడానికి డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఆదేశించారు. యా%శీ%టీ డ్రగ్ కమిటీల నేతృత్వంలో మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నార. సమావేశంలో డి.ఎస్.పి నల్లపు లింగయ్య జిల్లాలో గంజాయి కేసుల వివరాలను వెల్లడించారు. పోలీసు శాఖ తరపున జూనియర్, డిగ్రీ కళాశాలలలో పాటు మిగతా విద్యా సంస్థలలో కూడా డ్రగ్స్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామచందర్ నాయక్, ఆర్టీవో మేఘా గాంధీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, డీ.ఐ.ఈ.వో సుదర్శన్, వైద్య శాఖ అధికారి బిక్షపతి, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారిని అఖిల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## సమాజం పట్ల సేవాభావంతో ఉండాలి




**జడ్చర్ల, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ సమాజం పట్ల సేవా భావంతో బాధ్యతాయుతంగా ఉండాలని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి. సంగీత అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్లె బోయిన్ పల్లి గ్రామంలో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శీతాకాల శిబిరం సోమవారం ముగిసింది. ముగింపు సమావేశంలో పాల్గొన్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సంగీత మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య అవగాహన మరియు నైపుణ్యాభివృద్ధిలో చురుకుగా పాల్గొనడం అభినంద నీయమన్నారు. ఎన్ఎస్ఎస్ యువతలో సేవా, ఐక్యత, బాధ్యత యొక్క విలువలను పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కే ప్రసన్నలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఓ టి. శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ నెంబర్ సోనీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్, ఉపాధ్యాయులు నాగరాజు, ప్రసూన క్లారా, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ గంగ్వార్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు లోకల్ బాడీ కలెక్టర్ సంచిత్ గంగ్వర్ అధికారులకు సూచించారు.ప్రజావాణి హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 26 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైసమ్మ ఆలయాన్ని కూల్చి వేయకూడదు

- ఎన్కతలలో అడ్డుకున్న గ్రామస్తులు
- పోలీసుల రంగ ప్రవేశం

**మోమిన్‌పేట, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** అభివృద్ధి పేరుతో మైసమ్మ ఆలయాన్ని కూల్చివేస్తామనడం సరైనది కాదని మోమిన్ పేట్ మండలం, ఎన్కతల గ్రామానికి చెందిన రైతులు మండిపడ్డారు. టీజీఐఐసీ అధికారులు కూల్చివేతకు సిద్ధమవగా సోమవారం రైతులు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని 198 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో అనాదిగా మైసమ్మ గుడి ఉందన్నారు. ఇక్కడ కొలువైన మైసమ్మ తల్లిని తరాలుగా కొలుస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి భూమిని రైతులకు కేటాయించడంతో దశాబ్దాలుగా గ్రామ రైతులు సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల పారిశ్రామిక అభివృద్ధి కోసం ఈ భూమిని ప్రభుత్వం సేకరించి టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. కాగా పరిశ్రమల అభివృద్ధి కోసం పనులు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా మైసమ్మ గుడిని తొలగించేందుకు ఐఐసి అధికారులు సిద్ధమయ్యారని అన్నారు. తరాలుగా తాము కొలుస్తున్న అమ్మవారి



గుడిని తొలగించడం సరైనది కాదని ఐఐసీ అధికారులకు తెలిపారు. పనులు నిలిపివేయవలసిందిగా డిమాండ్ చేశారు. దీంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోమిన్ పేట్ ఎస్ఐ అరవింద్ నేతృత్వంలో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలతో చర్చించి సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కారం చేసుకోవాలని సూచించారు. అభివృద్ధిని గ్రామస్తులు అడ్డుకోకూడదని, ఇదే సమయంలో ప్రజల మనోభావాలను కూడా అధికారులు గౌరవించాలని ఎస్ఐ అరవింద్ అన్నారు.

## డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** గత 35 సంవత్సరాలుగా ఎన్నికలు వచ్చిన ప్రతి సారి అన్ని రాజకీయ పార్టీలు తమకు ఓటు వేస్తే మీకు పక్కా ఇండ్లు మంజూరు చేస్తామని బూటకపు హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చిన తరువాత వారిని పట్టించుకోవడం లేదని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య అన్నారు గతంలో అధికారంలో ఉన్నా రాజకీయ పార్టీల నేతలు కూడా అలాగే ప్రవర్తించారని ప్రస్తుత అధికార పార్టీ కూడా అలాగే ప్రవర్తించడంపై ఆయన మండిపడ్డారు సుమారు 60కుటుంబాలకు చెందిన దక్కలి కులస్తులు గత కొన్ని సంవత్సరాలుగా నిలువ నీడ లేక గుడిసెలు వేసుకొని కాలం వెల్లదిస్తున్నరని ప్రస్తుతం ఆ స్థలానికి చెందిన వ్యక్తులు గుడిసెలు ఖాళీ చేసి వెళ్లాలని చెప్పడంతో దక్కలి కులస్తులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు వెంటనే షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించి ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు ఎలాంటి ఉపాధి అవకాశం లేని వారికి



వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించాలని గతంలో దక్కలి కళాకారులకు ఇచ్చినటువంటి పెన్షను మళ్ళీ ఇచ్చే విధంగా పునరుద్ధరించాలని వారికి విద్యా వైద్యం అందే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఈ డిమాండ్లను 15రోజుల్లో పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కోకన్వీనర్ శ్రీదేవి ప్రజా కళామండలి నాయకులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు సబ్సిడీ పథకాలు అందించాలి



**కొండాపూర్, అక్టోబర్ 27 (జనం సాక్) :** అర్హులైన వారికి ప్రభుత్వం సబ్సిడీ పథకాలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఎం నర్సింలు అన్నారు. సోమవారం కొండాపూర్ మండల కేంద్రంలో వ్యవసాయ కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ హేమలత కు సమస్యతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.నర్సిములు మాట్లాడుతూ..అర్హులైన పేదలకు ప్రభుత్వం సబ్సిడీ పథకాలు అందేలా చూడాలన్నారు. రూ. 500 సబ్సిడీ సిలిండర్, 200 యూనిట్ల ఫ్రీ కరెంటు,ఆన్లైన్ చేయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఇస్తామని రెండు సంవత్సరాలు గడిచిన అనేకమంది పేదలకు సబ్సిడీ సిలిండర్ రావడం లేదనీ అన్నారు. అధికారులను ప్రశ్నిస్తే ఆన్లైన్ దరఖాస్తులు కావడంలేదని ఆన్లైన్ "కి" రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లో ఉందని, సంబంధిత అధికారులు చెప్పడం సరైనది కాదన్నారు.వెంటనే పేదలందరికీ సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఫ్రీ కరెంటు, ఆన్లైన్ చేయించి ఇవ్వాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజయ్య, మండల అధ్యక్షులు అమృతమ్మ, కార్యదర్శి సుదర్శన్, ఉపాధ్యక్షులు విజయ స్వామి, మహమూద్, జి.నర్సిములు, వెంకటేశం, గోపాల్, సి హెచ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# రాకమచర్ల వెంకటదాసుపై జాతీయస్థాయి సదస్సు

**నవాబుపేట్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రముఖ వాగ్గేయకారులు ఉమ్మెంతల పీఠ వ్యవస్థాపకులు రాకమచర్ల వెంకట దాసు జీవితము వారి సంకీర్తనలపై తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో జనవరిలో నిర్వహించబోయే జాతీయస్థాయి సదస్సు కొరకు అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు తలారి ఆశీర్వాదం సారథ్యంలో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన వికారాబాద్ పరిసర ప్రాంతాలలోనే గాక మహబూబ్నగర్ సంగారెడ్డి ప్రాంతాలలో కూడా ఎక్కడ ఏ భజన కార్యక్రమం నిర్వహించిన రాకమచర్ల వెంకట దాసు సంకీర్తనలు మారు మ్రోగుతూనే వుంటాయి అన్నారు. అంతటి వాగ్గేయకారుని జీవితం, వారి సంకీర్తనలపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడంతో వారి సంకీర్తనల గొప్పతనం జీవిత విశేషాలు జాతీయస్థాయిలో ప్రచారం చేసే అవకాశం ఉంటుంది గనుక ఇంత చక్కటి కార్యక్రమానికి శ్రీ అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక శ్రీకారం చుట్టిందన్నారు. దానికై ఉమ్మెంతల పీఠ ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ పీరం చెరువు పాఠశాలలో కార్యాచరణను రూపొందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకులు దోరవేటి,వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, అధ్యక్షులు తుల్జారాం సింగ్ ఠాకూర్, సాంస్కృతిక కార్యదర్శి పసుల హనుమంత్



వారితో పాటు ఉమ్మెంతల పీఠ ప్రతినిధులు శ్రీపాద శ్రీనివాస శర్మ, బొబ్లాద్ రాఘవేంద్రా చార్యులు అనంత సభ్యులు మజహరుల్లా అన్సారీ, సదీదుద్దీన్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

## నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాల ముఖ్య పాత్ర



**తూప్రాన్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ తెలిపారు .మండలంలోని వెంకటాయపల్లి గ్రామంలో సోమవారం రాత్రి సీసీ కెమెరాలు ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. గ్రామాలలో సీసీ కెమెరాలు ఉండడం వల్ల ఇక్కడ జరిగిన సీసీ కెమెరాలు ద్వారా తెలుస్తుందని అన్నారు గ్రామాలలో ఇలాంటి సంఘటన జరిగిన వెంటనే సీసీ కెమెరాలు ద్వారా తెలుస్తుందని అన్నారు ఇక్కడ కాని దొంగతనాలు జరిగితే వెంటనే సిసి కెమెరాలు ద్వారా తెలుస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో కృష్ణ ఎస్ఐ శివానందం పుర ప్రముఖులు నవీన్ లాగయ్య వెంకట్ గౌడ్ తదితరు లు పాల్గొన్నారు. సిసి కెమెర లకు ఆర్థిక సహాయం చేసిన సూదిని వెంకటరెడ్డిని డి.ఎస్.పి అభినందించారు. గ్రామ అభివృద్ధికి ముందుకు రావాలని కోరారు.

# ఎట్టకేలకు తెరుచుకున్న శేరిలింగంపల్లి శ్రీచైతన్య పాఠశాల

- విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నాలు నిరసనలతో దిగివచ్చిన జీహెచ్ఎంసీ..
- తెల్లారేసరికి పాఠశాల సీజ్ ను తొలగించిన వైనం..

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** ఎట్టకేలకు సోమవారం శేరిలింగంపల్లి శ్రీచైతన్య పాఠశాల తలుపులు తెరుచుకున్నాయి. గత ఎనిమిది రోజులుగా జిహెచ్ఎంసి శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ మరియు ఏసిపి వెంకటరమణ పాఠశాలను హఠాత్తుగా మూసివేయడంతో వెయ్యి మంది విద్యార్థులు 8 రోజుల పాటు విద్యకు దూరమై ఇంటివద్దే ఉంటుండడంతో తీవ్ర అభ్యంతరాలు, ఆందోళనకర పరిస్థితులు తలెత్తడం తెలిసిందే. కాగా ఆదివారం ఉదయం వందల సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీ చైతన్య పాఠశాల ఆభరణానికి చేరుకొని పాఠశాల యాజమాన్యంతో వాగ్వాదానికి దిగడంతో పాటు పాఠశాల సీజ్ వెనక జరిగిన పరిణామాలను తమకు పూర్తిగా తెలియజెప్పాలని డిమాండ్ చేయడం, తప్పనిసరి




పరిస్థితులలో పాఠశాల ప్రిన్సిపల్, ఏజిఎం పరిణామాలను పూర్తిగా వివరించడం జరిగింది. అయితే శ్రీచైతన్య పాఠశాల సీజ్ విషయంలో మున్సిపల్ అధికారుల వ్యవహార శైలి, మీడియాకు వెల్లడించిన వివరాలు, పాఠశాల యాజమాన్యం వివరించిన వాస్తవాలు పొంతన లేకుండా ఉండడంతో శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్, ఏసిపి సహా సంబంధిత జిహెచ్ఎంసి అధికారులు ఉద్దేశపూర్వకంగానే పాఠశాలను సీజ్ చేయడం జరిగిందని, పాఠశాలను మూసివేసిన విధానంలో అధికారుల దందుడుకుతనం, కుట్రకోణం స్పష్టం కావడంతో ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు వందల సంఖ్యలో పాఠశాల వద్దకు చేరుకొని శేర్లింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించడంతోపాటు ఏకంగా ఆమె భర్తరఫ్‌కై మానవహక్కుల కమిషన్ జోక్యాన్ని డిమాండ్ చేశారు. ఈ తరుణంలో ఓవైపు పరిస్థితి పూర్తిగా చేయి దాటి పోయేలా ఉందని, మరోవైపు వారి అక్రమాలు వెల్లడై పరువు పోయేలా ఉందని భావించిన సర్కిల్ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం తెల్లవారుజామున మెల్లిగా పాఠశాల వద్దకు చేరుకొని సీజ్ ను తొలగించి వెళ్లిపోయారని విద్యార్థుల తల్లిదండ్రులు వివరించారు. దీంతో సోమవారం ఉదయం పాఠశాల యధావిధిగా తెరుచుకొని తరగతులు ప్రారంభం కావడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. మరో మారు ఇలాంటి అక్రమాలకు పాల్పడితే శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయాన్ని వెయ్యి కుటుంబాలతో ముట్టడిస్తామని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే కుటిలయత్నాలు చేయవద్దని సర్కిల్ ఉప కమిషనర్ కు హితవు పలికారు.

# గొర్రెల మంద పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- 20 గొర్రెలు హతం
- మరో ఏడు గొర్రెలు రెండు మేకలకు తీవ్ర గాయాలు
- బస్సు ప్రమాదం నుండి తృటిలో తప్పించుకున్న కాపరి అంజప్ప
- నారాయణపేట జిల్లాకు కురుమ నరసింహులు గొర్రెలుగా గుర్తింపు
- గాయపడిన గొర్రెలను తప్పించబోయి సైడ్ రీలింగ్ గుద్దుకున్న మరో డిసిఎం



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ఆర్టీసీ బస్సు గొర్రెల మందపైకి దూసుకెల్లడంతో సుమారు 20 గొర్రెలు మృత్యువాత పడగా, మరో ఏడు గొర్రెలు, రెండు మేకలు తీవ్ర గాయాల పాలైన ఘటన మెదక్ జిల్లాలోని కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు స్థానికుల కథనం ప్రకారం... నారాయణపేట జిల్లా జాజాపూర్ గ్రామానికి చెందిన కురుమ నర్సింలుకు చెందిన గొర్రెల మందను పలువురు కాపరులు కౌడిపల్లి నుండి కొల్చారం మండలంలోని ఎడపాయలకు మేత కొరకు తోలుక పోతున్నారు. ఈ క్రమంలో జేబీఎస్ నుండి మెదక్ డిపోకు వెళుతున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు అతి వేగంగా వచ్చి మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారిపై కొల్చారం శివారులోని చిన్న గుప్పడి కల్వర్టు వద్ద గొర్రెల మంద పైకి దూసుకెళ్లింది. దీంతో 20 గొర్రెలు బస్సు కిందపడి నుజ్జునుజ్జయి ప్రాణాలు కోల్పోగా, మరో ఏడు గొర్రెలు రెండు మేకలు తీవ్ర గాయాల పాలయ్యాయి. కాపరి అంజప్ప మంద వెనకాల నడుస్తూ వేగంగా దూసుకు వస్తున్న బస్సును గమనించి డ్రైవర్‌కి చెయ్యి చూపిస్తూ ఆపమని సైగ చేసినా డ్రైవర్ అది గమనించకుండా స్పీడుగా బస్సును పోనిచ్చాడు. దీంతో అంజప్ప ఒక్క ఉదుటులో ప్రక్కకు దుంకి తృతిలో ప్రాణాలు రక్షించుకున్నాడు. ఇదిలా ఉండగా గాయపడిన గొర్రెలు రోడ్డుపై చెల్లాచెదురు పడి ఉండగా వెనకాలే వస్తున్న మరో డీసీఎం మూలమలుపు వద్ద ఒక్కసారిగా వచ్చి పడిఉన్న గొర్రెలను చూసి వాటిని తప్పించబోయి సైడ్ రీలింగుకు ఢీ కొట్టి అక్కడే ఆగిపోవడంతో మరో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయింది. ఈ సందర్భంగా గొర్రెల కాపరులు మల్లేశం, అంజప్ప మాట్లాడుతూ తాము ప్రతి ఏడు మందలను తోలుకొని మెదక్ జిల్లాలోని ఏడుపాయల వరకు వచ్చి మేపుకొని తిరిగి వెళ్తామన్నారు. ఈ ఏడు ముందుగా పటాన్చెరులో కొన్ని రోజులు మేపి నర్సాపూర్ మీదుగా ఏడుపాయలవైపు వస్తున్నామన్నారు. ఈ ఘటనతో ఒక్కో గొర్రెకు 15 వేల చొప్పున సుమారు మూడు లక్షల వరకు నష్టపోయాం అన్నారు. ప్రభుత్వం తమను ఆదుకొని పరిహారం ఇప్పించాలని కోరారు. కాగా కొల్చారం ఎస్సై మొయినుద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని ఘటనకు కారణమైన బస్సును పోలీస్ స్టేషన్కు తరలించారు. ఘటనపై పంచనామా నిర్వహించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి

- ఉర్కొండ ఎంపీడీవో కృష్ణయ్య



**ఉర్కొండ, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని ఊరుకొండ ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. మండలంలోని రెడ్యాతాండా, మాదారం గ్రామాలను సోమవారం రోజు సందర్శించి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించడం జరిగింది. ఇందిరమ్మ ఇళ్లను మార్క్ ఔట్ ఇవ్వని లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా పనులను ప్రారంభించాలని, బేస్మెంట్ పూర్తి కాని వారు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, బేస్మెంట్ డబ్బులు వచ్చిన లబ్ధిదారులు గోడల పనులు రూఫ్ లెవెల్ వరకు పూర్తిచేసుకోవాలని సూచనలు చేయడం జరిగింది. అలాగే ఎల్ 3 నుండి ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను తిరిగి వెరిఫికేషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్(ఎంపీఓ), పంచాయతీ కార్యదర్శులు కృష్ణయ్య, సాయిరూప, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రైతులు పండించిన పంటలో నుండే నాణ్యమైన విత్తనాలను సేకరించాలి

**కొండాపూర్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** మండల పరిధిలోని తొగర్ పల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ సంగారెడ్డి జిల్లా అధికారులు, ప్రొఫసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ బృందం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసి వరి విత్తనం నుండి వారే విత్తనాలు తయారు చేసుకొనే విధంగా వ్యవసాయ శాఖ సంగారెడ్డి జిల్లా అధికారులు ప్రొఫసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం జూన్ 3వ తేదీన ప్రతి గ్రామానికి ముగ్గురు రైతుల చొప్పున నాణ్యమైన విత్తనన్నీ సరఫరా చేశారు. విత్తనాలు తీసుకున్న రైతులు సాగు చేసి విత్తనం యొక్క అభివృద్ధి ఎదుగుదల ఏ విధంగా ఉందో ఈ క్షేత్ర దినోత్సవంలో భాగంగా రైతుల యొక్క అనుభవలను తోటి రైతులతో పంచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గరెడ్డి, మాట్లాడుతూ రైతులు పాతపద్ధతిలా నాణ్యమైన విత్తనాలు వారు పండించిన పంటను నిల్వ చేసుకుని తోటి రైతులకు అందించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలను పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. ఈ



కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ప్రో.డా.బలరాం, ప్రో.డా. నగేష్ సి డి సి చైర్మన్ రాంరెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ వై ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్లు శ్రీకాంత్ రెడ్డి, మాణిక్ రెడ్డి, పవన్ కుమార్, రామ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరసమ్మ, మండల వ్యవసాయ అధికారులు గణేష్,ప్రేమ్ రాజ్, రవి,ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలి

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ,ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 8మంది ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్సైలకు,సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని,పరిష్కారానికి సూచనలు చేశారు.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ



పని చేస్తుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలియజేశారు.ప్రజా సమస్యలుపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలియజేశారు.

## ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యం సాధించాలి

- వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో సమీక్ష
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసిన అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సంవత్సరానికి గాను 3,750 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు అర్హత ప్రకారం ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

తెలంగాణ సూక్ష్మ నీటి సేద్యం , సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ , రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జాతీయ వెదురు మిషన్ ,వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం వంటి పథకాల అమలు ప్రగతిని సమీక్షించారు. ప్రతి పథకం రైతుల స్థాయిలో ఫలితాలను ఇవ్వాలంటే సమయపాలనతో పాటు సాంకేతిక మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ విస్తరణ ఉండాలి అన్నారు. ఆయిల్ పామ్ సాగు జిల్లాలో ఆదాయాన్ని పెంచే పంటగా మారేలా అన్ని విభాగాల అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి అని సూచించారు.ఆయిల్ పామ్ సాగు విస్తరణలో భాగంగా గోద్రెజ్ ఆగ్రోవేట్ ఆధ్వర్యంలో మండల వారీగా రైతుల అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి (ఎఫ్ఎసి) సి.హెచ్. పండరి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏడీఎస్ అధికారులు, ఉద్యాన విభాగ సిబ్బంది, గోద్రెజ్ ఆగ్రోవేట్ జనరల్ మేనేజర్ స్వీటీ వేగుంట, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- వారందరిని స్మరించుకోవడం మనందరి బాధ్యత
- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్
- సైకిల్ ర్యాలీనీ ప్రారంభించి ర్యాలిలో పాల్గొన్న జిల్లా ఎస్పీ

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** దేశం కోసం ప్రాణాలు అర్పించిన, అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని, వారి స్ఫూర్తితో ప్రతి పోలీసు సమాజ సేవలో నిబద్ధతతో ముందుకు సాగి, ఈ సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజల్లో సామాజిక బాధ్యత, దేశభక్తి స్ఫూర్తి పెంపొందించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం ఉదయం పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం నుండి పాలిటెక్నిక్ కళాశాల వరకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్,జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించి, పోలీసుఅధికారులు, సిబ్బంది, విద్యార్థులు,పాత్రికేయులు, యువతతో కలిసి 200 మందికిపైగా సైకిల్ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ప్రజా రక్షణలో, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధి నిర్వహణ చేస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సైనికుల్లగా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని,ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా, ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని,అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలతో మరింత మమేకం అవుతూ వారి మన్నలను పొందేలా విధులు నిర్వహిస్తున్నామని,పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ వారి ఆశయ సాధన కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. రక్తం గడ్డ కట్టే చలిలో దురాక్రమణలను అడ్డుకొని దేశం కోసం తమ ప్రాణాలనర్పించిన పోలీసు అమరవీరులను ఎప్పటికీ మరువకూడదని అన్నారు.దేశ అంతర్గత భద్రతలో భాగంగా విధులు నిర్వర్తిస్తూ ప్రతి ఏడాది ఉగ్రవాదుల చేతుల్లో,సంఘ విద్రోహక శక్తుల చేతుల్లో ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందని, తెలిపారు.వారందరిని స్మరించుకుంటూ ఈ నెల 21 నుండి 31 వరకు ఈ సంస్మరణ కార్యక్రమాలను జరుపుకుంటున్నామని తెలియ జేశారు. విధి నిర్వహణతోపాటు పోలీసు అధికారులు సిబ్బంది తమ దైనందిన జీవితంలో ఏదో ఒక వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని ఈ



సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి సాయుధ దళ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి సిఐ, కృష్ణయ్య, కొత్తకోట సిఐ, రాంబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలు, యువకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పాత్రికేయులు, పోలీసుసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు పర్యవేక్షణ చేయాలి



- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు పక్కాగా కార్యచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం మెదక్ మండలం రాయనపల్లి గ్రామంలో ఐ.కె.పి ధాన్యం కొన్నిగోలు సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అన్నదాతలు ఎంతో శ్రమించి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించి,ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాలకు వచ్చే చివరి గింజను కొనుగోలు చేసేందుకు జిల్లా లో498 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అధికారులు కేంద్రాలను పర్యవేక్షణ చేస్తారని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దాన్యం కొనుగోలు పక్కాగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గన్ని బ్యాగులు,తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు, రైతులకు కనీసం మౌలిక వసతులు ,లోడింగ్ అన్ లోడింగ్ లో జాప్యం రాకుండా తగు రవాణా సదుపాయాలు మొదలగునవన్నీ ప్రతీ కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉండే విధంగా అధికారులను ఆదేశించామన్నారు. ఏ రోజు కా రోజు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ,వాటి వివరాలను రిజిస్టర్ లో, ట్యాబ్ లో నమోదు చేసి వీలైనంత త్వరగా రైతుల ఖాతాలో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అధికారులు సిబ్బంది ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్



**సంగారెడ్డి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ప్రజావాణి దరఖాస్తు లు వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కి 59 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా అధికారులు ప్రజావాణి దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తే రాష్ట్రంలో ఎక్కడ తిరగనివ్వం

- 8500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా
- ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో 8500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను, తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను, రాష్ట్రంలో ఎక్కడ తిరగనివ్వమని,ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల హెచ్చరించారు. సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వనపర్తి ఎల్ క్యాంప్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రావాల్సిన 8500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల మాట్లాడుతూ,



పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ మొత్తాన్ని విడుదల చేసేంత వరకు ఏబీవీపీ పోరాటాన్ని కొనసాగిస్తుందని హెచ్చరించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు.రెండు సంవత్సరాలు అవుతున్నా విద్యార్థుల సమస్యలపై ఈ ప్రభుత్వం ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాలేదని విద్యార్థులను టిసి లు కూడా ఇవ్వని పరిస్థితి కనిపిస్తుందన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తే రాష్ట్రంలో ఎక్కడ తిరగనివ్వమని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు వేయే ముందు ఆలోచించాలని, మీ పిల్లలకు స్కాలర్షిప్ ఇవ్వకుండా విద్యను నిలిపేస్తున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. అలాగే రాష్ట్ర మంత్రులు టెండర్ల మీద, సహచర మంత్రుల మీద కామెంట్లు చేయడంలోనే మునిగిపోయి విద్యార్థుల సమస్యలపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. 1200 కోట్లు, 1000 కోట్లు అంటూ బేరాలు ఆడకుండా విద్యార్థులకు రావాల్సిన ప్రతి రూపాయి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రేవంత్ రెడ్డి గద్దె దింపే వరకు ఏబీవీపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఈ ధర్నాలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్, శివకుమార్, కొత్తకోట నగర కార్యదర్శి పవన్, పెబ్బేర్ నగర కార్యదర్శి శివతో పాటు బంటి, నితిన్, భరత్, పరమేష్, అనిల్, రూపేష్, కుమార్, అరవింద్, సంతోష్, మోహన్, జగదీష్, జితేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## తేమ మినహాయింపు ఇవ్వాలని
# పత్తి రైతుల ధర్నా

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** తేమ శాతం పేరుతో పత్తి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని అంకోలి గ్రామానికి చెందిన రైతు వెంకటరమణ జిల్లా అధికారుల ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో అధికారికంగా ప్రారంభం అయిన పత్తి కొనుగోలు ప్రక్రియ ప్రారంభం అయింది. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రైతులు మార్కెట్ యార్డుకు తమ పత్తి బండ్లను తీసుకొచ్చారు. పత్తిని తూకం వేసే సమయంలో తేమ శాతం 12% వరకు మించరాదని అనే నిబంధన పెట్టడంతో అందుకు రైతులు తేమ శాతం 20% వరకు మినహాయింపు ఇవ్వాలని అధికారులతో మొర పెట్టుకున్నారు. 20%వరకు మినహాయింపు ఇచ్చిన తరువాతనే పత్తిని కొనుగోలు చెయ్యాలని అంతవరకు పత్తిని తూకం వేసేది లేదని తూకం వేసే కాంటా వద్ద పెద్ద ఎత్తున రైతులు ధర్నాకు దిగి తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో కొద్ది సేపు పత్తి కొనుగోలు ప్రక్రియ నిలిచి పోయింది. అనంతరం డీఎస్పీ జీవన్ రెడ్డి అక్కడకు చేరుకుని రైతులకు సర్ది చెప్పి పరిస్థితిని చక్క దిద్దారు.

# వంద పడకల ఆసుపత్రిపై నిర్లక్ష్యమేలా?

- ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్తాచెదారం
- అపరిశుభ్రంగా మారిన పరిసరాలు
- కంపు కొడుతున్న బాత్రూంలు
- ఎవరు పట్టించుకోక అధ్వాన్నంగా మారింది
- అర్భాటాలలో ఉన్న శ్రద్ధ రోగుల సంక్షేమంపై లేదు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి
- ఆసుపత్రిలో అణువణువు పరిశీలన





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని వంద పడకల ఆసుపత్రిపై అధికారులు, మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రిలో చెత్తాచెదారం ఎక్కడికక్కడే పేరుకుపోయింది. పరిసరాలు అపరిశుభ్రంగా మారి కంపు కొడుతుంది. ఇది హాస్పిటలేనా అంటూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి హాస్పిటల్ సూపరింటెండెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. భూపాలపల్లి వంద పడకల ఆసుపత్రిని సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పరిశీలించారు. ఆసుపత్రిలో అణువణువు తిరుగుతూ సుమారు రెండు గంటల పాటు గదులను, పరికరాలను, బాత్రూంలను పరిశీలించారు. వైద్య సేవలపై వైద్యులను, రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి సూపరింటెండెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గండ్ర వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ అధికారులకు, పాలకులకు అర్భటాలు, ప్రారంబోత్సవాలలో ఉన్న శ్రద్ధ రోగుల సంక్షేమంపై లేదని విమర్శించారు. ఆరోగ్య శాఖ మంత్రి గాని, జిల్లా మంత్రి గాని ఒక్క రివ్యూ పెడితే వంద సమస్యలు పరిష్కారం అవుతాయని హితవు పలికారు. ఆసుపత్రిలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తుందని, ఇలా అయితే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పోతుందని తెలియజేశారు. ప్రజలు ఆసుపత్రి నిర్వహణ లోపాలను తమ దృష్టికి తీసుకురావడం కారణంగానే ఈ రోజు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా పరిశీలిస్తే ఆసుపత్రిలో చెత్త పెరుకపోయి కనిపించిందని, టాయిలెట్స్ అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయని తెలిపారు. ఇదేంటని ప్రశ్నించిన మహిళలపై మీకేం తెలుసంటూ సూపరింటెండెంట్ దురుసుగా ప్రవర్తించడం జరిగిందని, ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ఆసుపత్రిలో మెరుగైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి, సర్వర్ సమస్య లేకుండా చేసి రోగులు వెయిటింగ్ చేయకుండా చూడాలని, గర్భిణీలు వారి వివరాలు నమోదు చేసుకోవడానికి గంటల తరబడి నిలబడటం జరుగుతుందని, కనీసం వారు కూర్చోవడానికి చైర్స్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజలకు అత్యంత అవసరమైన వైద్య పరికరం సిటి స్కాన్ అమర్చి నెలలు గడుస్తున్నా ఇంత వరకు ప్రారంభించకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఆసుపత్రిలో అనేక సమస్యలు పేరుకు పోయాయని, మంత్రులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆసుపత్రులో సమస్యలన్నీ పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు గండ్ర హరీష్ రెడ్డి, సిద్ధు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల కేటాయింపుకు
# లక్కీ డ్రా నిర్వహణ

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్27 (జనంసాక్షి) :** జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపుకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని లక్కీ డ్రా ద్వారా 47 మద్యం షాపులను కేటాయించారు. మొత్తం 991 దరఖాస్తులు అందిన నేపథ్యంలో, ఒక్కో షాపుకు సంబంధించిన దరఖాస్తుల ఆధారంగా టోకెన్ నంబర్లు కేటాయించి, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ స్వయంగా డ్రా తీశారు. డ్రా ప్రారంభం నుండి ముగింపు వరకు ఫోటో, వీడియో చిత్రీకరణ జరిపి, పూర్తి పారదర్శకతతో ప్రక్రియ పూర్తి చేశారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా డ్రా కొనసాగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సాగింది. లక్కీ డ్రాలో ఎంపికైన వారికి నిర్ణీత లైసెన్స్ ఫీజు చెల్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు వేదికపైనే కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజాక్, ఎక్సైజ్ సిబ్బంది, మద్యం దుకాణాల దరఖాస్తుదారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం లక్కీ డ్రా పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ మండలం శ్రీరాంపూర్ లో గల పి.వి.ఆర్. గార్డెన్స్ లో నిర్వహించిన లక్కి డ్రా కార్యక్రమానికి ఆబ్కారీ, మద్య నిషేధ శాఖ అధికారి నంద గోపాల్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నూతన మద్యం పాలసీ విధానం ద్వారా దుకాణాలు కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మద్యం దుకాణాల కొరకు 1 వేయి 712 దరఖాస్తులు వచ్చాయని, 73 దుకాణాలకు లక్కీ డ్రా తీయడం జరిగిందని తెలిపారు. నూతన మద్యం పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని, దుకాణాల వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేయడం జరిగిందని, లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫోటో, వీడియో చిత్రీకరణ చేయడం జరిగిందని, టోకెన్ కలిగి ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దుకాణం పొందిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.



## సోయా కొనుగోళ్లను ప్రారంభించండి

- అంతరాష్ట్ర రహదారిపై రైతుల ధర్నా

**బోథ్, అక్టోబర్ 27(జనంసాక్షి) :** సోనల మండల కేంద్రంలోని సోయా, మొక్కజొన్న, పంటల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని సోనాల మండలం రైతులు డిమాండ్ చేశారు.. సోమవారం స్థానిక అంబేద్కర్, చత్రపతి శివాజీ కూడలి వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ మద్దతు తెలుపుతూ సోయా మొక్కజొన్న పంట చేతికొచ్చి నెలలు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదని వాపోయారు. అలాగే ఎటువంటి నిబంధనలు లేకుండా పంటలను కొనుగోలు చేయాలన్నారు. బోథ్ లోనే కాకుండా సొనల మండలంలో కేంద్రం ఏర్పాటు చేయాలని అలాగే కపాస్ కిసాన్ యాప్ ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు అభిలాష్, సుధీర్ రెడ్డి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 27(జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 61 దరఖాస్తులు వచ్చాయి. వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదివాస్

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సమస్యల పరిష్కారానికే ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా దివాస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే నిర్వహించారు. ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా, జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుండి మొత్తం 10 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే గారు మాట్లాడుతూ %-%ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. చట్టబద్ధ పరిష్కారం ద్వారా ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత దగ్గరగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు.

## హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో
## టీయూడబ్ల్యూజే( ఐజేయు) ఘన విజయం

- గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టుల సంబురాలు




**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 25 (జనం సాక్షి) :** ఎంతో ప్రతిష్టాత్మకంగా, హోరా హోరీగా జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో టీయుడబ్ల్యూజే మద్దతుతో పోటీ చేసిన ఫ్రెండ్స్ ప్యానెల్ అఖండ మెజారిటీతో ఘన విజయం సాధించింది. దీంతో హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ బాధ్యులు సంబురాలు జరుపుకున్నారు. ప్రెస్ క్లబ్ ఆవరణలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకుని హైదరాబాద్ లో ఐజేయూ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రేతల అరెస్టు



**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 27(జనం సాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లోని నూగూర్ పరిసర ప్రాంతంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తులను వెంకటాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 14.213 కేజీల గంజాయి ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కె తిరుపతి రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నాడు మధ్యాహ్నం 1:00 గంట సమయంలో ఆరుగురు వ్యక్తులు, మూడు మోటార్ సైకిల్ లపై ప్రభుత్వ నిర్దేశంమూడు మోటార్ సైకిల్ లపై ప్రభుత్వ నిషేధితగంజాయిని భద్రాచలం వైపు నుండి వెంకటాపురం మీదుగా ములుగు తరలిస్తున్నట్లు ఎస్సై కె తిరుపతి రావు కి అందిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించారు. వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా, 5:00 గంటల సమయంలో వెంకటాపురం నుండి ఏటూరునాగారం వైపుకు ఆరుగురు వ్యక్తులు, మూడు మోటార్ సైకిళ్ళు రావడం గమనించారు. ఎస్సై కె తిరుపతి రావు పోలీస్ సిబ్బంది తో ఒక్కసారిగా రోడ్డు పైకి వచ్చి వారిని అపుటకు ప్రయటించారు. వారిలో ముందు ఉన్న మోటార్ సైకిళ్లపై ఉన్న ఇద్దరు వ్యక్తులు పట్టు బడ్డారు. వెనకాల ఉన్న మోటార్ సైకిళ్లపై ఉన్న వ్యక్తులు పోలీస్ వారిని గమనించి బైక్ తిప్పుతూ స్కిడ్ అయి కింద పడి వారి వద్ద ఉన్న బ్యాగ్ని, బైక్ తో సహా వదలి అడవి లోకి పారిపోయారు. మూడవ మోటార్ సైకిల్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా వెనకాల తిప్పుకొని తన వద్ద ఉన్న బ్యాగులను తీసుకొని పారిపోయారు. పట్టుబడిన ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా 1) తాటి ధర్మ ఏ సత్యం, 2) మడకం రాయి ఎర్ర ఏ రమేష్, వీరిద్దరిది పెంక కరాయ గ్రామం, మన్నెంకొండ మండలం, మల్కానగిరి జిల్లా, ఒడిస్సా రాష్ట్రం అని తెలిపినారు. ఎస్ ఐ కే తిరుపతిరావు పట్టుబడిన వారిని నీ వద్ద బ్యాగులో ఏమున్నదని పారిపోయిన రెండు మోటర్ సైకిల్ వ్యక్తులు ఎవరు అని అడిగారు. పట్టుబడిన వారిద్దరూ మిగతా రెండు మోటార్ సైకిల్ పై ఉన్నవారు పడి వేసిన బ్యాగులో గంజాయి ఉందని అందుకే మమ్మల్ని పట్టుకోగానే వారు పారిపోయారని తెలిపారు. పోలీసు వారు వారిని విచారించగా వీరిద్దరూగ్రామం దుప్పలకొండ3) దూరం దుర్గయ్య గ్రామం దుప్పలకొండ, 4) సోడి జోగాఏజోగయ్య, సాధ్యానపల్లి గ్రామం, అని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా నలుగురు వ్యక్తులు రహస్యంగా గంజాయి ప్రభుత్వం చేత నిషేధించబడినది అని తెలిసిన గంజాయి వ్యాపారం చేస్తూ అక్రమ సంపాదన చేస్తుంటారని తెలిపారు. వీరిపైన ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని తెలిపారు. ఆర్పిఎల్ నేరస్తులను పట్టుకోవడం కోసం ఒక టీంలు ఏర్పాటు చేసి పంపించడం జరుగుతుందని సమాచారం రాగానే సత్వరంగా స్పందించి నేరస్తులను పట్టుకున్న వెంకటాపురం పోలీసులను అభినందించినట్లు తెలిపారు.

# 67 మద్యం షాపులకు డ్రా తీసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 27 (జనంసాక్షి) :** హనుమకొండ వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని 67 మద్యం షాపులకు లాటరీ డ్రా ను సోమవారం తీశారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి లాటరీ డ్రాను తీసేందుకు ఏర్పాట్లు చేయగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై డ్రా తీశారు. 67 మద్యం షాపులకు గాను 3175 దరఖాస్తులు రాగా లాటరీ పద్ధతిన డ్రాను తీశారు. ఒక్కో మద్యం దుకాణానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సమక్షంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ డ్రా తీసి సంబంధిత నెంబర్ ను ప్రకటించారు. మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి లాటరీ పద్ధతిన డ్రా లో కేటాయించబడిన అభ్యర్థికి కేటాయింపు పత్రం ఎక్సైజ్ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎక్సైజ్ శాఖ సిఐలు,ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



## వలపు వల విసిరి.. లక్షలు కొట్టేసి..

- గొంతు మార్చి, ప్రజలను మోసం చేస్తున్న ఘరానా ముఠా అరెస్ట్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** వలపు వల విసురుతూ ప్రజలను బురిడీ కొట్టిస్తూ లక్షలు కొట్టేస్తు జల్సాలకు పాల్పడుతున్న ఘరానా ముఠాను జిల్లా పోలీసులు వారి ఆట కట్టించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడు తన వివాహానికై ఆన్లైన్ మరియు యుట్యూబ్ లో వివాహ వధువుల కొరకై శోధిస్తున్న సమయంలో ఓ అమ్మాయి ఫోటోతో యూట్యూబ్ నడుపుకునే ఓ వ్యక్తి బాధితునికి పరిచయమై తన వద్ద ఓ అమ్మాయి ఉందని నమ్మబలికి ఓ మోసగాన్ని పరిచయం చేయడం జరిగిందన్నారు. సదరు వ్యక్తి బాధితున్ని అమ్మాయి పేరుతో, మహిళ గొంతుతో మాట్లాడి తాను ఒక ధనవంతురాలని తన ఆస్తులు కోర్టులో చిక్కుకున్నాయని నమ్మబలికి, లాయర్ కి డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది అదేవిధంగా వారి వివాహం తర్వాత తన ఆస్తులను తన వ్యాపారాన్ని బాధితుడు పూర్తిగా చూసుకోవాలని చెప్పి, అతని వద్దనుండి విడతలవారీగా ఎనిమిది లక్షల రూపాయలను మోసం చేసి తస్కరించారని తెలిపారు. తనకు బంగారం వ్యాపారాలు ఉన్నాయని వాటన్నింటిని నువ్వే చూసుకోవాలని నమ్మించడం జరిగింది అని తెలిపారు. ఈ సందర్భంలో మహిళ గొంతుతో మాట్లాడిన ప్రధాన నిందితుడి మోసంలో పడిన బాధితుడు తనకు విడతల వారీగా ఎనిమిది లక్షలు ఇచ్చి మోసపోవడం జరిగిందని 1930 ద్వారా సైబర్ ఫిర్యాదు చేయగా, ఈనెల 25న ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు, సైబర్ సెల్, వన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన ప్రత్యేక బృందం సూర్యాపేట జిల్లా వద్ద నుండి ముగ్గురు నిందితులను పట్టుకొని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. వీరి వద్ద ఒకటిన్నర లక్షల రూపాయల నగదు, మూడు మొబైల్స్ ఫోన్ లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డబ్ల్యూపీఎస్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, సైబర్ సెల్ ఎస్ ఐ గోపికృష్ణ, వన్ టౌన్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ గోకుల్ జాదవ్, హెడ్ కానిస్టేబుల్ ఏ రమేష్, ఐటీ సెల్ కానిస్టేబుల్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ పోలీస్ స్టేషన్ 125 ఏండ్ల వేడుకలు

- విద్యార్థులకు ఓపెన్ హౌస్
- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం



**దేవరకొండ, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** దేవరకొండ పోలీస్ స్టేషన్ 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ మౌనిక హాజరయ్యారు. ఓపెన్ హౌస్ సందర్భంగా పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, వివిధ విభాగాలు, ఆయుధాలు, సాంకేతిక పరికరాల గురించి వివరించారు. విద్యార్థులకు పోలీస్ స్టేషన్లోని రిసెప్షన్, లాకప్, రికార్డు రూమ్, ఆయుధాగారం వంటి ముఖ్యమైన విభాగాలను చూపించారు. పోలీస్ అధికారులు తమ విధులు, బాధ్యతలను గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు



**చంద్రుగొండ, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ కమిటీ అశ్వరావుపేట నియోజకవర్గ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు రైతులకు సూచించారు. సోమవారం చంద్రుగొండ మండల పరిధిలోని అయ్యన్నపాలెం రైతు వేదికలో ఆత్మ కమిటీ సభ్యులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ అన్నపురెడ్డిపల్లి మండలాల ఆత్మ కమిటీ సభ్యులు ఏడిఏ రవికుమార్ చంద్రుగొండ మండల ఏవో వినయ్, అన్నపురెడ్డిపల్లి మండల ఏవో, రైతులు పాల్గొన్నారు.

## కళేబరాలను తరలించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి



**భువనగిరి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో ఇటీవల కాలంలో ఆవుల కళేబరాలు తరలిస్తున్న వాహనాలు తరచుగా వెళ్తున్నాయి. ఈ వాహనాలు ఉదయం, రాత్రి వేళల్లో ఎక్కువగా సంచరిస్తూ దుర్వాసనతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని కలిగిస్తున్నాయి ముఖ్యంగా పోలీసు శాఖ పర్యవేక్షణ లేకపోవడం వలన ఈ వాహనాలు నియంత్రణ లేకుండా తిరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాదురీ అచ్చయ్య, చందా మహేందర్ గుప్తా, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కోశాధికారి సోమనర్సయ్య, పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, మంగు నర్సింహ రావు, ఆకుతోట రామకృష్ణ, దయ్యాలు కుమార్, కొల్లుజు శ్రవణ్, కనుకుంట్ల రమేష్,కట్టామోజు ఉష కిరణ్, పాల్గొనడం జరిగింది.

## పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసుల అధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డితో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద నుండి కొత్త బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా బైక్ ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. పోలీస్ అమరవీరులు చేసిన త్యాగాలను ప్రజలకు తెలిపేందుకు,పోలీసులు చేసే కఠినతరమైన విధులను ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి,డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరసింహ చారి, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్, సీఐలు, ఆర్ఐ నారాయణ రాజు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు కె.అశోక్, ఎం.అశోక్, సురేష్, సాయిరాం, రాజశేఖర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థినికి గోల్డ్ మెడల్



**బోనకల్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** మేడ్చల్ డి.ఆర్.ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఈ నెల 24,25 తేదీలలో జరిగిన టేబుల్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఖమ్మం జిల్లా బోనకల్ మండలం జానకీపురం గ్రామానికి చెందిన గద్దల సిరి ఖమ్మం సాహితీ జూనియర్ కాలేజీ లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుచూ టేబుల్ టెన్నిస్ క్రీడలలో పాల్గొని అండర్- 17 బాలికల విభాగం నందు డబుల్స్ లో గోల్డ్ మెడల్, సింగిల్స్ లో రజిత పథకాలు సాధించింది.కోచ్ సాంబ మూర్తి తన శిక్షణలో సిరి మెడల్స్ సాధించడం పట్ల తన సంతోషాన్ని వ్యక్త పరిచారు.గోల్డ్ మెడల్ సాధించిన సిరిని ఖమ్మం జిల్లా క్రీడల అధికారి సునీల్ రెడ్డి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్ సిరి ని అభినందించారు.తమ కూతురు కి శిక్షణ ఇచ్చి గోల్డ్ మెడల్ సాధనకు కృషి చేసిన కోచ్ సాంబ మూర్తి కి సిరి తల్లిదండ్రులు కృత్షతలు తెలియజేశారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**జడ్చర్ల, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. బాదేపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో పట్టణ శివారు గంగాపూర్ సమీపంలో ఉన్న మార్కెట్ యార్డులో సోమవారం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల పంటలకు సరైన ధర పొందే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, రైతులు మార్కెట్ ధరలపై అవగాహన కలిగి ఉండాలని, పిఎసిఎస్ ద్వారా కొనుగోలు చేస్తున్న కేంద్రాలలో అమ్మకాలు జరపడం వల్ల మధ్యవర్తుల దోపిడీకి అవకాశం ఉండదని, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా రైతులకు సౌకర్యవంతమైన వెసులు బాటు కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో బాగేపల్లి పిఎసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్, మార్కెట్ చైర్ పర్సన్ జ్యోతి రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికార బలంతో ధర్మకర్త పేరు తొలగింపా..!

- ఆలయ నిర్మాణంలో భారీగా విరాళం ఇచ్చిన దాతగా గుర్తింపు?
- కార్తీక ఉపవాసాల కరపత్రాలలో పేరు తొలగింపు!
- అన్నపరెడ్డిపల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో వింత ఘటన!

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని అన్నపరెడ్డిపల్లి మండలంలోని అన్నపురెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం ఆలయం నిర్మాణానికి ఓ భక్తుడు భారీ స్థాయిలో విరాళాలను సేకరించి ఆలయానికి అందించి అభివృద్ధికి నాంది పలికాడు. దీంతో ప్రభుత్వం సైతం స్వాధీనం పరుచుకొని అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయడమే కాకుండా ఆలయానికి ఈవో మరియు సిబ్బందిని కూడా ఏర్పాటు చేయడం ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నారు. దీంతో కొన్నాళ్ళుగా అటువంటి భక్తుడి పేరును ప్రతి సందర్భంలోనూ ప్రజలు ముందుండే విధంగా గత ప్రభుత్వం కాకుండా ప్రజలు మరియు పాలక మండల సభ్యులు కూడా అన్ని విధాలుగా సహకారాలు అందించడంతో ఇటు ఆలయం మరియు భక్తులతో పాటు వివిధ రకాల ఆలయ దాతలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం మారటంతో అధికార యంత్రాంగం అటువంటి భక్తుడు పేరు శాశ్వత శిలాపాలకాలపై ఉండాలి తప్ప ఇలాంటి ప్రచార కార్యక్రమాలకు ఉండరాదని కొత్త పాలకమండలి ఆంక్షలతో పేరును తొలగించడం పై అన్నపరెడ్డిపల్లి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్మాణానికి కోట్ల రూపాయలు విరాళం ఇచ్చిన దాతను ఎలా తొలగిస్తారంటూ సోమవారం ఆలయ సమీపంలోని ఈవో పాకాల వెంకటరమణను నిలదీయగా స్థానిక ఎమ్మెల్యే జారీ ఆదినారాయణ చెప్పిన విధానమే అమలు చేశామని ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పటంతో కొందరు గ్రామస్తులు కోట్ల



రూపాయలు విరాళాలు అందించడమే కాకుండా అన్ని రకాల సహకారాలు అందిస్తున్న వారిని ఎలా తొలగించటం జరుగుతుందో ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాలకమండలి ఏర్పాటు చేసి తప్పుడు నిర్ణయాలు తీసుకొని ఆలయ అభివృద్ధిని కొనసాగనించకుండా ఉండేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తుంటారా! అంటూ నిలదీయడం మండలంలో చర్చనీయాంసంగా మారింది. ప్రభుత్వాలు మారిన ప్రజల్లో దైవభక్తిని రెట్టింపు చేసే దేవాలయాలల్లో అటువంటి ఆయాలలో రాజకీయాలు నిప్పు పెట్టి అభివృద్ధి జరగకుండా ఇటువంటి ఘోర నిర్ణయాలు తీసుకోవటం అన్నపరెడ్డిపల్లి పట్టణ ప్రజలు చేసుకున్న కర్మ అంటూ గ్రామస్తులు ఆలయం ఎదుట నిరసన వ్యక్తం తెలిపారు. ఇటువంటి విషయాన్ని ఎమ్మెల్యే మరియు అనుచర ఘనం తక్షణమే పాలకమండల తీర్మానాలను మార్చాలని భక్తుడు పేరు చేర్చాలని పట్టణం వాసులు కోరుకుంటున్నారు.

## రైస్‌మిల్ అని చెప్పి కోళ్ల ఫారానికి అనుమతులు

- వెంటనే రద్దు చేయాలని గ్రామస్తుల డిమాండ్

**ఆత్మకూరు ఎస్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** మండల పరిధిలోని ఇస్తాలపురం గ్రామ సమీపం లో ముందుగా రైస్ మిల్లు నిర్మాణం చేస్తామని చెప్పి కోళ్ల ఫామ్ కోసం పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ విషయమై గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి గత కొద్ది రోజుల క్రితం బాలేంల గ్రామానికి చెందిన పులగం వెంకట్ రెడ్డి రైస్ మిల్లు అనుమతులనీ చెప్పి గ్రామస్తులకు తెలియకుండా కోళ్ల ఫారానికి దొడ్డి దారిన అనుమతులు ఇచ్చారని ఆరోపించారు.


కోళ్ల ఫారం వలన ప్రజలకు అనారోగ్యం, పంటపొలాలు పాడవుతాయనీ పక్కనే ఉన్న గ్రామ పంచాయతీ బోరు నీరు కలుషితం అవుతాయని తెలిపారు. వెంటనే కోళ్ల ఫారానికి అనుమతులు రద్దు చేయాలనీ స్థానికులు కార్యదర్శికి రాత పూర్వకంగా ఇచ్చామని రద్దు చేయక పోతే ఉన్నతాధికారులకు పిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు లింగారెడ్డి, శంకర్ ,మధు, శ్రీనివాస్, జనిమియా, వెంకన్న, భాష, సోమయ్య, నాగరాజు, నర్సయ్య, రాములు, వెంకటేశ్వర్లు తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

## ధాన్యం సేకరణలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



**కనగల్, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ఇలా త్రిపాటి హెచ్చరించారు. సోమవారం మండలంలోని పగిడిమర్రి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, తడిసిన ధాన్యం రాశులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ త్రిపాటి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడవడం పట్ల ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏపిఎం, కేంద్ర ఇన్చార్జి లకు షాకోజ్ నోటీసులు జారీ చేశారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా జాగ్రత్త తీసుకోవాలని పదేపదే హెచ్చరించినప్పటికీ నిర్లక్ష్యం వహించినందుకుగాను పై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆమె వెంట డిఆర్డిఏ పిడి ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి, ఎంపీడీవో కే సుమలత, మాజీ సర్పంచ్ గోలి నర్సిరెడ్డి, జిల్లా కిసాన్ సెల్ కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి, రైతులు, ఐకెపి నిర్వాహకులు ఉన్నారు.

## భార్యాభర్తలను వరించిన అదృష్టం



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన మద్యం దుకాణాల టెండర్ల డ్రాలో భార్యాభర్తలను అదృష్టం వరించింది. జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ డ్రా పద్ధతిలో దుకాణాలను ఎంపిక చేశారు. వీటిలో వేములపల్లి మండలం లక్ష్మీదేవి గూడెం గ్రామానికి చెందిన ఎలికట్టి భరత్ కు గెజిట్ నెంబర్ 21లో, ఆయన భార్య శ్రావణికి గెజిట్ నెంబర్ 13 లో షాపులు దక్కించుకున్నారు.వందల సంఖ్యలో వచ్చిన టెండర్లలో భార్యాభర్తలకు షాపులు దక్కడంతో పలువురు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు చేయాలి



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోర్ 27 (జనంసాక్షి) :** సూర్యాపేట పట్టణంలో పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం పనులను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది సహకారంతో పనులు చేయాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంత రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఈఈ ఎం.కిరణ్, డిఈలు సత్యారావు, రమాదేవి, ఏఈలు బండి అనిల్,తిరుమలయ్య, ఎస్ఎస్ఆర్.ప్రసాద్ ,రంజిత్ , సయ్యద్ సమ్మి, ఏజెన్సీ సిబ్బంది శివ,అనిల్ కుమార్,జీవన్, మున్సిపల్ లైన్ మెన్స్ తదితరులు పాల్గొన్నారు.

## లక్కీడ్రా ద్వారా పారదర్శకంగా మద్యం దుకాణాల ఎంపిక

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలో లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాలను పారదర్శకంగా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ లో లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు.లక్కీ డ్రా అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మద్యం దుకాణాల ఎంపికను లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించామని స్పష్టం చేశారు.2025-27 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మొత్తం 93 దుకాణాలు ఉన్నాయని, వాటిలో గౌడ్లకు 27 షాపులు, ఎస్సీలకు 10 షాప్స్, ఎస్టీలకు చెందిన 3 షాప్ లను రిజర్వేషన్ ప్రకారం కేటాయించామని వెల్లడించారు.సెప్టెంబర్ 26న టెండర్ నోటిఫికేషన్, అప్లికేషన్లు స్వీకరణ మొదలుపెట్టామని, దరఖాస్తులు అక్టోబర్ 23 వరకు స్వీకరించామని తెలిపారు. మొత్తం 2771 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.లక్కీ డ్రా లో మద్యం షాపులు పొందిన వారు డిసెంబర్ 1వ తేదీ నుండి నూతన లైసెన్సులతో మద్యం దుకాణాలు నిర్వహించవచ్చని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు.మద్యం షాపులు పొందిన వారు నిర్దేశించిన సమయంలోగా లైసెన్స్ ఫీజు చెల్లించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ కె.నరసింహ,జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్, ఎక్సైజ్ సిఐలు మల్లయ్య, శంకర్, నాగార్జున రెడ్డి, రజిత, స్టీఫెన్ సన్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గతుకుల రోడ్లపై గమ్యానికి చేరేది ఎలా..

- అడుగుకో గుంత ప్రయాణం చింత

**మణుగూరు, అక్టోబర్ 27 (జనం సాక్షి) :** అడుగుకో గుంత ..ప్రయాణం చింత.. వేలకు వేలు రోడ్డు ట్యాక్స్ లు కట్టి చావును కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు అన్నారు సోమవారం మణుగూరు మండలం లోని అంబేద్కర్ సెంటర్ లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జిల్లాలో ప్రధాన రహదారులపై ఏర్పడ్డ గుంతల వల్ల ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని, వెంటనే రహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి ప్రజల ప్రాణాలను రక్షించాలని కోరారు. అర్హత లేని కాంట్రాక్టర్ తో నాసిరకం మెటీరియల్ నాణ్యత లేని పనులు చేస్తూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ టి



సి పోశం నరసింహ రావు, కుర్రి నాగేశ్వర రావు, కుంటా లక్ష్మణ్ యాదగిరి గౌడ్,రమేష్, రామారావు బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లిలో జోరుగా మీటర్ ఫైనాన్స్ దందా..


- అధిక వడ్డీలకు సామాన్యులు విలవిల
- పోలీసుల పర్యవేక్షణ లోపించడంతో విచ్చలవిడిగా జీరో ఫైనాన్స్ దందా

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** వేటు వ్యాపారుల చేతిలో సామాన్యులు అవసరానికి రుణాలు తీసుకొని తిరిగి చెల్లించలేక అవస్థల పాలవుతున్నారు. కొందరు అధిక వడ్డీ ఆశ చూపించి, నమ్మించి, వ్యక్తుల, వ్యాపారుల నుండి డిపాజిట్లు వసూలు చేసి చివరికి మోసగిస్తున్నారు. డిపాజిట్లపై లాభాల ఆశకు కొందరు అప్పులు చేసి, పెట్టుబడి పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు తరచుగా ఇలాంటి మోసపూరిత సంఘటనలు బయటపడుతున్నాయి. చాలామంది వ్యాపారస్తులు ఆర్థికంగా నష్టపోయి పరువు కోసం పాకులాడి పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. కొండమల్లేపల్లి మండల కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో అమాయక ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని అధిక వడ్డీలు వసూలు చేసేవారి ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. రోజువారి, వారాంతపు, నెలవారి ఫైనాన్సుల పేరిట అమాయక నిరుపేద ప్రజలకు, వ్యాపారులకు బురిడీ కొడుతూ వడ్డీ వద్ద ప్రామీసరీ నోట్లలో ఖాళీలను ఉంచుతూ నిరుపేద ప్రజల నుంచి దర్జాగా అధిక వడ్డీలను వసూలు చేస్తూ కొందరు ఈ అక్రమ వ్యాపారాన్ని దర్జాగా కొనసాగిస్తున్నారు. అమాయక నిరుపేద ప్రజల, చిరు వ్యాపారాలు చేసుకునే వ్యాపారుల అవసరాలను ఆసరాగా తీసుకొని ఇష్టారీతిన అధిక వడ్డీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఫైనాన్స్ లు, అక్రమ చిట్టి వ్యాపారాలు నడిపే అక్రమార్కుల ఆగడాలు తట్టుకోలేక చిరు వ్యాపారులు, అమాయక నిరుపేద ప్రజలు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంది. రాజమండ్రి, కాకినాడ, నెల్లూరు, గుంటూరు, మాచర్ల, నల్గొండ సుదూర ప్రాంతాల నుండి వచ్చి కూటమికట్టి జోరుగా మీటర్ వడ్డీ ఫైనాన్స్ వ్యాపారాలను దర్జాగా కొనసాగిస్తున్నారు. ఈ అక్రమ ఫైనాన్స్ వడ్డీ దందా, చిట్టి వ్యాపారాల్లో అధిక లాభాలు ఉండడంతో ఈ అక్రమ వ్యాపారాలు జోరుగా నడుస్తున్నాయి. ఫైనాన్స్ వ్యాపారులు అధిక వడ్డీలను నెలవారి చిట్టి డబ్బులను వ్యాపారస్తుల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. గ్రామాల్లో నూటికి రూ. 3 వడ్డీకి అప్పులు ఇస్తారు. పట్టణాల్లో నూటికి రూ. 4 నుండి 8,10,12 వరకు ఇస్తారు. రుణదాతలు ముందుగానే స్థిర, చర ఆస్తులను తనాఖ పెట్టుకుంటారు. మండల పరిధిలోని చాలా గ్రామాల్లో మహిళలను గ్రూపులుగా చేసి అప్పులు ఇచ్చి ఒక్కరు కొట్టకున్నా అందరినీ వేధిస్తున్నారు. కొండమల్లేపల్లి పట్టణంలో సుమారు 10 ఫైనాన్స్ కంపెనీలు విచ్చలవిడిగా అధిక వడ్డీలతో రుణాలు ఇస్తున్నారు. మండల పరిధిలోని పరిసర ప్రాంత గ్రామాలలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు మళ్లీ పడగలు విప్పుతున్నాయి. ప్రజల ఆర్థిక అవసరాలు ఆసరా చేసుకొని వ్యాపారం కొనసాగిస్తున్నాయి. అధిక వడ్డీలకు విచ్చలవిడిగా రుణాలు ఇస్తున్నాయి. ఏజెంట్లు వారం వారం గ్రామాలకు వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారు. సకాలంలో రుణాలు చెల్లించకపోతే నిర్మోహమాటంగా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. గతంలో అధిక వడ్డీల కారణంగా కుటుంబాలు వీధిన పడడంతో ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్ సంస్థలను నిషేధించింది. ప్రస్తుతం మళ్లీ విస్తరిస్తుండడంతో వీటిని అడ్డుకోవాలని మహిళలు కోరుతున్నారు. పట్టణ కేంద్రంలో ఘోరంగా మీటర్ వడ్డీ ఫైనాన్స్ లు జోరుగా సాగుతున్నాయి. లక్షకు సుమారుగా పదిహేను రూపాయల ఆధిక మీటర్ వడ్డీలను చిరు వ్యాపారుల నుండి వసూలు చేస్తున్నారు. సమయానికి మీటర్ వడ్డీలు కట్టకపోతే తమ ద్విచక్ర వాహనాలను, విలువైన ఆస్తి పత్రాలను లాక్కుంటున్నారు. మీటర్ వడ్డీలు, ఆధిక వడ్డీల ఫైనాన్స్ నడిపే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.




# లాభాల్లో ముగిసిన సూచీలు

**• సెన్సెక్స్ 567 పాయింట్లు జంప్**



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. వరుసగా ఆరు రోజుల పాటు వరుస లాభాలు చవిచూసిన సూచీలు.. శుక్రవారం విరామం తీసుకున్నాయి. మళ్లీ ఈ వారాన్ని లాభాలతో మొదలుపెట్టాయి. ముఖ్యంగా అమెరికాలో ఊహించిన దానికంటే తక్కువ ద్రవ్యోల్బణం నమోదు కావడం మన సూచీలకు కలిసొచ్చింది. దీనివల్ల 2025లో ఫెడ్ రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలపడ్డాయి. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే భారత్ వంటి మార్కెట్లలోకి నిధుల ప్రవాహం పెరుగుతుంది. దీనికితోడు అమెరికా–చైనా మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలతో సూచీలు దూసుకెళ్లాయి. సెన్సెక్స్ ఉదయం 84,297.39 పాయింట్ల లాభంతో (క్రితం ముగింపు 84,211.88) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,932.08 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 566.96 పాయింట్ల లాభంతో 84,778.84 వద్ద ముగిసింది. నిఫ్టీ 170.90 పాయింట్ల లాభంతో 25,966.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.25గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్, ఎటెర్నల్, ఎస్‌బీఐ, టాటా మోటార్స్ ప్యాసింజర్స్ వెహికల్స్ రాణించాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, బీఈఎల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.49 వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4044 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




## 2 కోట్ల షేర్లు అమ్మేస్తున్న 'లెన్స్‌కార్ట్' సీఈవో..

**న్యూఢిల్లీ:** ఐవేర్ రిటైలర్ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 31న ప్రారంభంకానుంది. నవంబర్ 4న ముగియనున్న ఇష్యూలో భాగంగా రూ. 2,150 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు మరో 12.75 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. యాంకర్ ఇన్వెస్టర్లకు 30న షేర్లను ఆఫర్ చేయనుంది. ఐపీవో నిధులను పెట్టుబడి వ్యయాలు, దేశీయంగా కంపెనీ నిర్వహణలోని సొంత స్టోర్ల ఏర్పాటు, లీజ్, అద్దెలు, లైసెన్స్ ఒప్పందాల చెల్లింపులు తదితరాలకు వినియోగించనుంది. వీటితోపాటు.. టెక్నాలజీ, క్లౌడ్ ఇన్‌ఫ్రా, బ్రాండ్ మార్కెటింగ్, ఇతర సంస్థల కొనుగోళ్లకు సైతం మరికొన్ని నిధులను వెచ్చించనుంది. కాగా.. గత వారం డీమార్ట్ స్టోర్ల అధినేత రాధాకృష్ణన్ దమానీ ప్రీఐపీవో రౌండ్‌లో భాగంగా కంపెనీలో రూ. 90 కోట్లు ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. 2008లో ఏర్పాటైన కంపెనీ ఫ్యాషనబుల్, ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు, సన్‌గ్లాసెస్, కాంటాక్ట్ లెన్స్‌లను రూపొందించి విక్రయిస్తోంది. ఆన్‌లైన్ అమ్మకాలుసహా ఫిజికల్ స్టోర్లనూ నిర్వహిస్తోంది. లెన్స్కార్ట్వ్యవస్థాపకుడు, సీఈఓ 'షార్క్ ట్యాంక్ ఇండియా' ఫేమ్ పీయూష్ బన్సాల్, ఆఫర్ ఫర్ సేల్‌లో భాగంగా 2.05 కోట్ల షేర్లను విక్రయించడం ద్వారా రూ .824 కోట్లుఅందుకోనున్నారు. అక్టోబర్ 31 న ప్రారంభమయ్యే ఐపీఓ తరువాత, బన్సాల్ కంపెనీలో 8.78% వాటాను కలిగి ఉంటారు. ఆయనసోదరి, కంపెనీ సహ వ్యవస్థాపకురాలు నేహా బన్సాల్ కూడా రూ .40.62 కోట్ల చెల్లింపునకు సుమారు 10.1 లక్షల షేర్లను విడుదల చేస్తున్నారు. వీరితోపాటు ఇతర ప్రమోటర్లు అమిత్ చౌదరి, సుమీత్ కపాహి ఐపీఓలో చొప్పున 28.7 లక్షల షేర్లను విక్రయిస్తున్నారు. వీరిద్దరూ కంపెనీలో 0.8 శాతం వాటాను కలిగి ఉన్నారు.

## 76 ఏళ్ల విజయానికి గుర్తు!..

**ఫెరారీ కొత్త కారు**



*రోమ్:ఇటాలియన్ సూపర్ కార్ల తయారీ సంస్థ ఫెరారీ ఎఫ్76 పేరుతో ఓ కొత్త డిజిటల్ హైపర్‌కార్ కాన్సెప్ట్ ఆవిష్కరించింది. ఇది ఇప్పుడు మార్కెట్లో ఉన్న ఇతర ఫెరారీ కార్ల కంటే కూడా భిన్నంగా ఉంది. ఇది ప్రస్తుతానికి సాధారణ కారు కాదు. ఎందుకంటే ఇది పూర్తిగా వర్చువల్ / డిజిటల్ ప్రపంచంలో మాత్రమే ఉంటుంది. ఫెరారీ ఎఫ్76 కారును కంపెనీ 2025 అక్టోబర్ 25న ఇటలీలోని ముగేల్లో సర్క్యూట్ వద్ద 'ఫెరారీ ఫినాలి మొండియాలి' ఈవెంట్‌లో దీన్ని ఆవిష్కరించారు. ఎఫ్76 అనేది.. 1949లో ఫెరారీ మొదటిసారి లే మ్యాన్స్ 24 హవర్స్ రేస్ గెలిచినా సందర్భంగా.. ఆ విజయానికి 76 పూర్తయ్యాయని సూచిస్తుంది. కంపెనీ దీనిని కాన్సెప్ట్ రూపంలో మాత్రమే ఆవిష్కరించింది. ఇది చూడటానికి ఆన్‌లైన్‌లో ఏ వీడియో గేమ్ ప్లాట్‌ఫామ్‌లో కనిపించే ఓ కారు మాదిరిగా ఉంటుంది. కాబట్టి దీనిని ప్రస్తుతం కొనుగోలు చేయలేరు. అంతే కాకుండా దీనిని డిజైన్ ఫ్రీడమ్ కోసం రూపొందించిన కాన్సెప్ట్. కాబట్టి దీనికి భద్రతా ప్రమాణాలు, హెూమోలోగేషన్ వంటి పరిమితులు లేవు. బహుశా భవిష్యత్తులో ఈ కారును కంపెనీ లాంచ్ చేయవచ్చు. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడలేదు. ఫెరారీ ఎఫ్76 కారు డిజైన్ చాలా భిన్నంగా ఉండటం గమనించవచ్చు. ముందు బ్రాండ్ లోగో.. దానికింద ఎక్కువ స్పేస్ ఉంది. ఇందులో లైటింగ్ సెటప్ లేకపోవడం గమనార్హం. సైడ్ ప్రొఫైల్, అల్లాయ్ వీల్స్ మొత్తం కూడా కొత్తగా ఉన్నాయి. రియర్ ప్రొఫైల్ గమనిస్తే.. ఇండికేటర్ వంటిది చూడవచ్చు. బటర్‌ఫ్లై డోర్స్ కూడా కొత్తగా ఉన్నాయి. స్టీరింగ్ వీల్ సాధారణ ఫెరారీ మాదిరిగా లేదు.*

## ఏసీసీలో మెజారిటీ వాటా కొనుగోలు చేసిన సింప్లీజిత్ గ్రూప్

**హైదరాబాద్:** ఆర్థిక, ఎగుమతులు, స్థిరమైన అభివృద్ధి రంగాలలో బలమైన స్థానం కలిగిన విభిన్న వ్యాపార సంస్థ సింప్లీజిత్ గ్రూప్.. రియల్ ఎస్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ఒక వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే అరేబియన్ కన్స్ట్రక్షన్ కంపెనీ ఇండియాలో మెజారిటీ వాటాను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఏసీసీ గ్రూప్ ఇంజనీరింగ్ ప్రతిభను, సింప్లీజిత్ గ్రూప్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ వ్యూహాత్మక ఫండింగ్ సామర్థ్యాలను కలిపి, ఈ భాగస్వామ్యం ప్రపంచ ప్రమాణాలతో కూడిన.. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మధ్యప్రాచ్యంలోని ప్రముఖ ఫ్యామిలీ ఆఫీసులు.. అంతర్జాతీయ ఇన్వెస్టర్లతో ఉన్న బలమైన సంబంధాల ద్వారా, ఏసీసీ విస్తరణకు అవసరమైన వృద్ధిని సింప్లీజిత్ సమకూర్చనుంది. అరేబియన్ కన్స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) మేనేజింగ్ డైరెక్టర్ అనీ రే.. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సింప్లీజిత్ గ్రూప్ స్పష్టమైన దృష్టి విస్తరణ దిశగా చూపిన సిద్ధత ఈ భాగస్వామ్యానికి బలమైన పునాది. ఏసీసీ ఇండియా వృద్ధికి ఇది కొత్త అధ్యాయం అవుతుందని అన్నారు. సింప్లీజిత్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అభిజిత్ జయంతి మాట్లాడుతూ.. ఏసీసీ గ్రూప్‌తో భాగస్వామ్యం మా విస్తరణ దృష్టిని మరింత బలపరుస్తోంది. మా ఆర్థిక బలం ఏసీసీ ఆర్కిటెక్చరల్ ప్రతిభను సమన్వయం చేస్తూ, భారత రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త ప్రమాణాలను సృష్టించాలనుకుంటున్నామని అన్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.60 | ₹ 5.62 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,13,000 | ₹ 1,23,280 |
| --- | --- |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,70,000

## మౌలిక సదుపాయాల కల్పనకు సిద్ధమవుతున్న 'నువోకో విస్టాస్' కంపెనీ

అహ్మదాబాద్:కామన్వెల్త్ గేమ్స్ శతాబ్ది ఉత్సవాలకు 2030లో గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అక్కడి స్థానిక మార్కెట్‌లో సిమెంట్ డిమాండ్ గణనీయంగా పెరగడానికి అవకాశం ఉంది. ఈ అంతర్జాతీయ క్రీడా కార్యక్రమం వల్ల పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ప్రారంభమవుతాయని, ఇది నిర్మాణ రంగానికి, సిమెంట్ కంపెనీలకు కలిసి వస్తుందని కంపెనీలు అంచనా వేస్తున్నాయి. దేశంలోని ప్రముఖ సిమెంట్ సంస్థల్లో ఒకటైన నువోకో విస్టాస్ కార్పొరేషన్ లిమిటెడ్ భవిష్యత్తులో పెరిగే ఈ డిమాండ్‌ను అందిపుచ్చుకోవడానికి వ్యూహాత్మకంగా చర్యలు చేపడుతోంది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జయకుమార్ కృష్ణస్వామి మాట్లాడుతూ.. తమ కంపెనీ పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. 2030 నాటికి అహ్మదాబాద్ మార్కెట్‌లో డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

## ఉన్న కారుకే.. రేంజ్ రోవర్ పేరు

**నవ్వుకుంటున్న జనం!**



మెర్సిడెస్ బెంజ్, రేంజ్ రోవర్ కార్లను కొనాలని ఎవరికి మాత్రం ఉండదు చెప్పండి. అయితే.. ధరలు ఎక్కువ కావడం వల్ల ఈ బ్రాండ్ కార్లను కొనుగోలు చేయడం కష్టమే. ఆలా అని ఒక వ్యక్తి ఊరుకోలేదు.. తన దగ్గర ఉన్న కారుకే.. తనకు ఇష్టమైన కారు పేరును రాసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో.. హ్యుందాయ్ కంపెనీకి చెందిన ఎక్స్‌టర్ కారుకు, రేంజ్ రోవర్ అని ఉండటం చూడవచ్చు. కాగా రేంజ్ రోవర్ అక్షరాలా కింద హ్యుందాయ్ లోగో, దానికి కింద ఎక్స్‌టర్ అనేది కనిపిస్తున్నాయి. చూడగానే ఇది రేంజ్ రోవర్ అనుకుంటే.. ఎవరైనా పొరబడినట్లే. నిజానికి ఇది చాలామందిని నవ్వుకునేలా చేస్తోంది. పలువురు దీనిపై తమదైన రీతిలో కామెంట్స్ చేస్తున్నారు. సుమారు రూ. 1 కోటి రూపాయల విలువైన కారు కొనాలనే కల ఉన్నప్పటికీ.. దానిని కొనుగోలు చేయలేనప్పుడు ఏం చేయాలి. తన దగ్గర ఉన్న కారుకే ఆ పేరు రాసుకుని సంతోషిస్తున్నాడని కొందరు చెబుతున్నారు.






## దక్షిణచైనా సముద్రంలో కలకలం

**30 నిమిషాల వ్యవధిలో కూలిన అమెరికా నేవీ హెలికాప్టర్, ఫైటర్ జెట్..**

**వాషింగ్టన్:** దక్షిణ చైనా సముద్రంలో అమెరికా నేవీ హెలికాప్టర్, ఫైటర్ జెట్ కుప్పకూలిపోయాయి. కేవలం 30 నిమిషాల వ్యవధిలోనే రెండు వైమానిక వాహనాలు ప్రమాదానికి గురికావడం చర్చనీయాంశంగా మారింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఉన్న ముగ్గురు సిబ్బంది, ఫైటర్ జెట్‌లో ఉన్న ఇద్దరు పైలట్లను సురక్షితంగా కాపాడారు. వివరాల ప్రకారం.. అక్టోబర్ 26, 2025 సాయంత్రం 2:45 గంటలకు మొదటగా ఎంహెచ్–60ఆర్ సీహాక్ హెలికాప్టర్ దక్షిణ చైనా సముద్రంలో కూలిపోయింది. తర్వాత అర గంట వ్యవధిలో అంటే.. 3:15 గంటలకు బోయింగ్ ఎఫ్–18 సూపర్ హార్నెట్ ఫైటర్ జెట్ అదే సముద్రంలో కుప్పకూలిపోయింది. అయితే, ప్రమాదానికి గురైన, నావికా విమానం, హెలీకాప్టర్ రెండూ యూఎస్ నిమిట్జ్ షిప్ నుండి ఆపరేట్ చేస్తున్నవి కావడం విశేషం. అయితే, ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఉన్న ముగ్గురు సిబ్బంది, ఫైటర్ జెట్‌లో ఉన్న ఇద్దరు పైలట్లు సురక్షితంగా ఉన్నారు. పైలట్లు సముద్రంలోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అయితే, సాధారణ కార్యకలాపాల్లో ఉన్నప్పుడే ప్రమాదాలు జరిగినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనలపై విచారణ జరుగుతోందని అమెరికా పసిఫిక్ ఫ్లీట్ అధికారులు ప్రకటించారు. అయితే, ప్రమాదాలకు కారణాలు ఇంకా తెలియరాలేదు.

## హసీనా బహిష్కరిస్తే.. యూనస్ ఆహ్వానించారు!




**ఢాకా:** బంగ్లాదేశ్‌లోని ముహమ్మద్ యూనస్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఏడేళ్ల క్రితం అప్పటి హసీనా సర్కారు ఇస్లామిక్ ప్రచారకుడు జకీర్ నాయక్‌కు బంగ్లాదేశ్‌లోకి ఎప్పటికీ ప్రవేశం లభించదని ప్రకటించగా దీనికి భిన్నంగా యూనస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నవంబర్ 28–29 తేదీలలో ఢాకాలో జరిగే ఛారిటీ కార్యక్రమానికి జకీర్ నాయక్‌కు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆహ్వానం పలికింది. వివాదాస్పద ఇస్లామిక్ ప్రచారకర్త జకీర్ నాయక్‌పై భారతదేశంలో మనీలాండరింగ్‌తో పాటు పలు విద్వేషపూరిత ప్రసంగాలు చేశారనే ఆరోపణలున్నాయి. ఇదేవిధంగా జకీర్ నాయక్‌కు బంగ్లాదేశ్‌లోకి ప్రవేశం లేదని ప్రకటించిన బంగ్లాదేశ్ ఇప్పుడు ఏడేళ్ల తర్వాత తన నిర్ణయం మార్చుకోవడం వివాదాస్పదంగా మారింది. 2016, జూలైలో రాజధాని ఢాకాలోని 'హోలీ ఆర్టిసన్ బేకరీ కేఫ్' పై దాడి వెనుక జకీర్ నాయక్ ప్రమేయం ఉందనే ఆరోపణలు వినిపించాయి. ఈ దాడిలో పాల్గొన్న ఇద్దరు ఉగ్రవాదులు.. జకీర్ నాయక్ బోధనలతో ప్రేరణ పొందారనే వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే అప్పటి ప్రభుత్వం జకీర్ నాయక్‌ను బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించకుండా నిషేధించింది.

### 2016లో జకీర్ నాయక్‌పై ఎన్ఐఏ కేసు

భారతదేశంలోని జాతీయ దర్యాప్తు సంస్థ కూడా అతనిపై ఉగ్రవాదం, మనీలాండరింగ్ తదితర ఆరోపణల కింద దర్యాప్తు చేస్తోంది. ఢాకాలో ఉగ్రవాద దాడి తర్వాత అతను ఆ దేశం నుంచి పరారయ్యాడు. ప్రస్తుతం మలేషియాలో తలదాచుకున్న జకీర్ నాయక్ స్పార్క్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహించే ఛారిటీ కార్యక్రమంలో పాల్గొనేందుకు నవంబర్ 28–29 తేదీలలో బంగ్లాదేశ్‌కు రానున్నారు. ఈ కార్యక్రమం ఢాకాలోని అగర్గావ్ ప్రాంతంలో జరగనుంది. వివిధ మత సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించారనే ఆరోపణలతో 2016లో ఎన్ఐఏ తొలిసారిగా ఉగ్రవాద నిరోధక చట్టాల కింద జకీర్ నాయక్‌పై కేసు నమోదు చేసింది.

## బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి యూనస్ దుస్సాహసం

బంగ్లాలో పర్యటించారు. ఆ సందర్భంగా యూనస్–మీర్జా భేటీ అయ్యారు. అప్పుడు పాక్ జనరల్‌కు యూనస్ పుస్తకాన్ని బహూకరించారు. ఆ బుక్ కవర్ పేజీపై వక్రీకరించిన బంగ్లాదేశ్ మ్యాప్ కనిపించింది. భారత్‌కు చెందిన ఏడు ఈశాన్య రాష్ట్రాలు అందులో భాగంగా కనిపించడం తీవ్ర ఆగ్రహానికి దారితీసింది భారత సార్వభౌమత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఆయన చర్యలను నెటిజన్లు తీవ్రంగా ఖండించారు. మన ఈశాన్య ప్రాంతంపై యూనస్ అక్కసు వెళ్లగక్కడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది చైనాలో పర్యటించిన సందర్భంగా "భారత ఈశాన్య ప్రాంతంలోని ఏడు రాష్ట్రాలను సెవెన్ సిస్టర్స్ అంటారు. అవి బంగ్లాదేశ్‌తో భూపరివేష్టితమై ఉన్నాయి. వారు సముద్రానికి చేరుకోవడానికి వేరే మార్గం లేదు. ఈప్రాంతంలో సముద్రానికి మేమే రక్షకులం. కాబట్టి ఇది భారీ అవకాశం. చైనా ఆర్థిక బేస్‌ను విస్తరించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది" అని వ్యాఖ్యలు చేశారు. మరో సందర్భంలో.. బంగ్లాదేశ్, నేపాల్, ఈశాన్య రాష్ట్రాలకు సమగ్ర ఆర్థిక సమైక్యతా ప్రణాళిక అవసరమని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే అయితే వాటికి అప్పట్లోనే భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. "బంగాళాఖాతంలో భారత్‌కు 6,500 కి.మీ. మేర పొడవైన తీరరేఖ ఉంది. భారతదేశం ఐదు బిమ్‌స్టెక్ సభ్య దేశాలతో సరిహద్దును కలిగిఉంది. ముఖ్యంగా మా ఈశాన్య ప్రాంతం బిమ్‌స్టెక్ కనెక్టివిటీ హబ్‌గా వృద్ధి చెందుతోంది. రోడ్లు, రైల్వేలు, జలమార్గాలు, గ్రిడ్‌లు, పైప్‌లైన్ నెట్‌వర్క్‌లతో ఈ ప్రాంతం పసిఫిక్ మహాసముద్రం వరకు అనుసంధానం అవుతోంది. ఇది నిజంగా గేమ్ ఛేంజర్" అని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ గట్టి బదులు ఇచ్చిన సంగతి తెలిసిందే.



**ఆ మంత్రి గర్భవతి!.. 83 మందిని**

## కనబోతోంది

**అల్బేనియా ప్రధాని సంచలన ప్రకటన**

**తిరానా:** ఆమె మొన్నీమధ్యే మంత్రి పదవి చేపట్టి.. యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అయితే పదవి చేపట్టి నెల తిరగకకుండానే.. ఆమె నెల తప్పిందంటూ ఆ దేశ ప్రధాని సంచలన ప్రకటన చేశారు. ఆమె ఏకంగా 83 మంది పిల్లల్ని కనబోతోందంటూ విచిత్రమైన స్టేట్‌మెంట్ ఒకటి ఇచ్చాడు. అయితే.. ఆ ప్రకటన లోతుల్లోకి వెళ్తే అంతగా ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఉండకపోవచ్చు. అల్బేనియా ప్రధాని ఎడీ రమా బెర్లిన్‌లో జరిగిన గ్లోబల్ డైలాగ్ సమావేశంలో సంచలన ప్రకటన చేశారు. మొన్నీమధ్యే తాను కేబినెట్‌లోకి తీసుకున్న మంత్రి డియోల్లా గర్భవతి అని ప్రకటించారు. అయితే ఆమె మనిషి అనుకుంటే పొరపడినట్లే!. ఆమె ప్రపంచంలోనే ఏఐ ఆధారిత మంత్రి. సాంకేతిక రంగంలో అర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ సంచలనాలు సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. యూరప్ దేశమైన అల్బేనియా మాత్రం ఈ అధునాతన సాంకేతికతను వినూత్నంగా ఉపయోగిస్తోంది. అవినీతిని నిరోధించేందుకు ఏఐ ఆధారిత అసిస్టెంట్ 'డియెల్లా'ను కేబినెట్ మంత్రిగా నియమించింది. ప్రపంచంలోనే ఈతరహా నియామకం జరగడం ఇదే తొలిసారి. అయితే..ఆమె ద్వారా 83 మంది పిల్లలను పుట్టించి.. వాళ్లను పార్లమెంట్‌లోకి వదలబోతున్నారట. ఒక్కో సోషలిస్టు పార్టీ పార్లమెంట్ సభ్యునికి ఒక్కో సహాయకుడిగా కేటాయిస్తారట. "డియెల్లా ద్వారా మేము ఒక పెద్ద ప్రయోగం చేశాం. ఇప్పుడు ఆమె 83 పిల్లలతో గర్భవతి అయింది. పుట్టబోయే ఏఐ సంతానాన్ని సహాయకులు నియమించబోతున్నాం. వాళ్లు పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొని.. సభ్యులు గైర్హాజరైనప్పుడు జరిగిన చర్చలను నమోదు చేసి తగిన సూచనలు ఇస్తారు. ఉదాహరణకు.. మీరు కాఫీకి వెళ్లి తిరిగి రావడం మర్చిపోతే, ఈ పిల్లాడే మీకు ఆ హాల్‌లో ఏమి జరిగింది, ఎవరి మాటకు ప్రతిస్పందించాలో చెబుతాడు అంటూ అల్బేనియా ప్రధాని వివరించారు. పూర్తిగా తల్లి నుంచి సంక్రమించే జ్ఞానంతోనే ఆ పిల్లలు పని చేస్తారని అన్నారాయన. 2026 చివరినాటికల్లా ఈ వ్యవస్థను పూర్థిస్థాయిలో అమలు చేస్తామని ఎడీ రామా ప్రకటించారు. డియెల్లా అంటే సూర్యుడు అని అర్థం. ఆ పేరుకు తగ్గట్లే ఆమెను అల్బేనియన్ సంప్రదాయ దుస్తులతో ముస్తాబు చేశారు. వాస్తవానికి ఈ ఏడాది జనవరిలోనే అనే ప్లాట్‌ఫారంలో వర్చువల్ అసిస్టెంట్‌గా ఆమె సేవలు ప్రారంభించింది. ఆ సేవలను సమర్థవంతంగా నిర్వర్తించడంతో.. సెప్టెంబర్‌లో కేబినెట్ పదవి కట్టబెట్టారు. అవినీతికి తావు లేకుండా.. ప్రస్తుతం ప్రభుత్వ టెండర్లకు సంబంధించిన అన్ని నిర్ణయాలను డియెల్లానే తీసుకుంటోంది. ప్రతి పబ్లిక్ ఫండ్ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా చేస్తోంది.

## సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై చైనా కఠిన నిబంధనలు

**వర్సిటీ డిగ్రీ ఉంటేనే వస్తువుల ప్రచారానికి అర్హులు**




**బీజింగ్:** సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు.. వీళ్లను ఏమాత్రం తక్కువ చేయడానికి వీల్లేదు. మన దేశంలో 35 నుంచి 45 లక్షల మంది ద్వారా గత ఏడాది కాలంలో రూ.3,500 కోట్ల వ్యాపారం జరిగిందంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. అయితే.. ఇలా అడ్డగోలుగా పుట్టుకొస్తున్న ఇన్‌ఫ్లుయెన్సర్లకు చెక్ పెట్టేందుకు మన పొరుగు దేశం చైనా ఓ అద్భుతమైన ప్రణాళిక అమలు చేయబోతోంది. ఏదో ఒక వీడియోతో ఓవర్‌నైట్ సెన్సేషన్ అయిపోవడం ఈరోజుల్లో సర్వసాధారణంగా మారింది. అలా భారత్‌లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు.. ఇంకా పుట్టుకొస్తూనే ఉన్నారు. ఇదే అదనుగా తమ ఉత్పత్తులను ప్రచారం చేయడానికి ఇన్‌ఫ్లుయెన్సర్లను కంపెనీలు ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి. భారత్‌తో పాటు పలు దేశాల్లో వినియోగదారుల కొనుగోలు నిర్ణయాల్లో ఇప్పుడు వాళ్లదే కీలక పాత్ర. పైగా సెలబ్రిటీలకి బదులు తక్కువ బడ్జెట్‌తో ఆ పని చేస్తుండడం కంపెనీలకు కలిసొస్తోంది. ఫ్యాషన్, ఫిట్‌నెస్, ఫుడ్, ఫైనాన్స్, ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో విస్తృతంగా కంటెంట్ రూపొందిస్తున్నారు. ఉదాహరణకు.. ఇన్‌స్టాగ్రామ్‌లో బాగా ఫాలోయింగ్ ఉన్న ఓ వ్యక్తి ఓ కంపెనీ పరుపులను అదే పనిగా ప్రమోట్ చేయడం!. అయితే ఏఐ జమానాలో.. ప్రజలను తప్పుదోవ పట్టించే కంటెంట్ కూడా అదే స్థాయిలో వ్యాప్తి చెందుతోంది. అందుకే చైనా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఇక నుంచి ప్రొఫెషనల్ విషయాలపై మాట్లాడాలంటే ఇన్‌ఫ్లుయెన్సర్లకు అర్హతలు తప్పనిసరి చేసింది. వైద్యం, ఆర్థికం, న్యాయం, విద్య వంటి సున్నితమైన రంగాల్లో కంటెంట్ రూపొందించే ముందు ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ విద్యా అర్హతలు, శిక్షణ పత్రాలు లేకుంటే ప్రొఫెషనల్ అనుభవాన్ని చూపించాల్సి ఉంటుంది. అక్కడి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఈ అర్హతలనూ ధృవీకరించాల్సి ఉంటుంది. అలా చేయకుంటే.. ఇన్‌ఫ్లుయెన్సర్ల సో.మీ. అకౌంట్లను నిలిపివేయడమే కాదు.. శాశ్వత నిషేధం విధించే అవకాశం లేకపోలేదు. అలాగే.. 100,000 యువాన్ జరిమానా విధించబడుతుంది. చైనా సైబర్‌స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ఈ నూతన నిబంధనలు తీసుకొచ్చింది. ఈ రూల్స్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్లు లగ్జరీ లైఫ్‌స్టైల్‌ను ప్రదర్శించడంపై కూడా నిషేధం. ఇన్‌ఫ్లుయెన్సర్ల వ్యక్తిగత అకౌంట్లు మాత్రమే కాదు.. వాళ్లు నిర్వహించే మల్టీ–చానల్ నెట్‌వర్క్ లకు కూడా ఈ కొత్త నిబంధనలు వర్తిస్తాయి. ఈ సంస్థలు తమ టాలెంట్‌ను రాజకీయంగా, ప్రొఫెషనల్‌గా సమర్థవంతంగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. అదే సమయంలో..కంపెనీ బ్రాండ్లు కూడా ఇన్‌ఫ్లుయెన్సర్ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. కంపెనీలు లేదంటే సో.మీ. ప్లాట్‌ఫారమ్‌లు ఏఐ ద్వారా రూపొందించిన కంటెంట్‌ను స్పష్టంగా లేబుల్ చేయాలి. ఈ లేబుల్స్‌ను తొలగించడం లేదంటే తారుమారు చేయడం కఠినమైన నేరంగా పరిగణిస్తారు. లేబులింగ్ ఉల్లంఘనలకు భారీ జరిమానాలు విధిస్తారు.

**భారత్‌లో ఇలా..:** భారత్‌లో చైనా తరహా కఠిన నిబంధనలు అమల్లో లేవు. కానీ.. స్పాన్సర్డ్ కంటెంట్‌కి డిస్క్లోజర్ తప్పనిసరిగా ఉంది. అంటే.. ఏఎస్‌సీఐ ప్రకారం, ట్యాగ్‌లు తప్పనిసరిగా ఉండాలి. అలాగే తప్పుదారి పట్టించే ప్రకటనలు చేస్తే, ఇన్‌ఫ్లుయెన్సర్‌తో పాటు బ్రాండ్ ప్రకారం బాధ్యత వహించాలి. ఈ ఏడాదిలో ఏర్పాటైన ఇండియన్ ఇన్‌ఫ్లుయెన్సర్ గవర్నెన్స్ కౌన్సిల్ నైతిక ప్రమాణాలు, కంటెంట్ నైతికత, వినియోగదారుల హక్కులు వంటి అంశాలపై మార్గదర్శకాలు రూపొందిస్తోంది.



# మాతశిశు ఆసుపత్రిలో మరణ మృదంగం

## మాతృమూర్తుల మరణాలు ఆగేనా?

## నిర్లక్ష్యానికి కారకులెవ్వరు

- బాధ్యత వహించని వైద్య ఆరోగ్యశాఖ
- నెపం బాధితులపై నెట్టి వేస్తున్న వైద్య సిబ్బంది
- సౌకర్యాలు ఫుల్ సేవలు నిల్
- మూడు నెలల్లో అనేక మంది గర్భిణీ మహిళల మృతి
- తూతూ మంత్రంగా విచారణ చర్యలు తీసుకున్న దాఖలాలేవి

*వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిర్లక్ష్యం అశ్రద్ధ కారణంగా అమాయక గ్రామీణ గర్భిణి స్త్రీలు పుట్టబోయే బిడ్డతో సహా ఆసుపత్రిలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో ఆసుపత్రి ఆవరణ అంతా రోదనలతో దద్దరిల్లుతుంది. బాధితులు రోడ్లపై బైఠాంచి ఆందోళన చేయడం తప్ప చేసేది ఏమీ లేదు. బాధితులకు భరోసా ఇవ్వడానికి రాజకీయ నాయకులు ఆందోళన చేయడం తప్ప ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.*

**వికారాబాద్ జిల్లా బ్యూరో/తాండూర్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** పురిటి నొప్పులు మరిచి పుట్టబోయే బిడ్డ కోసం పగటి కలలు కంటూ ప్రసవం కోసం వస్తే ప్రాణం మీదికొస్తుంది. తల్లి పిల్లల కేరింతలు వినిపించే చోట.. అర్తనాదాలు వినిపిస్తున్నాయి. అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ ఆ ప్రాంతమంతా అరుపులు కేకలు రోదనలతో ఆస్పత్రి ఆవరణ అంతా పెక్కు టిల్లుతుంది. ధర్నాలతో తరచు దగ్గరిల్లుతుంది. ఎంతోమంది మాతృ మూర్తులకు కడుపుకోత మిగులుతోంది. మాతా శిశు ఆసుపత్రిలో మరణ మృదంగం శరమాములైంది.

వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా తాండూర్ మాతా శిశు ఆసుపత్రిలో కోట్ పల్లి మండలం ఎన్నారం గ్రామానికి చెందిన గర్భిణీ మహిళ రజిత (28) మృతి చెందింది. మూడు రోజుల క్రితం పురుడు పోసుకోవడానికి తాండూర్ మాతా శిశు ఆసుపత్రిలో చేరింది. ఆమెకు డాక్టర్లు అన్నీ వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంగా ఉన్నట్లు ధృవీకరించారు. ఆదివారం నాడు ఒక పాపకు జన్మనిచ్చింది. కొన్ని గంటల తర్వాత బాలింత ముక్కులో నుంచి రక్తస్రావం అధికమైంది. ఈ విషయమై ఆమె బంధువులు వైద్యులకు సిబ్బందికి తెలియజేశారు.

ఆసుపత్రిలో ఎవరైనా గర్భిణీ స్త్రీలు మరణిస్తే వైద్య ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశిస్తుంది. కానీ విచారణ అనంతరం వైద్య సిబ్బందిని బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నేపమంతా బాధ్యతలపై నెట్టివేసి బాధ్యులైన వైద్య సిబ్బంది విచారణలో తమకు అనుకూలంగా నివేదికలు రాసుకొని చేతులు దులుపుకుంటున్నారు. ఇదిశర మామూలు అయింది. 108లో ప్రాథమిక సదుపాయాలు ఉన్న గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసుపత్రికి తరలించే లోపు గర్భిణీ స్త్రీలకు పురిటి నొప్పులు అధికమైతే 108 లోనే పురుడు పోసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. కానీ అన్ని సౌకర్యాలు ఉన్నా మాతా శిశు ఆస్పత్రిలో మరణాలు రోజురోజుకు పెరిగిపోవడం పట్ల పల్లె ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో పురుడు పోసుకోవడానికి భయపడుతున్నారు. అప్పుచేసి ప్రైవేట్ ఆసుపత్రిలో పురుడు పోసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. జిల్లాలోని తాండూర్ మాతా శిశు ఆస్పత్రి అతి పెద్దది. తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా కర్ణాటక రాష్ట్రం సరిహద్దు గ్రామాల నుంచి సైతం ఈ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలు పురుడు పోసుకోవడానికి వస్తున్నారు. కేవలం వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అమాయక గర్భిణీ స్త్రీలు ప్రాణాలు కోల్పోవలసిన వస్తుందని విమర్శ వినిపిస్తుంది.

ఆసుపత్రిలో తరచు గర్భిణి మృత్యువాత పడుతున్న విషయమై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నత స్థాయి దర్యాప్తు చేస్తే ఆసుపత్రిలో ఉన్న లోపాలు సిబ్బంది నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఎంతోమంది పేద మహిళలకు మాతృత్వం కల్పించే ఆసుపత్రిలో సకల సౌకర్యాలు కల్పనకు వైద్య సిబ్బంది తీరు మారడానికి ఉన్నత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం..



" భయపడవలసిన అవసరం లేదని ఆమె ఆరోగ్యంగా ఉంచినట్లు వారు వివరించారు. కానీ బాలింత రజిత ఆరోగ్యం క్షీణించింది. ఈ విషయం వైద్యులకు వివరిస్తే చివరి నిమిషంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించాలని ఉచిత సలహా ఇచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి తర్వాత పరిస్థితి విషమించి ఆసుపత్రిలోనే మృతి చెందింది. దీంతో వైద్యాధికారులు సకాలంలో చికిత్స అందించలేదని నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిన కారణంగానే రజిత మృతి చెందిందని వారి బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. దీంతో ఆస్పత్రి ఆవరణలో కేకలు అరుపులు రోదనలతో దద్దరిల్లింది. తాండూర్ మాత శిశు ఆసుపత్రిలో మాతృమూర్తుల మరణాలు సర్వ సాధారణమైపోయాయి. ఇటీవల మాతృమూర్తుల మరణాలు విశ్లేషిస్తే నెలలో ఒకరిద్దరు మాతృమూర్తులు మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవం వచ్చి తల్లి బిడ్డలు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. పేద గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు వాసుపత్రిలో సకల సౌకర్యాలు కల్పించింది. కానీ వైద్యులు వైద్య సిబ్బంది మధ్య సమన్వయ లోపం అశ్రద్ధ నిర్లక్ష్యం కారణంగా మాతా శిశు ఆసుపత్రిలో మరణ మృదంగం వినిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి 108లో గర్భిణీ స్త్రీలకు ప్రాథమిక చికిత్స అనంతరం మాత శిశు ఆసుపత్రిలో సిబ్బంది చేర్పిస్తున్నారు. కానీ ఆసుపత్రిలో చేరిన తర్వాతే గర్భిణీ స్త్రీలకు పురిటి నొప్పుల కంటే భయంకరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

### భార్య కాపురానికి రావడం లేదని
# ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 (జనం సాక్షి)** భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఏఆర్ కానిస్టేబుల్ జీవన్ రెడ్డి(37) ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కామారెడ్డి పట్టణం అడ్లూర్ శివారులోని రాధాస్వామి సత్సంగ్ బ్యాగ్ వెనకాల సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన రేకులపల్లి జీవన్ రెడ్డి ఏఆర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. జీవన్ రెడ్డికి ముస్తాబాద్ మండలం మొరాయిపల్లి గ్రామానికి చెందిన చందనతో వివాహం జరిగింది. వీరికి మోక్ష, కృతిక అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గత రెండు మూడేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఏడాదిన్నర నుంచి చందన తన పుట్టింటికి వెళ్ళిపోయింది. అప్పటి నుంచి ఎన్నిసార్లు అడిగినా కాపురానికి రాలేదు. ఇటీవల విడాకుల నోటీసులు రావడంతో జీవన్ రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఉదయం 7:30 ప్రాంతంలో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బైకుపై ఇంట్లో నుంచి బయలుదేరాడు. ఇంట్లో నుంచి వెళ్లిన జీవన్ రెడ్డి కామారెడ్డి పట్టణం అడ్లూర్ శివారులో గల రాధాస్వామి సత్సంగ్ బ్యాస్ ఆశ్రమం వెనకాల మంటల్లో కాలిపోయిన మృతదేహం ఉండడంతో అది చూసిన పశువుల కాపరి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, రూరల్ సీఐ రామన్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కొద్దిసేపటి తర్వాత జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఘటన స్థలానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కబ్జాలు చూస్తూ ఊరుకుండట్లే..!

- హైడ్రాకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు
- హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు



**హైదరాబాద్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** కబ్జాలు జరుగుతుంటే నగర ప్రజలు చూస్తూ ఊరుకోవడం లేదు. నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నారు. రహదారి బంద్ అయితే ఫొటోలు తీసి మరీ చూపిస్తున్నారు. చెరువుల్లో ఆక్రమణలు జరుగుతుంటే వీడియోలు పెడుతున్నారు. ఎవరెవరికి ఫిర్యాదు చేశారో కూడా చెప్పి సాక్ష్యాలను చూపిస్తున్నారు. దశాబ్దాల నాటి సమస్యలకు గంటల్లో, రోజుల్లో పరిష్కారం చూపుతు న్నారంటూ హైడ్రాకు కితాబిస్తున్నారు. ఆ నమ్మకంతో వస్తున్నామంటూ పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులందాయి. చాలామంది బాహాటంగా ఫిర్యాదు చేస్తుంటే.. మరి కొంతమంది తమ వివరాలు బయటపెట్టవద్దని విచారణాధికారులకు సూచిస్తున్నారు. బాలానగర్ మండలం కూకట్‌పల్లి లోని హస్మత్‌పేట విలేజ్‌లో ప్రభుత్వానికి చెందాల్సిన 10 ఎకరాలు కబ్జా చేసేస్తున్నారంటూ హైడ్రాకు ఫిర్యాదు అందింది. తూములు మూసేసి.. అలుగులు ఎత్తు పెంచడంతో చెరువు పై భాగంలో ఉన్న భూములు, లే ఔట్‌లు నీట మునగుతున్నాయని కొంతమంది, చెరువుల్లో మట్టి పోసి ఎకరాలకొద్దీ కబ్జా చేస్తున్నారంటూ మరికొంతమంది ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేరుగా పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పజెప్పారు.

## సింగరేణి సీఎండీని కలిసిన గుర్తింపు సంఘం నాయకులు

- కార్మికుల సమస్యలపై సానుకూల స్పందన
- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్‌లకు ఉద్యోగ ఆర్డర్లు త్వరలో ఇస్తామని సి అండ్ ఎండి బలరాంనాయక్ ఒప్పుకోవడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ లో సిఅండ్‌ఎండికి వివిధ సమస్యలపై వినతిపత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని సి అండ్ ఎండి తెలిపారని ఆయన పేర్కొన్నారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలోని వి.కె.కోల్ మైన్‌ను పర్మినెంట్ కార్మికులతో నడపాలని సి అండ్ ఎండికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎల్లందు ఏరియా లోని జేకేఓసిని ఎక్స్‌టెన్షన్ చేస్తామని, గోలేటి ఓసిని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని సి అండ్ ఎండి హామీ ఇచ్చారని ఆయన అన్నారు. అదేవిధంగా సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో 800 మెగావాట్లతో నూతన విద్యుత్ ప్లాంట్‌ను త్వరలోనే శంకుస్థాపన చేయడానికి చర్యలు తీసుకుంటామని సిఅండ్‌ఎండి హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. సి అండ్ ఎండిని కలిసిన వారిలో ఏఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, కే.సారయ్య, మడ్డి ఎల్లాగౌడ్, నాయకులు రంగు శ్రీను తదితరులు ఉన్నారు.

# ప్రజా ప్రభుత్వంపై విమర్శలు, విడ్డూరం

- బిఆర్ఎస్ హయాంలో దంచుకొని పంచుకోలేదా?
- టీపీసీసీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ కాశిపాక



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** భారత్ రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఉన్న వనరులను, అవకాశాలను ఆ పార్టీ నాయకులే దంచుకొని పంచుకున్నారని, నేడు ప్రజా ప్రభుత్వం పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ కాశిపాక తీవ్రంగా విమర్శించారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో అవినీతి, అక్రమాలతో రాష్ట్ర సంపదను కొందరు వ్యక్తులు, కుటుంబ సభ్యులకు మాత్రమే పరిమితం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల కోసం కాకుండా, కేవలం తమ స్వలాభం కోసం పనిచేసిన బిఆర్ఎస్ పార్టీ నేతలు, ఇప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు గుప్పించడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, పారదర్శక పాలన అందిస్తోందని, రాష్ట్రంలోని ప్రతీ పౌరుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ ఎస్ నాయకులు ప్రజా ప్రభుత్వం పై నిరాధారమైన విమర్శలు చేయడం మానుకొని, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని రాజేష్ కాశిపాక హితవు పలికారు. రాష్ట్రంలోని ప్రజలు బిఆర్ఎస్ నాయకుల ద్వంద్వ వైఖరిని గమనిస్తున్నారని, ప్రజా ప్రభుత్వానికి ఉన్న మద్దతును ఓర్వలేక పోతున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపే పార్టీ లక్ష్యం అని రాజేష్ కాశిపాక తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు తేజాస్ విద్యార్థులు ఎంపిక

### తేజాస్ జూనియర్ కళాశాల చైర్మన్ సిహెచ్.సతీశ్ రావు



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి రైఫల్ షూటింగ్ అండర్ 19 పోటీలలో తేజాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనారు. ఈ సందర్భంగా తేజాస్ జూనియర్ కళాశాల చైర్మన్ సిహెచ్. సతీశ్ రావు మాట్లాడుతూ... మా కళాశాలలో చదువుచున్న విద్యార్థులలో ప్రథమ సంవత్సరం విద్యార్థి జి.సంజయ్ మొదటి స్థానం, బి.సాయితేజ రెండొవ స్థానం, సాధించారని తెలిపారు. అలాగే పిస్తోల్ అండర్19 విభాగంలో బి.సాకేత్ బంగారు పతకం, సాయి చరణ్ వెండి పతకం, జె.నిఖిల్ నాలుగవ స్థానం, రోహిత్ ఐదవ స్థానం కైవసం చేసుకున్నారని అలాగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. దీనికి గాను కళాశాల చైర్మన్ సిహెచ్. సతీష్ రావు విద్యార్తులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

**గంభీరావుపేట అక్టోబర్ 27( జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గంభీరావుపేట మండల వైద్యాధికారి డాక్టర్ అభినయ్ ఆధ్వర్యంలో టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగి ంది. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ గంభీ రావుపేట క్లస్టర్ 60 మంది టీబీ వ్యాధి బాధితులకు ఫుడ్ బాస్కెట్ పంపిణీ చేశారు . టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టిబి వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకొనట కొరకు సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డా .రజిత పిలుపు మేరకు , పీపుల్స్ హాస్పిటల్ ముస్తాబాద్, డా . శంకర్ 60 మంది క్షయ వ్యాధి గ్రస్తులను న్యూట్రీషన్ ఫుడ్ కొరకు 6 నెలలు పాటు దత్తత తీసుకు న్నారు. ఇందులో ప్రతి నెల 600/- విలువ గల బియ్యం, పప్పు, నూనె, పల్లి, గ్రుడ్లు, ప్రోటీన్ పౌడర్ లాంటివి ఇవ్వనున్నట్లు డా. అభినయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అభినయ్, రమేష్, టీబి యూనిట్ సూపర్వైజర్ మహిపాల్ టీబి నోడల్ సీతమహాలక్ష్మి ఏఎన్ఎంలు ఆయాలు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి : ఎస్ఐ

**రుద్రంగి అక్టోబర్ 27 (జనం సాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ ఆధ్వర్యంలో రుద్రంగి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి ఇందిరా చౌక్ వరకు విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివాని, వారి త్యాగం సమాజం ఎప్పటికి మారువడాని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ రవి, రజినీకాంత్, సంతు, రామకృష్ణ, మధు, మారుతి, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ
## పనులను పరిశీలించిన జిల్లా ఇంఛార్జి కలెక్టర్



**వేములవాడ, అక్టోబర్ 27(జనంసాక్షి):** వీటీఏడీఏ ఆధర్యంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి, విస్తరణ పనులను జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్ క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించారు. ఆలయ విస్తరణలో భాగంగా ప్రణాళిక ప్రకారం ఇప్పటివరకు చేపట్టిన కూల్చివేత పనులను ఆలయ, ఆర్ అండ్ బి అధికారులు ఇంచార్జి కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు. ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రచార రథం, ఆలయం ముందు రహదారి విస్తరణ, తదితర అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను ఇంచార్జి కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రగతిలో ఉన్న పనుల వివరాలను, కల్పించబోయే సౌకర్యాల గురించి సంబంధిత అధికారులు ఇంచార్జి కలెక్టర్ కు వివరించారు. గుడి చెరువు బండ్ సందర్శనవీటీఏడీఏ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న వేములవాడ గుడి చెరువు బండ్ ను జిల్లా ఇంఛార్జి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. బండ్ నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభించారు అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సందర్శనలోసందర్శనలో ఈఓ రమాదేవి, ఆర్డీఓ రాధాబాయి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, ఆర్ అండ్ బి ఈఈ నరసింహా చారి, వీటీఏడీఏ సీపీఓ అన్సారీ, నీటి పారుదల శాఖ ఈఈ కిషోర్, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, తహశీల్దార్ విజయ ప్రకాష్ రావు,ఆర్ ఐ శ్రీనివాస్, పర్యాటక సంస్థ ఎస్ఈ సరిత, వీటీఏడీఏ సీపీఓ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను రారాజుగా చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం


### ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి



**రుద్రంగి అక్టోబర్ 27(జనం సాక్షి) :** రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యం,ఎక్కువ ధర ఇస్తామని నమ్మబలికే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రుద్ర0గి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి అన్నారు. వీరుని తండా లో ఫ్యాక్స్ చైర్మన్ ఏలేటి చిన్న రెడ్డి తో కలిసి రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, ఫ్యాక్స్ చైర్మన్ ఏలేటి చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కౌలు రైతులకు భరోసా వంటి పథకాలు దేశంలో మరెక్కడా లేవని , రైతులకు ఇబ్బంది కలగకుండా నేటి నుండే కొనుగోలు కేంద్రాల్ని ప్రారంభించామని, రైతులు వరి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు కల్లాల వద్దనే ధాన్యాన్ని ఎండబెట్టుకొని తేమ శాతం 17 దాటకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలులో తూనికల తారుమారు, రేట్ల విషయంలో అవకతవకలు జరుగుతే వెంటనే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకువస్తే స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానాల మోహన్ రెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాలు, ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, మానాల ఫాక్స్ చైర్మన్ ఏలేటి చిన్నా రెడ్డి, ఐకెపి సెంటర్ ఇంచార్జ్ జ్యోతి సిసి అశోక్, రైతులు,పాల్గొన్నారు.

# ధాన్యం కొనని రైస్‌మిల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- అధికారులతో కుమ్మక్కై ధాన్యం కొనగోలుకు నిరాకరణ
- రైతులపై పోలీసులు లాఠీచార్జ్‌కి యత్నం..
- లైసెన్సుల రద్దు, పోలీసుల సస్పెన్షన్‌కు డిమాండ్
- జిల్లా కలెక్టర్ స్పందించాలి.. లేకపోతే ముట్టడిస్తామని సిపిఎం హెచ్చరిక



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 (జనం సాక్షి) :** అధికారులతో కుమ్మక్కై ధాన్యం కొనని నసురుల్లాబాద్ రైస్ మిల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, జిల్లా అధికారులు రైస్ మిల్లుల లైసెన్స్ ను రద్దు చేయాలని,రైతులపై లాఠీచార్జికి ప్రయత్నించిన పోలీసులను సస్పెండ్ చేయాలని,సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సిపిఎం పార్టీ కామారెడ్డి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో రైస్ మిల్ యాజమాన్యాలు మండలం నుండి జిల్లా స్థాయి వరకు అధికారులతోని కుమ్మక్కై రేయింబవళ్లు రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఏసీ రూముల్లో కూర్చుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఒకపక్క జిల్లాలో అకాల వర్షానికి పంటలకు నష్టం జరిగి ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి నష్టపరిహారం అందకపోగా రైస్ మిల్ యాజమాన్యాలు అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని దానికి అధ్యక్షుడుగా ఉన్న రాజేంద్రప్రసాద్ జిల్లా అధికారులను మా దగ్గర ముడుపులు తీసుకుని మాకు సహకారం చేయాలని ఒత్తిడి చేయడంతో అధికారులు రైస్ మిల్ యాజమాన్యాలకు అనుకూలంగా పనిచేస్తున్నారని ప్రధానంగా విమర్శించారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన చేస్తే అక్కడ ఉన్న రైస్ మిల్ యాజమాన్యాలు మేం కొనం మీకు దిక్కున చోట చెప్పుకోమని బ్లాక్ మెయిల్ చేయడంతో దిక్కుతోచని రైతులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించడం జరిగిందని అక్కడికి చేరుకున్న పోలీసులు సమస్యను పరిష్కరించకుండా అధికారులను పిలిపించకుండా వారిపై లాఠీచార్జికి ప్రయత్నించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ స్పందించి పరిష్కరించాలని లేకపోతే రైతులతో కలిసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల ఇండ్లతో పాటు ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొత్త నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు ముదాం అరుణ్ కుమార్, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగం






- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
- ఆటోలో ప్రయాణిస్తూ సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్సీ
- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల బ్రతుకులు ఆగమయ్యాయని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల సమస్యలు తెలుసుకొని వారి సమస్యలను ప్రభుత్వానికి తెలిసేలా చేయాలననే ఉద్దేశంతో జూబ్లీహిల్స్ లోని సోమాజిగూడ డివిజన్ లో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి,ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆటోలో ప్రయాణం చేసి ఆటో డ్రైవర్ల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ఆటో డ్రైవర్ల బతుకు ఆగమైందని నెల వారిగా ఆటోల ఫైనాన్స్ కూడా కట్టలేని పరిస్థితుల్లో ఆటో డ్రైవర్లు ఉన్నారని, ఇప్పటివరకు 161 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్య చేసుకున్నారని దీని కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని చనిపోయిన కుటుంబాలకు ఇకనైనా సాయం చేయాలని ప్రతి ఆటో డ్రైవర్ కి ఏడాదికి 12,000 ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని మరిచారని ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్ల అందరికీ కాంగ్రెస్ పార్టీ ఇస్తానన్న హామీలను అమలు చేసి తీరాలని లేదంటే పెద్దఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలియజేశారు.

# అధికారుల దాడులు ఉత్తుత్తే



## పొద్దున్న దాడులు.. రాత్రి యథేచ్ఛగా రవాణా

- కప్పెట ఇసుకాసురులు.. అసలెవ్వరి మాటా వినరుగా..?
- కోట్ల రూపాయల ప్రజా ధనానికి గండి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి) :**
మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల పరిధిలోని కప్పెట వాగు నుండి ఇసుకాసురులు అడ్డు అదుపు లేకుండా తోడేస్తున్నారు. వాగులో పగలు, రాత్రి వేళల్లో యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు. కప్పెట, పాత మ్నెల్లర ప్రాంతాల నుండి ఎలాంటి అనుమతుల్లేకున్నా ఇసుక దందాను మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారని గ్రామాల ప్రజలు ఆగ్రహిస్తున్నారు. తమను అడ్డుకునేవారే లేరనే అహంభావంతో ఇసుక మాఫియాకు చెందిన కొందరు వాగును మొత్తం పీల్చి పిప్పి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద గుట్టలుగుట్టలుగా ఇసుక నిల్వలు దీనికి అద్దం పడుతుండగా.. పంట భూములన్నీ పాడవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




భూత్పూర్ మండలం కప్పెట, పాత మ్నెల్లర గ్రామ సమీపంలో గల వాగులో జేసిబిల ద్వారా ఇసుక వ్యాపారం సాగుతోంది. దాదాపు 50 ట్రాక్టర్ల ద్వారా వాగు నుండి ఇసుకను పైకి తోడి, పదుల సంఖ్యల్లో టిప్పర్, లారీల ద్వారా మహబూబ్‌నగర్, జడ్చర్ల ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెద్దఎత్తున ఈ తంతు జరుగుతున్నా.. మహబూబ్‌నగర్ జిల్లా అధికార యంత్రాంగమంతా కళ్లు మూసుకుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత మూడు రోజుల నుండి రాత్రీ పగలనే తేడా లేకుండా టిప్పర్, లారీల ద్వారా ఇసుక తరలిస్తూ ప్రజాధనానికి గండికొడుతున్నా.. వారిని ఆపే ధైర్యం ఎవరికీ లేకపోవడం అనుమానాలకు దారితీస్తోంది.

### దర్జాగా వ్యాపారం.. ఎలా సాధ్యం?

కప్పెట వాగులో ఇసుకను తరలించేందుకు అనుమతుల్లేక పోయినా దర్జాగా రవాణా చేపట్టడం గమనార్హం. రెవెన్యూ, పోలీసు అధకారుల అండదండలతోనే ఇసుక వ్యాపారులు పెట్రేగుతున్నట్టు స్థానికులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వాగులోంచి ఇసుక తరలించి డంపులు ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం రాత్రి సమయం లో పెద్ద పెద్ద టిప్పర్ల సహాయంతో ఇతర ప్రాంతాలకు ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్నారు. ఈ అక్రమ దందాను అడ్డుకోవాలనే ఉద్దేశంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్టు ఉన్నారంటే ఇంకా ఎవరెవరి పెద్దతలకాయలున్నాయోననే చర్చ మొదలైంది.

### ప్రభుత్వ బాలుర పాఠశాల, కళాశాల పనులకు

# రూ. కోటి 30 లక్షలు నిధుల ఇవ్వండి

- క్రైస్తవుల స్మశాన వాటికకు ఐదెకరాల స్థలం కేటాయించండి
- కలెక్టర్ ప్రావీణ్య ను కోరిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి



**సంగారెడ్డి టౌన్ అక్టోబర్ 27 (జనం సాక్షి) :**
సంగారెడ్డి పట్టణం లోని ప్రభుత్వ బాలుర పాఠశాల , జూనియర్ కళాశాల లో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రూ.1 కోటి 30 లక్షల నిధులు ఇవ్వాల్సింది గా టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను కోరారు. సోమవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. మూడు రోజుల క్రితం టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కల్సి ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్, జూనియర్ కళాశాల పై సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. బాయ్స్ హై స్కూల్, జూనియర్ కళాశాల ను వేరు చేస్తూ ప్రహారీ నిర్మాణం, పెయింటింగ్ , గ్రావెల్ వేయించడం లాంటి పనుల కోసం రూ.1 కోటి 30 లక్షల రూపాయల నిధులు అవసరం అవుతాయని అధికారులు జగ్గారెడ్డి, నిర్మలా దృష్టికి తీసుకు వచ్చారు. . నిధుల కేటాయింపు కు కలెక్టర్ సానుకూలంగా స్పందించడంతో పాటు అతి త్వరలో అవసరమైన నిధులు మంజూరు చేస్తానని తెలిపారని నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. కలెక్టర్ ను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జూలకంటి ఆంజనేయులు, కూన సంతోష్, రామ్ రెడ్డి, కిరణ్ గౌడ్, మహేష్ తదితురులు పాల్గొన్నారు

**క్రైస్తవుల స్మశాన వాటిక కోసం ఐదెకరాల స్థలం కేటాయించండి**

సంగారెడ్డి నియోజకవర్గంలో నీ క్రైస్తవులు స్మశాన వాటిక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి కోసం సంగారెడ్డి పరిసరాల్లో ఐదెకరాల స్థలం కేటాయించాలని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ను కోరారు. సోమవారం సంగారెడ్డి నియోజక వర్గం లో నీ పలువురు పాస్టర్లు, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ జార్జ్ తో కల్సి ఈ మేరకు కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. స్మశాన వాటిక కు త్వరలో స్థలం కేటాయింపు విషయంలో కలెక్టర్ సానుకూలంగా స్పందిం చినట్లు వారు వివరించారు.




## ఆర్ఎంపీ, పిఎంపిలు అర్హతకు మించి వైద్యాన్ని చేయకూడదు

- నిబంధనల ప్రకారం ల్యాబ్ డయాగ్నసిస్ సెంటర్లు నిర్వహించాలి
- ములుగు జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాలరావు

**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 27(జనంసాక్షి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు ములుగు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా వాణిలో వచ్చిన ఆరోపణలకు, కలెక్టర్ ఆదేశాను సారం పస్రాలోని కేర్ మరియు వినాయక డయాగ్నోసిస్ సెంటర్లను తనిఖీ చేసి రిజిస్ట్రేషన్ పత్రాలను రికార్డులను రిపోర్టును పరిశీలించారు. అనంతరం ల్యాబ్ యజమాన్యంతో మాట్లాడుతూ, అవసరము లేని పరీక్షలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని, ఆర్థికంగా వారిని నష్టపరచకూడదని, పరీక్షల ధరల పట్టికను ల్యాబ్ ముందే డిస్ప్లే చేయాలని ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారము నిబంధనలకు అనుగుణంగా ల్యాబ్ డయాగ్నసిస్ సెంటర్లు నిర్వహించాలని లేనియెడల సీజ్ చేస్తామని హెచ్చరించారు. అటు తరువాత సిరి క్లినిక్ ను పరిశీలించి రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. పసర గ్రామంలోని ఆర్ఎంపీ, పీఎంపి లతో మాట్లాడుతూ, అర్హతకు మించి వైద్యాన్ని చేయకూడదని, వైద్యం కొరకు వచ్చిన ప్రజలకు యాంటీబయోటిక్స్ మరియు సెలైన్స్ లాంటి చికిత్సలు చేయకూడదని వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కీటక జనక మరియు క్షయ వ్యాధి నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వండి
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 27(జనంసాక్షి) :** రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వానాకాలం పంట కోతలు ప్రారంభమై ధాన్యం కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో రైస్ మిల్లర్ల దగ్గరనుంచి బ్యాంకు గ్యారంటీలను సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకు గ్యారంటీలు లేకుండా ధాన్యం అలాట్మెంట్ చేయవద్దని అన్నారు. జిల్లాలో నవంబర్ 1 నాటికి పంట కొనుగోలు కేంద్రాలను వంద శాతం ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు
క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, వైద్యారోగ్య, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, రోడ్లు-భవనాల శాఖలు, విపత్తు నిర్వహణ సంస్థలు రాబోయే రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ, క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రజలు కూడా ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటూ, తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తిస్తూ, అవసరమైన సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అక్కడికి తరలించి ఆహారం, ఇతర సదుపాయాలు సమకూర్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వర్షాలతో వరద జలాలు ఏర్పడి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని పీ.హెచ్.సీలు, ఆసుపత్రులలో సరిపడా మందుల స్టాక్ ను అందుబాటులో పెట్టుకుని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఆదేశించారు. వర్ష సూచన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా అప్రమత్తమై ఉన్నదని, ఎలాంటి పరిస్థితులు తలెత్తిన సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని, ప్రజలు ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ తెలిపారు.

# ఆర్మూర్ బీజేపీలో బారీగా చేరికలు

### స్వాగతించిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి.



**ఆర్మూర్,అక్టోబర్ 27 (జనంసాక్షి):** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి 8వ వార్డులో బిజెపిలో భారీ చేరికలు జరిగాయి. ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పార్టీ కండువా కప్పి సాదర స్వాగతం పలికారు.బిజెపి నాయకుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ యువజన నాయకుడు చంద్రకంటి అరుణ్ దీప్ సుమారు 150 మంది అనుచరులతో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన అరుణ్ మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలు, మోదీ నాయకత్వాన్ని సమర్థిస్తూ పార్టీలో చేరడం జరిగిందన్నారు.ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీ అరవింద్ సమక్షంలో జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.స్థానిక ఎన్నికల్లో, మున్సిపాలిటీ కౌన్సిలర్ స్థానాలను బిజెపి జెండా ఎగురుతుందన్నారు.రానున్న రోజుల్లో ఇతర పార్టీలో నుంచి బిజెపిలో చేరికలు ఉంటాయని చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని బిజెపి కార్యకర్తలు అందరితో భారీ ఎత్తున సభ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి,జెస్సు అనిల్,కలిగోట్ గంగాధర్, జిల్లా ప్రతినిధులు, మండల నాయకులు,మధు, శ్రీనివాస్,రాజు తదితరులు పాల్గొన్నారు.


## కరీంనగర్‌లో సీసీఎస్ పోలీసుస్టేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 27 (జనంసాక్షి) :**
కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం సోమవారం రోజు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసుస్టేషన్ కార్యాలయం నూతన భవనాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇంతకుముందు కరీంనగర్ టూ టౌన్ పోలీసుస్టేషన్ భవనం పైన పనిచేసిన సీసీఎస్ పోలీసుస్టేషన్‌ను, కరీంనగర్ రూరల్ ఏసీపీ కార్యాలయ కాంపౌండ్‌లో నిర్మించిన నూతన భవనంలోకి తరలించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం పూజా కార్యక్రమాలు నిర్వహించి, నూతన కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, నూతన భవనం ద్వారా సీసీఎస్ పోలీసు స్టేషన్ సిబ్బందికి మెరుగైన వాతావరణం లభిస్తుందని, వారు మరింత సమర్థవంతంగా సేవలు అందించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సీసీఎస్ పోలీసుస్టేషన్ సేవలు పోలీస్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయని, ముఖ్యంగా నేరస్థులను పట్టుకోవడంలో వారి సహకారం ఎంతో ముఖ్యమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. నూతన భవనంలోకి సీసీఎస్ కార్యాలయం సేవలను సీపీ అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి, వేణుగోపాల్ లతో పాటు సీసీఎస్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా

- గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలి
- హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్



**జమ్మికుంట, అక్టోబర్ 27 (జనంసాక్షి):** గ్రామాల్లో సమస్యలపై ఎక్కడా రాజీపడవద్దని సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.సోమవారం రోజున పల్లె పల్లెకు ప్రణవ్ కార్యక్రమం ద్వారా ఇల్లందకుంట మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు.పర్యటనలో భాగంగా మండల వ్యాప్తంగా 6,28,000/- విలువ చేసే 19 సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామాల్లోని లబ్ధిదారులకు అందజేశారు.చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు త్వరితగతిన బ్యాంక్‌లో డిపాజిట్ చేసుకోవాలి కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తుందని,ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని,పదేళ్లనుండి ఎదురుచూసిన ఇందిరమ్మ ఇళ్లు,ఉచిత సన్న బియ్యం,రుణమాఫీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్,ఆరోగ్య శ్రీ పథకం పెంపులాంటి పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ వచ్చాయని,అలాగే నూతన రేషన్ కార్డులు,నంబర్ ఆడిషన్స్,మహిళలకు ఉచిత బస్ రవాణా సౌకర్యం లాంటివి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని,ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకం అందిందని ఇది జనాల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ఆయన కోరారు.కోవర్ట్ గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా కష్టపడి పనిచేస్తే ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఏ విధంగా జిల్లాలో మొదటి స్థానంలో వచ్చామో రాబోయే స్థానిక పోరులో హుజురాబాద్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల కృషితో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామాల కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఆలయంలో సాంప్రదాయ నృత్యాలు ఉండాలి

### మంత్రి కొండా సురేఖ ఆదేశాలు

### అందుకు సంబంధించిన ఆదేశాలు విడుదల చేసిన ఎండోమెంటు అధికారులు



**హైదరాబాద్, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** కార్తీక మాసంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి దేవాలయంలో దీపోత్సవం ఘనంగా నిర్వహించి, ఆలయాలకు ఆధ్యాత్మిక శోభను తీసుకురావాలని ప్రజా ప్రభుత్వం సంకల్పించింది. ఇటీవల అందుకు సంబంధించిన విషయంలో తెలంగాణ దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వగా.. ఎండోమెంటు కమిషనర్ హరీష్ ఉత్తర్వులు విడుదల చేశారు. దేవాదాయ శాఖ తరఫున ఒక్కోరోజు ఒక్కో ప్రధాన ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ధారించినట్టు ఎండోమెంటు కమిషనర్ హరీష్ స్పష్టం చేశారు. అక్టోబర్ 27న కీసర దేవాలయంలో, నవంబర్ 1న యాదగిరిగుట్ట ఆలయంలో, నవంబర్ 10న జోగులాంబ ఆలయం, నవంబర్ 17న వేములవాడ రాజరాజేశ్వర ఆలయంలో సాంప్రదాయ నాట్యంలో నిష్ణాతులైన వారితో ఈ నాట్య సంబంధిత కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అయితే, ఈ వేడుకలు నిర్వహించే సందర్భంలో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నట్టు వివరించారు.

## విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాల కల్పన

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 27, (జనంసాక్షి) :** ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాలజిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులకు అండగా

# చంద్రన్న ఫౌండేషన్

- చంద్రన్న ఫౌండేషన్ ఆద్వర్యంలో లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 20 సిమెంట్ బస్తాల పంపిణీ... హాజరైన ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 27 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఖానాపూర్ గ్రామానికి చెందిన డొంకనీ గోపి గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తన తండ్రి డొంకని చంద్రయ్య గౌడ్ అనారోగ్యంతో మృతి చెందడంతో తండ్రి కొరిక ఆలోచన మేరకు కుమారులు డొంకని చంద్రన్న సేవా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసారు. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ఖానాపూర్ గ్రామం లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చంద్రన్న ఫౌండేషన్ ఆద్వర్యం ఒక్కొకరికి 20 సిమెంట్ బస్తాలను అందజేశారు. సిమెంట్ బస్తాలను పంపిణీ చేస్తున్నందుకు, గ్రామానికి సేవ చేస్తున్నందుకు చంద్రన్న వారసులుగా గోపి గౌడ్, శ్రీనివాస్ గౌడ్‌లను ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, గ్రామస్తులు, పలువురు నాయకులు అభినందించారు. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగ పరచుకోవాలని నియోజక వర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నామని ప్రస్తుతం లబ్ధిపొందిన వారు పూర్తి చేసిన అనంతరం మరో 40 ఇళ్లను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారు ఎవరైనా వారందరికీ సిమెంట్ బస్తాలను ఉచితంగా అందజేస్తామని ఫౌండేషన్ ఛైర్మెన్ గోపి గోపి గౌడ్, వైస్ ఛైర్మెన్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గ్రామంలో త్రాగు నీళ్ళకోసం త్వరలో ఉచితంగా ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ను కూడా ఏర్పాటు చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి చంద్రన్న ఫౌండేషన్ ఎంతో సహాయ పడుతుందని అన్నారు.

# సురక్షిత ప్రయాణానికి టీజీఎస్ ఆర్టీసీ పెద్దపీట

- ఏసీ, నాన్-ఏసీ బస్సులను తనిఖీ చేసిన వీసీ అండ్ ఎండీ
- ప్రయాణ సమయంలో జాగ్రత్తలపై డ్రైవర్లకు పలు సూచనలు



హైదరాబాద్ (జనంసాక్షి) : కర్నూలు సమీపంలో ఇటీవల ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదం జరిగిన నేపథ్యంలో టిజిఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు అందిస్తున్న సురక్షిత రవాణా సేవలను మరోమారు సంస్థ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి పరిశీలించారు. సోమవారం మియాపూర్-1 డిపోను ఆయన సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. మియాపూర్ -1 డిపోలోని లహరి స్లీపర్,లహరి ఏసి స్లీపర్ కం సీటర్,రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులను తనిఖీ చేసి అందులో అమర్చబడిన ఫైర్ సేఫ్టీ కి సంబంధించిన ఫైర్ డిటెక్షన్ అలారం, ఫైర్ సప్రెషన్ సిస్టంల పనితీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అనుసరించాల్సిన స్టాండర్డ్ ప్రోటకాల్ పద్ధతులను సిబ్బంది, అధికారులతో సమీక్షించారు. ప్రయాణ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. బస్సులన్నింటిలో ఎమర్జెన్సీ డోర్లు, అద్దాలను పగలగొట్టేందుకు అవసరమైన సంఖ్యలో బ్రేకర్లు, అగ్నిమాపక పరికరాలు తదితర ఏర్పాట్లు అన్ని వేళల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ బస్సులు బయలుదేరే ముందు ప్రయాణికులకు వెల్కమ్ మెసేజ్ తో పాటు సేఫ్టీ కి సంబంధించిన వివరాలు తెలియచెప్పాలని సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవించినట్లయితే ముందుగా ప్రయాణికులను కాపాడే ప్రయత్నం చేయాలని తెలిపారు. ప్రయాణికు లకు నిరంతరం సురక్షితమైన రవాణా సేవలను అందించేందుకు సిబ్బంది ఎల్లవేళలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రయాణికులకు టి.జి.ఎస్.ఆర్టీసీ సురక్షిత ప్రయాణాన్ని అందిస్తోందని, సేఫ్ జర్నీతోనే ఎంతోమంది లైఫ్ లు ఆధారపడి ఉంటాయన్న విషయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ మరవకూడదన్నారు.

# దిగివస్తున్న బంగారం ధరలు

- రూ. 1140 మేర తగ్గుదల

హైదరాబాద్, అక్టోబర్27 (జనంసాక్షి) : ఊహించినట్టుగానే సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే బంగారం ధరలు మరింతగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లల్లో పసిడి ధరల తగ్గుదల, అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, డాలర్ బలపడుతుండటం వెరసి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో నేడు ట్రేడింగ్ మొదట్లో పసిడి ధరలు తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర గతంతో పోలిస్తే రూ. 1140 మేర తగ్గి రూ. 1,24,480కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1050 మేర తగ్గి రూ.1,14,100 వద్ద తచ్చాడుతోంది. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లల్లో కూడా పసిడి ధరలు తిరోగమనంలో పయనిస్తున్నాయి. ఔన్స్ బంగారం (24 క్యారెట్) స్పాట్ ధర రూ.0.7 శాతం మేర క్షీణించి 4,082.77 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర కూడా 1 శాతం మేర తగ్గి 4,095.80 డాలర్ల వద్ద కొనసాగుతోంది. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి ధరలు మరింత తగ్గే ఛాన్సుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అమెరికా, చైనా మధ్య సానుకూల వాతావరణంలో వాణిజ్య చర్చలు జరుగుతుండటంతో సురక్షిత పెట్టుబడి సాధనాలైన పసిడి, వెండికి డిమాండ్ తగ్గుతోందని నిపుణులు చెబుతున్నారు. ప్రామాణిక వడ్డీ రేట్ల కోత విషయంలో ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు తీసుకునే నిర్ణయం గురించి మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం కాస్త నెమ్మదించంతో కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్.. వడ్డీ రేట్లల్లో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశం ఉంది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ జపాన్ మాత్రం వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంది.

# ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్27 (జనంసాక్షి) : మరో అవినీతి చేప ఎసిబికి చిక్కింది. లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ. 15వేలు లంచం తీసుకుంటూ గ్రామ పాలనాధికారి బాణావత్ శ్రీనివాస్ నాయక్ పట్టుబడ్డారు. మండల పరిధిలోని వేముకుంట గ్రామానికి చెందిన ఓ రైతు తన రెండు ఎకరాల 30 కుంటల భూమి రిజిస్ట్రేషన్ కోసం భూభారతి యాప్ లో ఈ నెల 22న స్లాట్ బుక్ చేసుకున్నాడు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు జీపీవో రూ. 60 వేలు లంచం డిమాండ్ చేయగా.. అదే రోజు బాధితుడు రూ.40 వేలు చెల్లించాడు. కాగా మిగిలిన రూ. 20వేలను చెల్లిస్తేనే పని పూర్తవుతుందని చెప్పడంతో .. చేసేదేమీ లేక మళ్లీ రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు సోమవారం రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారుల ప్రమేయం ఉందా లేదా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ రమేశ్ తెలిపారు.

# పూజల పేరుతో మత్తుమందు చల్లి దోపిడీ

- దొంగబాబా ఆటకట్టించిన పోలీసులు

హైదరాబాద్, అక్టోబర్ 27 (జనంసాక్షి) : దుండిగల్ ప్రాంతంలో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని దొంగ బాబాల అవతారమెత్తి అడ్డగోలుగా డబ్బు సంపాదించాలని చూసిన ఓ ముఠా ఆటను పోలీసులు కట్టించారు. పూజల పేరుతో ప్రజలను మోసం చేస్తూ, ఆ తర్వాత మత్తుమందు చల్లి అపస్మారక స్థితిలో ఉన్న వారి నుంచి నగదు దోచుకుంటున్న ఈ కేటుగాళ్లను పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఓ వ్యక్తి దొంగ 'బాబా' అవతారం ఎత్తి, తన ముఠాతో కలిసి మోసాలకు పాల్పడుతున్నాడు. వీరు అమాయకులను లక్ష్యం చేసుకుని, వారి సమస్యలు పరిష్కరిస్తామని నమ్మించి పూజల పేరుతో ఇళ్లకు వెళ్లేవారు. పూజ సాకుతో మత్తుమందు చల్లి బాధితులు అపస్మారక స్థితికి చేరుకోగానే.. వారి వద్ద ఉన్న నగదును ఉడాయించడం ఈ ముఠా పద్ధతి. ఈ దొంగ బాబాల బాగోతంపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి ముఠాలోని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అయితే, ముఠాలో ఉన్న మరొకరు పరారీలో ఉన్నారు. పోలీసులు ఈ ముఠా నుంచి కీలక సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. డబ్బుల కోసం మాయమాటలు, మత్తుమందులు, ఆఖరికి బెదిరింపులకు కూడా సిద్ధపడిన ఈ ముఠా భరతం పట్టడంతో దుండిగల్ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లింపులేవీ?

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



హైదరాబాద్, అక్టోబర్ 27 (జనంసాక్షి) : పదవీవిరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు బెనిఫిట్స్, పింఛన్ ఇవ్వడం లేదని తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. . రెండేళ్ల నుంచి బెనిఫిట్స్ రావడం లేదని ముఖ్యమంత్రికి లేఖ రాశానని అన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందని రామచందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం రైతులకు బేడీలు వేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల కాళ్లు పట్టుకునే దుస్థితికి తీసుకొచ్చిందన్నారు. రైతులు పండించిన పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని అమ్మలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగులు, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది. రాష్ట్రంలో గన్ కల్చర్ పెరుగుతోంది. సాధారణ వ్యక్తికే కాదు.. పోలీసులకే రక్షణ లేకుండా పోయింది. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే.. రౌడీ షీటర్లపై కేసులు ఎత్తివేస్తుంది. వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుంది. మజ్లీస్‌తో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి భద్రతలను దెబ్బతీస్తోంది' అని ఆరోపించారు.

# చిరంజీవి డీప్‌ఫేక్ కేసుపై దర్యాప్తు

- త్వరలోనే ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేస్తాం
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి




హైదరాబాద్, అక్టోబర్27 (జనంసాక్షి) : మెగాస్టార్ చిరంజీవి ఫిర్యాదు చేసిన డీప్‌ఫేక్ కేసులో విచారణ చేస్తున్నట్లు నగర సీపీ సజ్జనార్ తెలిపారు. చిరంజీవి ఫొటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసిన కేటుగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీప్‌ఫేక్ కేసు విషయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డీప్‌ఫేక్ మూలాల్లోకి వెళ్లి నిందితులను అరెస్ట్ చేస్తామని చెప్పారు. ఇలాంటి డీప్‌ఫేక్ సెలబ్రిటీల కేసులు పెరిగే అవకాశం ఉందని అన్నారు. దీనిపై త్వరలోనే ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి విచారణ చేస్తామని ఆయన వెల్లడించారు. చాదర్‌ఘాట్ కాల్పుల కేసులో కూడా పురోగతి ఉందని స్పష్టం చేశారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. మెగాస్టార్ చిరంజీవి ఫొటోలను మార్ఫింగ్ చేసి అశ్లీల వీడియోలుగా మార్చి వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో దుండగులు పోస్ట్ చేశారు. దీంతో అవి వైరల్‌గా మారాయి. దీనిపై ఆయన వెంటనే సీపీ వీసీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కోర్టును సైతం ఆశ్రయించటంతో న్యాయస్థానం ఆదేశాలతో సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తన పేరును దెబ్బతీసేలా డీప్‌ఫేక్ వీడియోలు రూపొందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను మెగాస్టార్ చిరంజీవి కోరారు.

# మహిళా అధికారులకు మంత్రుల వేధింపులు

- వేధింపు మంత్రులను తొలగించండి
- అర్ధరాత్రిళ్లు వారిని పిలిపించుకోవడం ఏమిటి
- కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ కేంద్రమంత్రి బండి



కరీంనగర్, అక్టోబర్27 (జనంసాక్షి) : మహిళా అధికారులను కాంగ్రెస్ మంత్రులు వేధిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంటికి పిలిచి వార్నింగ్‌లు ఇస్తున్నారని విమర్శించారు. అర్ధరాత్రి మహిళా అధికారులను ఇంటికి పిలిపించుకోవడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. అలాంటి మంత్రులను కేబినేట్ నుంచి వెంటనే తొలగించాలని అన్నారు. ఈ మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే మహిళల నమ్మకం కోల్పోయిందని ఎద్దేవా చేశారు బండి సంజయ్ కుమార్. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించిన సందర్భంగా మీడియాతో కేంద్రమంత్రి మాట్లాడారు. మహిళా అధికారులపై కాంగ్రెస్ మంత్రుల వేధింపులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో పోలీసులకే రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా అధికారులని వేధింపులకి గురిచేసిన ఆ మంత్రులను వెంటనే బర్తరఫ్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆరోపించారు బండి సంజయ్ కుమార్. రౌడీషీటర్లు పోలీసులపై హత్యాయత్నం చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదా..? అని ప్రశ్నించారు. పట్టపగలు గోరక్షకులపై కాల్పులు జరిపితే ఏం చేస్తున్నారు..? అని నిలదీశారు. తప్పు చేసిన రౌడీషీటర్లకు ఎంఐఎం అండగా ఉంటే వారికే వత్తాసు పలుకుతారా..? అని ఫైర్ అయ్యారు. ఒక వర్గం ఓట్ల కోసం ఎంఐఎం నేతల కాళ్లు పట్టుకునే దుస్థితిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. మహిళలు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పుకొచ్చారు బండి సంజయ్ కుమార్. నెలకు రూ.2, 500లు, తులం బంగారం, స్కూటీపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. యూపీ తరహాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. రౌడీషీటర్లు బయటకు రావాలంటేనే గజగజ వణికేలా చేయాలని హెచ్చరించారు. సర్దార్ వల్లభాయిపటేల్ 150వ ఐక్యతా మార్చ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సర్దార్ వల్లభాయి పటేల్ చరిత్ర తెలుసుకోవాలని బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# నిర్మల్ అభివృద్ధికి 144.51 కోట్ల నిధులు మంజూరు

- నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ రూరల్,అక్టోబర్27(జనం సాక్షి)రోడ్ల అభివృద్ధిలో భాగంగా హమ్(హైబ్రిడ్ అన్యుటి మోడ్)నిర్మల్ నియోజకవర్గానికి 144.51 కోట్ల రూపాయలు మంజూరైనట్లు నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా 28 రోడ్లకు గాను రూ.69 కోట్లతో 84.4 కిలోమీటర్ల రోడ్ల పనులకు మంజూరైనట్లు తెలిపారు. రోడ్లు భవనాల శాఖ ద్వారా నిర్మల్ పట్టణంలో 3 రోడ్ల గాను 75.51కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. అలాగే నిర్మల్ పట్టణ అభివృద్ధికి 18.70 కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. పట్టణంలో అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజీలు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సారంగాపూర్ మండలం బీరవెల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పనులకు 69.10 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ లిఫ్టు ఇరిగేషన్ పునరుద్ధరణ పనులు పూర్తయితే దిగువ ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. త్వరలో పనులు జరగనున్నట్లు తెలిపారు. గిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణకు నిధులు మంజూరు చేసినందుకుగాను ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు

# నేడు రైతు నేస్తం కార్యక్రమం

హైదరాబాద్, అక్టోబర్27 (జనంసాక్షి) : వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో ఆయా ప్రాంతాల రైతులు పాల్గొనాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. ఈ మంగళవారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు పత్తి కొనుగోలు మరియు మొక్కజొన్న కొనుగోలు అంశాలపై మార్కెటింగ్, మార్క్ఫెడ్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) మరియు వ్యవసాయ శాఖ అధికారులతో కార్యక్రమం నిర్వహించబడును. కావున రైతు సోదరులు అందరూ తమ దగ్గరలో ఉన్న రైతు వేదికల ద్వారా పాల్గొని మీ సందేహాలను నివృత్తి చేసుకోగలరు. ఇతర వివరాలకు దగ్గరలోని వ్యవసాయ అధికారులను సంప్రదించగలరని సూచించారు.

# కర్నూలు బస్సు అగ్నిప్రమాదంపై తక్షణ విచారణ

- మానవ హక్కుల కమిషన్‌లో కేతిరెడ్డి ఫిర్యాదు

చెన్నై, అక్టోబర్27 (జనంసాక్షి) : కర్నూలు జిల్లా, చిన్నటెకూరు గ్రామం సమీపంలోని జరిగిన భయంకరమైన బస్సు అగ్నిప్రమాదంలో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో, తమిళనాడు తెలుగు యువశక్తి అత్యవసరమైన, ఉన్నత-స్థాయి స్వతంత్ర విచారణ, వ్యవస్థాగత సంస్కరణల కోసం డిమాండ్ చేసింది. ఈ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి, మరియు రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్ కి ఒక వివరణాత్మక విజ్ఞప్తిని సమర్పించారు. దీనితో పాటు,జాతీయ మానవ హక్కుల కమిషన్ లో కూడా అధికారికంగా ఫిర్యాదు దాఖలు చేశారు. ప్రైవేట్ స్లీపర్ బస్సు, మోటార్‌సైకిల్‌ను ఢీకొని, దానిని కొంత దూరం లాక్కెళ్లడం వల్ల నిప్పు రాజుకుంది. ఈ మంటలు బస్సును చుట్టుముట్టి, 20 మందికి పైగా ప్రయాణికులను బంధించి, చంపేశాయి. అగ్నిప్రమాదం అధికారిక అనుమతి లేని సరుకు, లిథియం-అయాన్ బ్యాటరీలతో సహా 234 అక్రమ స్మార్ట్‌ఫోన్‌లు వంటి వాటితో తీవ్రమైంది. వాహన భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలు,బస్సు ఆపరేటర్‌పై గతంలో ఉన్న 16 పెండింగ్ ఉల్లంఘనలు వివరించారు. అధిక సరుకు రవాణా నిషేధాన్ని మరియు వాహన ట్రాకింగ్‌ను అమలు చేయడంలో వైఫల్యం చెందారు. దేశవ్యాప్తంగా తప్పనిసరి బస్సు ఆడిట్‌లు, సరుకు స్క్రీనింగ్ మరియు నిబంధనలను ఉల్లంఘించిన డ్రైవర్లను బ్లాక్‌లిస్ట్ చేయాలని కోరారు. 'ఈ విషాదం కేవలం ప్రమాదం కాదు; ఇది దశాబ్దాల నిర్లక్ష్యం మరియు అమలు చేయని భద్రతా నిబంధనల అతిక్రమణ అన్నారు. దీపావళి వేడుకల నుండి తిరిగి వస్తున్న 20 మందికి పైగా అమాయక ప్రాణాలు, జామ్ అయిన నిష్క్రమణ ద్వారాలు మరియు అక్రమంగా రవాణా చేయబడిన వస్తువుల కారణంగా పెరిగిన ఇంధనంతో కూడిన అగ్నిప్రమాదంలో చిక్కుకొని సజీవ దహనమయ్యారు. బాధ్యులైన అధికారులను ప్రాసిక్యూట్ చేసి, శాశ్వత, కట్టుబడి ఉండే భద్రతా సంస్కరణలను ఏర్పాటు చేసే వరకు మేము విశ్రమించము. ఏ కుటుంబం కూడా మళ్లీ ఇలాంటి నష్టాన్ని భరించకుండా చూడటమే మా లక్ష్యం.' అని కేతిరెడ్డి ఆ ప్రకటన లో తెలిపారు

# తప్పుడు ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తా

- మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, అక్టోబర్ 27 (జనంసాక్షి) : తనపై పని కట్టుకుని ఒక వర్గం మీడియా, సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోందని, వికృత రాజకీయాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు పిర్యాదు చేయడంతో పాటు పరువు నష్టం దావా వేస్తానని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. ఆర్టీఐ ద్వారా కొన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని అడిగించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రచురించిన కథనాల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. 'నా పరువుకు భంగం కలిగించేలా, నన్ను అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా కుట్ర పన్నుతున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు వ్యక్తులు, వర్గాలు ఈ విధంగా అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు' అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసత్య ప్రచారంపై చట్టపరమైన చర్యలు ఇప్పటికే ప్రారంభించామని, ఆ వార్తను ప్రచురించిన సంస్థలు, సోషల్ మీడియా దపోస్టుల వెనుక ఉన్న బాధ్యులైనవ్యక్తులపై పరువు నష్టం దావా దాఖలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. "ప్రజాసేవకుడిగా నేను ఎల్లప్పుడూ ప్రజల మన్ననలు పొందే విధంగా నిష్పక్షికంగా, పారదర్శకంగా పని చేస్తున్నాను. నాకు ఉన్న రాజకీయ ప్రస్థానం ప్రజల నమ్మకం మీదే నిలిచింది. ఇలాంటి తప్పుడు ఆరోపణలతో నా పేరు చెడగొట్టాలన్న ప్రయత్నాలు విఫలమవుతాయి," అని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. ఏ సమాచారమైతే ప్రజలకు చేరవేస్తారో, అది నిజ నిర్ధారణ చేసుకుని ప్రచురించాలి. కేవలం పుకార్ల ఆధారంగా కథనాలు రాయడం ప్రజలను తప్పుదారి పట్టించడమే అవుతుంది," అని హెచ్చరించారు. తనపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న అసత్య ప్రచారం వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి, తగిన చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. అసత్య ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బోథ్ లో కూడా ఓ సభలో తాను మాట్లాడిన విషయాలను వక్రీకరించి బురద చల్లే ప్రయత్నం చేశారని, ఇప్పుడు ఇలా కట్టుకథలు అల్లి ఒక పథకం ప్రకారం తనను అప్రతిష్ట పాలు చేయడానికి కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అబద్ధపు ప్రచారాలు చేస్తున్నవారికి లీగల్ నోటీసులు పంపుతామని, పరువు నష్టం దావా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370